www.velthuru.com
RNI TEL TEL/ 2019 / 78609
రంగారెడ్డి
VELTHURU TELUGU DAILY
# వెలుతురు
తెలుగు దినపత్రిక
బుధవారం 13 నవంబర్ 2024
సంపుటి :06 సంచిక : 164 , పేజీలు : 12 వెల:రూ.5/-
TELANGANA, ANDHRA PRADESH



## రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం సత్యనారాయణ స్వామి వ్రతం

- కుటుంబ సభ్యులతో కలిసి వ్రతం నిర్వహించిన మంత్రి ప్రభాకర్

(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, నవంబర్ 12:** తెలంగాణ రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటూ సత్యనారాయణ స్వామి ఆశీస్సులు ఎల్లవేళలా రాష్ట్ర ప్రజలందరికీ ఉండాలని కోరుతూ వ్రతం జరిపినట్లు గా రాష్ట్ర రవాణా. కార్మిక శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మంగళవారం నాడు హుస్నాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లో ప్రజల సంక్షేమం, రాష్ట్ర ప్రజలు ఆయు ఆరోగ్యాలతో పాడి పంటలతో సంతోషంగా ఉండాలని కుటుంబ సభ్యుల కలిసి శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం కార్యక్రమాన్ని ఘనంగా మంత్రి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి ప్రభాకర్ కుటుంబ సభ్యులతో పాటుగా పలువురు ప్రముఖులు. పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ఢిల్లీ లో సీఎం రేవంత్ రెడ్డి ని కలిసిన నెదర్లాండ్స్ దేశ రాయబారి మరిసా

(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, నవంబర్ 12:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని మంగళ వారం నెదర్లాండ్స్ దేశ రాయబారి మరిసా జెరార్డ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఢిల్లీలోని సీఎం రేవంత్ రెడ్డి అధికారిక నివాసంలో జరిగిన ఈ భేటీలో టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి ,రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తోన్న కార్యక్రమాలు, భవిష్యత్ ప్రణాళికల పట్ల నెదర్లాండ్స్ రాయబారి ఆసక్తి కనబర్చారు.కాగా తెలంగాణ రాష్ట్రం పై నెదర్లాండ్స్ ప్రభుత్వం చూపిస్తున్న ఆసక్తి పట్ల తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సంతోషం వ్యక్తంచేశారు,

## కాలుష్య కోరల్లో చిక్కుకున్న ఢిల్లీ

### అధ్వాన స్థితికి చేరుకున్న గాలిలో నాణ్యత

న్యూఢిల్లీ, నవంబర్ 12 వెలుతురు :

2 లో..

## బిజెపి అభ్యర్థి పంకజ్ బోయర్ తరపున ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్



**మహారాష్ట్ర వెలుతురు నవంబర్ 12:** మహారాష్ట్ర వర్ద జిల్లాలోని బోర్ గావ్ లో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ బిజెపి అభ్యర్థి పంకజ్ బోయర్ తరపున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఎన్నికల కార్యచరణపై వారికీ దిశానిర్దేశం చేశారు. అంతకుముందు ఇంటింటికి తిరుగుతూ బిజెపి అభ్యర్థికి ఆదరించాలని అక్కడి ప్రజలను కోరారు. మరోసారి మహారాష్ట్రలో బిజెపి సర్కార్ రావడం ఖాయమని పేర్కొన్నారు.

# బిఆర్ఎస్ డైరెక్షన్‌లో లగచర్ల ఘార్మా ఘటన

- బిఆర్ఎస్ కుట్రలను సహించేది లేదు,
- కలెక్టర్‌పై భౌతిక దాడి దుర్మార్గపు చర్య,
- అభివృద్ధిని అడ్డుకోవడమే బిఆర్ఎస్ లక్ష్యం,
- అధికారం పోవడంతో ఉన్మాద చర్యలకు ప్రేరేపణ,
- మీడియా సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు హెచ్చరిక

- దాడిలో బిఆర్ఎస్ నేత పట్నం నరేందర్ రెడ్డి అనుచరుడు
- దాడికి పాల్పడేలా సురేశ్‌ను ప్రోత్సహించిన నరేందర్ రెడ్డి
- కెటిఆర్‌తో పలుమార్లు సంప్రదించిన నరేందర్ రెడ్డి
- దాడి ఘటనపై కూపీ లాగుతున్న పోలీసులు
- పరారీలో పట్నం అనుచరుడు సురేశ్
- ఘటనపై ఆరా తీసిన మంత్రి శ్రీధర్ బాబు
- రంగంలోకి దిగి వివరాలు సేకరిస్తున్న పోలీసులు



2 లో..

రాష్ట్రంలో ఏఐ రంగానికి పెద్దపీట

పీపీపీ విధానంలో ఏఐ సిటీని నిర్మిస్తాం

ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడి

## బిజెపి జాతీయ నాయకులతో కలిసి ఎమ్మెల్యే పాయల్ శంకర్ ప్రచారం..



**మహారాష్ట్ర వెలుతురు నవంబర్ 12:** మహారాష్ట్రలో జరుగుతున్న ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ఆదిలాబాద్ శాసనసభ్యులు

2 లో..

## గ్రూప్ -III పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

### - అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్



**వెలుతురు, రంగారెడ్డిజిల్లా. నవంబర్ 12:** ఈ నెల 17, 18 తేదీల్లో జరిగే గ్రూప్-III పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయల సముదాయ భవనంలోని సమావేశం మందిరంలో పోలీస్, నోడల్ అధికారులు, శాఖ అధికారులతో గ్రూప్-III పరీక్ష నిర్వహణపైసమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 17న రెండు పేపర్లు ఉంటాయని, ఉదయం 10 గంటల నుండి 12:30 గంటల వరకు మొదటి పేపర్ ఉంటుందని మధ్యాహ్నం 3.00 గంటల నుండి సాయంత్రం 5:30 గంటల వరకు రెండో పేపర్ నిర్వహించడం జరుగుతుందని 18వ తేదీన ఉదయం III పేపర్ ఉంటుందని

2 లో..

## రాష్ట్ర వ్యాప్తంగా 50,788 ఫోన్ల రికవరీ




- ఫోన్ల రికవరీ లో దేశంలోనే రెండో స్థానం
- రోజుకు సగటున 91 మొబైల్ ఫోన్లు రికవరీ
- డీజీపీ అధ్యక్షతన జరిగిన క్రైమ్ రివ్యూ మీటింగ్
- రివ్యూ మీటింగ్ లో పాల్గొన్న సైబర్ క్రైమ్ బ్యూరో డైరెక్టర్ షికా గోయల్

(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు. హైదరాబాద్ బ్యూరో, నవంబర్ 12:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పోగొట్టుకున్న 50,788 మొబైల్ ఫోన్లను రికవరీ చేసినట్లు గా సైబర్ క్రైమ్ బ్యూరో డైరెక్టర్ షికా గోయల్ వెల్లడించారు. మంగళ వారం జరిగిన హైదరాబాద్ నగర క్రైమ్ రివ్యూ సమావేశం రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్ అధ్యక్షతన జరిగింది. ఈ రివ్యూ సమావేశం లో 551 రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో 50 వేల 788 మొబైల్ ఫోన్లు పోగొట్టు కున్న వారి ఫోనులను రికవరీ చేసినట్లు గా తెలిపారు. అలాగే ఫోన్ల ను రికవరీ చేయడంలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం 2 వ స్థానంలో ఉందని షికా గోయల్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో సరా సరిగా రోజుకు సగటున 91 మొబైల్ ఫోన్లు రికవరీ అవుతున్నాయని డీజీపీ జితేందర్ తెలిపారు. ఈ క్రైమ్ రివ్యూ మీటింగ్ లో తెలంగాణ రాష్ట్ర ముఖ్య పోలీస్ అధికారులు. తెలంగాణ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణకు వస్తే గొర్రెల వ్యాపారం ఎలా జరుగుతుందో చూడొచ్చు

### 10 మంది ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లోకి తీసుకోలేదా..?

### మల్లిఖార్జున ఖర్గేకు కేటీఆర్ చురకలు



**న్యూఢిల్లీ, నవంబర్ 12 వెలుతురు :** అణిచివేసేందుకు, ఎన్నికైన ప్రభుత్వాలను కూల్చేందుకు ప్రధాని మోదీ ఎమ్మెల్యేలను గొర్రెలు కొన్నట్లు కొంటున్నారని కాంగ్రెస్ చీఫ్ మల్లిఖార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఖర్గే ఒకసారి తెలంగాణ వచ్చి చూస్తే.. ఇక్కడ గొర్రెల వ్యాపారం ఎంత బాగా నడుస్తుందో చూసి ఆశ్చర్యపోతారని విమర్శించారు. అతి పెద్ద గొర్రెల కొనుగోలుదారుడిని అందించినందుకు కాంగ్రెస్‌కు కృతజ్ఞతలు అంటూ వ్యంగ్యంగా చెప్పారు. బీఆర్ఎస్‌కు చెందిన 10 మంది ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పార్టీలోకి తీసుకున్నారని కేటీఆర్ అన్నారు. వాళ్లలో కొందర్ని కొనుగోలు చేశారని.. మరికొందరిని బెదిరించారని తెలిపారు. కానీ అలా పార్టీ మారిన ఎవరూ కూడా తమ పదవికి రాజీనామా చేయాలని పేర్కొన్నారు. ఆ 10 మంది ఎమ్మెల్యేలు ఇప్పుడు ఏ పార్టీలో ఉన్నారో వారికి కూడా తెలియని దయనీయ పరిస్థితి ఉందని విమర్శించారు. వారిని ప్రెస్ కాన్ఫరెన్స్‌లో నిలబెట్టి దీనిపై అడగాలని ఖర్గేను డిమాండ్ చేశారు. వాళ్లందరూ కూడా కోర్టులకు, తమ పదవి పోతుందేమోనని గజగజ వణికిపోతున్నారని తెలిపారు. సోమవారం నాడు మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మల్లిఖార్జున ఖర్గే ప్రధాని మోదీపై విరుచుకుపడ్డారు. విపక్షాలను అణిచివేసేందుకు, ఎన్నికైన ప్రభుత్వాలను కూల్చేందుకు ఎమ్మెల్యే గొర్రెలను కొన్నట్లుగా కొంటున్నారని ఆరోపించారు. నలుగురు వ్యక్తులు ( మోదీ, అమిత్‌షా, అదానీ, అంబానీ) నలుగురు కలిసి దేశాన్ని నడిపిస్తున్నారని విమర్శించారు. మోదీ అబద్ధాల కోరు అని.. తన వాగ్దానాలను ఎప్పుడూ నెరవేర్చలేదని అన్నారు.



(మొదటి పేజీ తరువాయి..)

## బిజెపి జాతీయ నాయకులతో కలిసి ఎమ్మెల్యే పాయల్ శంకర్ ప్రచారం..



పాయల్ శంకర్ జాతీయ నాయకులతో కలిసి హింగన్ ఘాట్ లో పాల్గొన్నారు. ఈనెల 20న మహారాష్ట్రలో ఎన్నికలు జరుగుతున్న విషయం తెలిసిందే. బిజెపి జాతీయ ఆర్గనైజింగ్ సెక్రటరీ బిఎల్ సంతోష్ గారితో వార్ధా ఎన్నికల ఇంచార్జ్ పాయల్ శంకర్ మంగళవారం రోజున భేటీ అయ్యారు. ప్రచార సరళి గురించి వివరించారు. శక్తి కమిటీలు, బూత్ కమిటీల నిర్మాణం, పార్టీ మేనిఫెస్టో గురించి కార్యకర్తలకు వివరించారు. కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతూ బిజెపి విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బిఎల్ సంతోష్ గారు ఎమ్మెల్యేకు వివరించారు. వార్ధా లో బిజెపి అభ్యర్థి గెలుపు ఖాయమని ఎమ్మెల్యే వివరించారు. జాతీయ నాయకుల రాకతో బిజెపి ప్రచారం మరింత ఉధృతమైంది. ఈకార్యక్రమంలో బిజెపి నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాలుష్య కోరల్లో చిక్కుకున్న ఢిల్లీ

దేశ రాజధాని ఢిల్లీ కాలుష్య కోరల్లో చిక్కుకుంది. గత కొన్ని రోజులుగా ఇక్కడ వాయు కాలుష్యం తీవ్రస్థాయిలో ఉంది. గాలి నాణ్యత సూచీ అధ్వాన స్థితిలో నమోదవుతోంది. మంగళవారం ఉదయం కూడా గాలి నాణ్యత అధ్వానంగా నమోదైంది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రకారం.. ఉదయం 8 గంటల సమయంలో ఢిల్లీలో గాలి నాణ్యత 355గా నమోదైంది. అశోక్ విహార్ వద్ద 367, ద్వారకా సెక్టార్ 8 వద్ద 390, డీటీయూ వద్ద 366, జహంగిరిపురిలో 417, లోధి రోడ్డులో 313, ముండ్కాలో 404, నజఫ్‌గఢ్‌లో 355, నరేలాలో 356, ఆనంద్ విహార్‌లో 403, ప్రతాప్‌గంజ్‌లో 371, పూసాలో 320, ఆర్కే పురంలో 365, రోహిణిలో 415, షాదీపూర్‌లో 359, వివేక్ విహార్‌లో ఏక్యూఐ లెవల్స్ 385గా నమోదయ్యాయి. రోజురోజుకూ గాలి నాణ్యత క్షీణిస్తుండటంతో రాజధాని వాసులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. శ్వాస తీసుకోవడం వంటి అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో రాజధానిలో కాలుష్య స్థాయిలు ప్రమాదకరంగా మారుతుండటంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితికి దీర్ఘకాలిక పరిష్కారాన్ని చూపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. 'గత 25 ఏళ్లుగా ఢిల్లీలోనే ఉంటున్నాను. ఇటీవలే కాలంలో రాజధానిలో కాలుష్యం తీవ్రమవుతోంది. ప్రభుత్వం క్రాకర్స్‌పై మాత్రమే ప్రధానంగా దృష్టి పెడుతోంది. అయితే, దీనికి ప్రధాన కారణం సమీప రాష్ట్రాల్లో పంట వ్యర్థాలను తగలపెట్టడమే' అని కర్తవ్య పథ్ వద్ద వరుణ్ అనే వ్యక్తి అన్నారు. మరో ఢిల్లీ నివాసి అంకిత్ సచ్‌దేవా మాట్లాడుతూ.. రాజధానిలో సౌకర్యాల కోసం ప్రభుత్వానికి పన్నులు కడుతున్నామన్నారు. అయినప్పటికీ ఈ పరిస్థితి ఉందన్నారు. నగరంలో కాలుష్య నివారణకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గాలి నాణ్యత సున్నా నుంచి 50 మధ్య ఉంటే బాగా ఉన్నట్టు అర్థం. 51 నుంచి 100 వరకు ఉంటే సంతృప్తికరమైనదని, 101 నుంచి 200 వరకు ఉంటే మితమైన నాణ్యత, 201 నుంచి 300 ఉంటే తక్కువ నాణ్యత అని, 301 నుంచి 400 వరకు ఉంటే చాలా పేలవమైనదని, 401 నుంచి 500 ఉంటే ప్రమాదకరస్థాయిగా పరిగణిస్తారు. అయితే, గత కొంతకాలంగా ఢిల్లీలో గాలి నాణ్యత ప్రమాదకరంగా మారుతోన్న విషయం తెలిసిందే. పొరుగు రాష్ట్రాల్లో పంట వ్యర్థాలను తగలపెట్టడానికి తోడు.. మంచు రాజధానిని కమ్మేయడంతో ఈ పరిస్థితి తలెత్తుతోంది. కాలుష్య నియంత్రణకు పాలకులు ఎన్ని చర్యలు చేపట్టినా ఫలితం ఉండటం లేదు. రోజురోజుకూ గాలి నాణ్యత క్షీణిస్తోంది. ఈ కారణంగా నగర వాసులు తీవ్ర అనారోగ్య సమస్యలకు గురికావాల్సి వస్తోంది.

## గ్రూప్ -III పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి



తెలిపారు. అభ్యర్థులను పరీక్షకు ఉదయం 8.30 గంటల నుండి 9:30 గంటల వరకు పరీక్ష కేంద్రాల్లో అనుమతిస్తారని, 9.30 గంటల తర్వాత గేట్లు మూసి వేయబడుతాయని, ఆలస్యంగా వస్తే అభ్యర్థులను అనుమతించరని తెలియజేస్తారు. నోడల్ అధికారులు, చీఫ్ సూపరిండెంట్లు, డిపార్ట్మెంట్ అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వహించాలని కోరారు. ఈ గ్రూప్- III పరీక్షకు జిల్లాలో 56,394 మంది అభ్యర్థులు రాస్తున్నారని తెలిపారు. ఫ్లయింగ్ స్కాడ్స్, ఐడెంటిఫికేషన్ అధికారులు, శాఖాపరమైన అధికారులు, నోడల్ అధికారులు చేయాల్సిన పనులపై అదనపు కలెక్టర్ వివరించారు. పరీక్ష నిర్వహణలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తగా నిర్వహించాలని, పోలీస్ నోడల్ అధికారి, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ కరుణాకర్ రావు తెలిపారు. ఈ సమావేశంలో నోడల్ అధికారులు రామారావు, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ అధికారి, ఇతర నోడల్ అధికారులు, డిపార్ట్మెంట్ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు అధ్యక్షతన ఎన్డీయే భేటీ

**అమరావతి,నవంబర్12( వెలుతురు):**
ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఎన్డీయే శాసనసభాపక్ష సమావేశం కొనసాగింది. తెదేపా, జనసేన, భాజపా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సమావేశానికి హాజరయ్యారు. శాసనసభ, మండలిలో అనుసరించే వ్యూహం, రాజకీయ పరిణామాలపై చర్చించినట్టు సమాచారం. ఉభయ సభల్లో చీఫ్ విప్, విప్‌ల నియామకంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. సోమవారం జరిగిన బీఏసీలో సీఎం చంద్రబాబు... చీఫ్‌విప్, విప్‌ల ప్రస్తావన తెచ్చారు. శాసనసభలో 9 మంది విప్‌లను నియమిస్తారని ప్రచారం జరుగుతోంది. తెదేపా నుంచి ఐదుగురు, జనసేన నుంచి ముగ్గురు, భాజపా నుంచి ఒకరికి అవకాశం కల్పిస్తారని తెలుస్తోంది. శాసనసభ డిప్యూటీ స్పీకర్‌ను నియమించే అవకాశముంది.

# బిఆర్ఎస్ డైరెక్షన్‌లో లగచర్ల ఫార్మా ఘటన

**హైదరాబాద్,నవంబర్12 వెలుతురు:**
ఫార్మా భూసేకరణ సందర్భంగా వికారాబాద్ జిల్లా లగచర్ల గ్రామంలో కలెక్టర్, పలువురు అధికరాఉలపై దాడి బిఆర్ఎస్ కుట్రగా బయటపడుతోంది. దాడిలో పల్గొన్న వారంతా పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. ఫార్మా కంపెనీ ఏర్పాటుకు అభిప్రాయ సేకరణ కోసం వెళ్లిన వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ దాడి జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ దాడి వెనక బీఆర్ఎస్ నేత పట్నం నరేందర్ రెడ్డి ప్రధాన అనుచరుడు బోగమోని సురేష్ హస్తం ఉన్నట్లు పోలీసులు తేల్చారు. ఉద్దేశ్యపూర్వకంగా అధికారులు, కలెక్టర్‌ను పక్కకు తీసుకెళ్లిన బోగమోని సురేష్.. గ్రామస్థులను ఉసిగొల్పి దాడికి పాల్పడినట్లు పోలీసులు కనుగొన్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న బోగమోని సురేష్ దాడి జరగడానికి ముందు నరేందర్ రెడ్డితో 42 సార్లు ఫోన్‌లో మాట్లాడినట్లు పోలీసులు కనుగొన్నారు. అదే సమయంలో నరేందర్ రెడ్డి.. సురేష్‌తో మాట్లాడుతూనే కేటీఆర్‌కు ఫోన్లు చేసినట్లు తేల్చారు. బోగమోని సురేష్‌పై రేప్ సహా పలు కేసులు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అతను పరారీలో ఉన్నాడు. అతని కోసం ప్రత్యేక పోలీస్ బృందాలు ముమ్మరంగా గాలిస్తున్నాయి. ఈ ఘటనను సీరియస్‌గా తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం విచారణకు ఆదేశించింది.సోమవారం అర్ధరాత్రి 28 మంది గ్రామస్థులను అదుపులోకి తీసుకుని పరిగి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. అరెస్ట్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా లగచర్లలో భారీ బందోబస్త్ ఏర్పాటు చేశారు. లగచర్ల ఘటనపై సమగ్ర నివేదిక అందజేయాలని తెలంగాణ డీజీపీ జితేందర్‌ను ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతంలో లా అండ్ ఆర్డర్ పరిస్థితి సమీక్షించాలని ఏడీజీ మహేష్ భగవత్‌ను డీజీపీ ఆదేశించారు. ఈ నేపథ్యంలో వికారాబాద్ కలెక్టర్‌పై దాడి ఘటన అనంతరం చోటు చేసుకున్న పరిణామాలను ఏడీజీ మహేష్ భగవత్ సమీక్షించారు. అనంతరం ప్రభుత్వానికి ఆయన సమగ్ర నివేదకను అందించనున్నారు. అందుకోసం ఇప్పటికే మహేశ్ ఎం భగవత్ వికారాబాద్‌కు బయలుదేరి వెళ్లారు. అయితే ఈ దాడి ఘటనలో ఏడీజీ నివేదికే అత్యంత కీలకం కానుంది. ఈ నివేదిక ఆధారంగా ప్రభుత్వం చర్యలు చేపట్టే అవకాశాలున్నాయని తెలుస్తుంది. అలాగే దోషులపైన కఠిన చర్యలు తీసుకోవాలని ఇప్పటికే ప్రభుత్వం గట్టిగా నిర్ణయించినట్లు సమాచారం. అందులోభాగంగా మంగళవారం ఉదయం హైదరాబాద్‌లో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబుతో వికారాబాద్ జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఐజీ సమాశమయ్యారు. సోమవారం దాడి ఘటనపై వారి నుంచి మంత్రి శ్రీధర్ బాబు వివరాలను అడిగి తెలుసుకున్నారు. మరోవైపు జిల్లా కలెక్టర్‌పై దాడి ఘటనలో.. బీఆర్ఎస్ నేతలతోపాటు పలువురిపై పోలీసులు ఇప్పటికే నాలుగు కేసులు నమోదు చేశారు. ఈ దాడి కేసులో పలు ఆసక్తికర విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. లగచర్ల దాడిలో ప్రధాన నిందితులు సురేష్‌పై నమోదు అయిన కేసులను తొలగించేందుకు పట్నం నరేందర్ రెడ్డి కీలకంగా వ్యవహరించినట్లు పోలీసుల విచారణలో బహిర్గతమైంది. వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం.. లగచర్ల, పోలేపల్లిలో 1350 ఎకరాల్లో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు కోసం ప్రభుత్వం కసరత్తు చేస్తుంది. తొలుత ఫార్మా విలేజ్ ఏర్పాటు చేద్దామని ప్రభుత్వం భావించింది. దీనికి ఆయా గ్రామస్తుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఆ క్రమంలో ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకుంది. అందులోభాగంగా కారిడార్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అందుకోసం సోమవారం.. దుద్యాలలో అధికారులు గ్రామ సభ, ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. కార్యక్రమం కోసం ఉదయమే.. జిల్లా కలెక్టర్ ప్రతీక జైన్‌తోపాటు జిల్లాకు చెందిన ఉన్నతాధికారులు దుద్యాలకు వచ్చారు. కానీ గంట సేపే వేచి చూసినా.. ఆయా గ్రామస్తులు ఎవరు ఈ కార్యక్రమానికి హాజరుకాలేదు. ఇంతలో జిల్లా కలెక్టర్ వద్దకు స్థానిక బీఆర్ఎస్ నేత సురేశ్ వచ్చారు. రైతలంతా లగచర్లలో మీ కోసం వేచి చూస్తున్నారని చెప్పారు. దీంతో జిల్లా కలెక్టర్‌తోపాటు ఇతర ఉన్నతాధికారులు 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న లగచర్లకు వెళ్లారు. స్థానిక రామాలయం వద్ద రైతులతో జిల్లా ఉన్నతాధికారులు మాట్లాడుతున్నారు. అదే సమయంలో దాదాపు 20 నుంచి 30 మంది జిల్లా కలెక్టర్ వైపు దూసుకు వచ్చారు. ఈ విషయాన్ని గమనించిన జిల్లా కలెక్టర్ వ్యక్తిగత సిబ్బంది వెంటనే అప్రమత్తమయ్యారు. దీంతో ప్రతీక్ జైన్‌ను.. ఆయన కారు వద్దకు తీసుకు వెళ్లారు. ఇక అదే సమయంలో ఇతర ఉన్నతాధికారులపై దాడి చేసేందుకు వారు ముందుకు కదిలారు. వారిని సైతం జిల్లా కలెక్టర్ అప్రమత్తం చేశారు. ఇంతలో వ్యక్తిగత సిబ్బంది.. వెంటనే జిల్లా కలెక్టర్‌ను కారులో ఎక్కించారు. అదే సమయంలో ఆ కారుపై రాళ్లు, కర్రలతో దాడి చేశారు. ఈ ఘటనలో కారు వెనుక అద్దాలు పగిలిపోయాయి. అయితే అడిషనల్ జిల్లా కలెక్టర్ లింగ్యా నాయక్‌తోపాటు స్పెషల్ ఆఫీసర్ వెంకట్ రెడ్డిపై తీవ్రంగా దాడి చేశారు. ఈ ఘటనలో వారు తీవ్రంగా గాయపడ్డారు. వారు దాడి నుంచి తప్పించు కోనేందుకు పంట చేలోకి పారిపోయారు. ఇంతలో సమాచారం అందడంతో.. లగచర్లకు పోలీసులు వచ్చారు. దీంతో ఈ ఇద్దరు ఉన్నతాధికారులను పోలీసులు రక్షించారు. మరోవైపు జిల్లా ఉన్నతాధికారులపై దాడి ఘటన నేపథ్యంలో రెవెన్యూ ఉద్యోగులు నిరసన బాట చేపట్టారు. ఈ ఘటనకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

### - రాష్ట్రంలో ఏఐ రంగానికి పెద్దపీట

రాష్ట్రంలో ఏఐ రంగానికి పెద్దపీట వేస్తున్నామని, మరో నాలుగైదు నెలల్లో పీపీపీ విధానంలో ఏఐ సిటీని నిర్మిస్తామని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. గ్లోబల్ లాజిక్ సాఫ్ట్‌వేర్ నూతన కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. 'అన్ని రకాల పెట్టుబడులకు హైదరాబాద్ అనుకూలం. గ్లోబల్ క్యాపబులిటీ సెంటర్లు హైదరాబాద్‌లో నెలకొల్పు తున్నారు. పెట్టుబడిదారులకు ప్రభుత్వం తగిన తోడ్పాటునందిస్తోంది. బహుళజాతి కంపెనీలే కాకుండా ఎంఎస్‌ఎంఈలకు ప్రోత్సాహం అందిస్తున్నాం. ప్రస్తుతం ఐటీ ఎగుమతులు 12 శాతానికి చేరాయి. వచ్చే ఐదేళ్లలో 20శాతానికి ఐటీ ఎగుమతులను పెంచేలా ప్రణాళిక రూపొందించాం. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లోనూ ఐటీ కంపెనీలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పిస్తున్నాం. స్కిల్ యూనివర్సిటీ ద్వారా యువతలో నైపుణ్యాలు పెంపొందిస్తున్నాం. మలేసియాలోని తెలుగువాళ్లు హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తిగా ఉన్నారని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు.

### -బిఆర్ఎస్ కుట్రలను సహించేది లేదు

లగచర్ల ఘటన వెనక ఎవరున్నా వదిలి పెట్టే ప్రసక్తే లేదని ఐటిశాఖ మంత్రి శ్రీధర్ బాబు హెచ్చరించారు. దీనివెనక బిఆర్ఎస్ నేతల హస్తం ఉందని తెలుస్తోందని, ఎవరున్నా.. ఎంతటి వారున్నా వదిలేది లేదని మంత్రి స్పష్ట చేశారు. వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. సీఎల్పీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అధికారం పోయిందనే ఆక్రోషంతో బీఆర్ఎస్ కుట్రలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఏ కార్యక్రమం చేపట్టినా అడ్డుకోవడం బీఆర్ఎస్ కు అలవాటుగా మారిందని విమర్శించారు. అభివృద్ధి అవరోధకులుగా బీఆర్ఎస్ నేతలు తయారయ్యారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఏ రోజు ఈ విధంగా వ్యవహరించలేదని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రగతికి పరిశ్రమలు ఎంతో ముఖ్యమని.. ఇందులో భాగంగానే ప్రభుత్వం పరిశ్రమలను ఏర్పాటు చేస్తుంటే బీఆర్ఎస్ అడ్డుపడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పథకం ప్రకారమే కొందరు రైతులను రెచ్చగొట్టి కలెక్టర్‌పై భౌతిక దాడికి పాల్పడేలా చేశారని కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వ విధానాలను అడ్డుకునే ప్రయత్నం చేస్తే ఉపేక్షించమని తేల్చి చెప్పారు. కలెక్టర్‌పై దాడి ఘటనపై కచ్చితంగా సమగ్ర విచారణ చేస్తామని చెప్పారు. కలెక్టర్‌పై దాడి ఘటనలో కుట్రదారులెవరు.. తప్పుదోవ పట్టించి కలెక్టర్‌ను గ్రామంలోకి తీసుకెళ్లింది ఎవరనే దానిపై సమగ్ర విచారణ జరిపిస్తామని స్పష్టం చేశారు. అభివృద్ధిని అడ్డుకోవాలని ఎవరూ ప్రయత్నించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు, ప్రజలకు ఏమైనా అభ్యంతరం ఉంటే ప్రజాస్వామ్య పద్దతిలో చెప్పొచ్చని.. ఇలా అధికారులపై భౌతికి దాడులకు పాల్పడటం సరికాదని హితవు పలికారు. సమస్యలపై ప్రజాస్వామిక పద్దతిలో ముందుకెళు_న్నామన్నారు. రైతులను సభాస్థలికి రాకుండా కొందరు అడ్డగించారని.. దీంతో రైతుల వద్దకే వెళ్లి సమస్యలు తెలుసుకుందామని కలెక్టర్ వెళ్లాడని.. ఈ క్రమంలోనే పథకం ప్రకారం అధికారులపై దాడి చేశారని చెప్పారు. అప్రజాస్వామికంగా దాడులు చేస్తే సహించమని గట్టిగా వార్నింగ్ ఇచ్చారు.

## పాతికేళ్లలో భారత్‌ను విశ్వగురుగా తీర్చిదిద్దాలి

**యువత ఈ సవాల్ ను స్వీకరించాలి**

**కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి పిలుపు**

**హైదరాబాద్,నవంబర్12 వెలుతురు:**
పాతికేళ్లలో భారత్‌ను విశ్వగురుగా తీర్చిదిద్దే సవాల్‌ను స్వీకరించాలని, యువత ఈ దిశగా కృషిచేయాలని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. కేంద్రీయ విద్యాలయాలు శక్తివంతమైన మినీ ఇండియా లాంటివని, ప్రతీ పాఠశాల భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతిబింబంగా నిలుస్తుందని కిషన్‌రెడ్డి అన్నారు. తిరుమలగిరి కేంద్రీయ విద్యాలయంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి ఉత్సవాలలో భాగంగా ఏర్పాటు చేసిన రాష్ట్రీయ ఏక్తా పర్వ్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఏక్ భారత్ శ్రేష్ఠ్ కార్యక్రమం కింద భిన్న సంస్కృతులను ఏకం చేసే కృషి జరుగుతుందని చెప్పారు. రాష్ట్రీయ ఏక్తా పర్వ్ లాంటి కార్యక్రమాలు దేశాన్ని సాంస్కృతికంగా ఏకం చేయడానికి దోహదం చేస్తాయన్నారు. 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారటంలో యువత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. 75 ఏళ్ల స్వాతంత్యం÷-ర అనంతరం కూడా దేశంలో



సాంస్కృతిక సమగ్రత పటిష్ఠంగా ఉందన్నారు. దేశ యువశక్తిని నైపుణ్యాలతో సుసంపన్నం చేయడానికి ఇలాంటి ఉత్సవాలు దోహదపడతాయన్నారు. దేశంలోని 25 రాష్ట్రాలకు చెందిన సాంస్కృతిక చరిత్రను ప్రతిబింబించే కళలు, ఆచార వ్యహారాలను ప్రతిబింబించే స్టాళ్లను ఆయా రాష్ట్రాల విద్యార్థులు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కేంద్ర విద్యాశాఖ కార్యదర్శి సంజయ్‌కుమార్, కేంద్రీయ విద్యాలయ సంఘటన్ కమిషనర్ నిధి పాండే, హైదరాబాద్ రీజన్ కేంద్రీయ విద్యాలయ సంఘటన్ సహాయ కమిషనర్ మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్న హరీశ్‌రావు

**రాజన్న సిరిసిల్ల, నవంబర్ 12 వెలుతురు:**
వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు మంగళవారం దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు ఆలయ అర్చకులు హరీశ్ రావుకు



ఘన స్వాగతం పలికారు. స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కాగా, మంగళవారం కోరుటల్లో ఉదయం 8 గంటలకు కోరుట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ఆధ్వర్యంలో ప్రారంభమయ్యే రైతు పాదయాత్ర వెంకటాపూర్, మేడిపల్లి, తాటిపెల్లి, చల్‌గల్ మీదుగా జగిత్యాలకు చేరుకోనున్నది. చల్‌గల్ సమీపంలో హరీశ్ రావు పాదయాత్రకు సంఘీభావం తెలియజేసి, అక్కడి నుంచి జగిత్యాల జిల్లా కేంద్రానికి వచ్చి సమావేశం నిర్వహించనున్నారు. అనంతరం కలెక్టరేట్‌కు వెళ్లి వినతిపత్రం సమర్పించనున్నారు.

# నాసిరకం, నకిలీ మెడిసిన్ తయారీపై నజర్

**కఠిన చర్యలకు ఉపక్రమించిన వైద్యారోగ్యశాఖ**

**అమ్మేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలి**

**అధికారులను ఆదేశించిన మంత్రి దామోదర**

**హైదరాబాద్,నవంబర్12 వెలుతురు:**
నాసిరకం, నకిలీ మెడిసిన్ తయారు చేసే ముఠా ఆటకట్టించేందుకు తెలంగాణ ఆరోగ్య శాఖ సిద్ధమైంది. వాటిని అమ్మేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డ్రగ్ కంట్రోల్ అథారిటీ అధికారులను ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ ఆదేశించారు. ఫార్మా ఇండస్ట్రీస్, డ్రగ్ మ్యానుఫాక్చరింగ్ యూనిట్స్, మెడికల్ హాల్స్, ఫార్మసీలలో మరింత విస్తృతంగా తనిఖీలు చేయాలని ఆయన సూచించారు. ప్రభుత్వ దవాఖాన్లకు పంపిణీ చేసే మెడిసిన్ కొనుగోలు విషయంలో టీజీఎంఎస్ఐడీసీకి అవసరమైన సహకారాన్నిడ్రగ్ కంట్రోల్ అథారిటీ అందించాలని మంత్రి సూచించారు. టీజీఎం ఎస్ఐడీసీకి మెడిసిన్ సప్లై చేసే సంస్థల మానుఫాక్చరింగ్ యూనిట్స్‌ను డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు తనిఖీ చేయాలని, ర్యాండమ్ గా మెడిసిన్ శాంపిల్స్ సేకరించి టెస్ట్ చేయాలని ఆదేశించారు. మెడిసిన్ ప్రొక్యూర్‌మెంట్‌కు ముందు తర్వాత కూడా ఈ పక్రియ కొనసాగించాలన్నారు. నిబంధనలు పాటించక పోయినా, నాసిరకం మెడిసిన్ అని తేలినా, ఆయా సంస్థలను బ్లాక్‌లిస్టులో పెట్టాలని సూచించారు. ఫార్మా సంస్థలు ఉన్న చోట అదనంగా డ్రగ్ ఇన్‌స్పెక్టర్లను నియమించాలన్నారు. ప్రజల ప్రాణాలతో ముడిపడి ఉన్న అంశంలో ఎలాంటి రాజీ ఉండకూడదన్నారు. డ్రగ్స్‌కు సంబంధించిన ఫిర్యాదుల స్వీకరణకు కలెక్టరేట్లలో కంప్లైంట్ సెల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ మేరకు మంగళవారం, డ్రగ్ కంట్రోల్ అథారిటీ అధికారులు, తెలంగాణ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులతో వెంగళరావునగర్‌లోని డీసీఏ ఆఫీసులో మంత్రి రాజ నర్సింహ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెడిసిన్‌కు సంబంధించిన ఫిర్యాదుల స్వీకరణ, ఆకస్మిక తనిఖీల కోసం స్టేట్ విజిలెన్స్ సెల్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ ఏడాది 21,639 తనిఖీలు నిర్వహించి, 3416 సంస్థలపై(మెడికల్ షాప్స్, మానుఫాక్చరింగ్ యూనిట్స్) యాక్షన్ తీసుకున్నామని డీసీఏ అధికారులు మంత్రికి



తెలిపారు. రాష్ట్రంలో డ్రగ్ టెస్టింగ్ ల్యాబ్ ఒక్కటే ఉందని, దీనివల్ల ఎక్కువ సాంపిల్స్‌ను టెస్ట్ చేయలేకపోతున్నామని అధికారులు మంత్రికి తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో(1956) ప్రారంభమైన ఈ ల్యాబులో నెలకు గరిష్టంగా 400 సాంపిల్స్ మాత్రమే పరీక్షించ గలుగుతున్నామని వివరించారు. ఈ ఏడాది ఇప్పటివరకూ 3255 సాంపిల్స్ మాత్రమే టెస్ట్ చేయగలిగామని తెలిపారు. 2014 నాటికి సుమారు 20 వేల మెడికల్ షాపులు ఉంటే, ఇప్పుడు 45 వేలకు పెరిగాయని.. కానీ, గత పదేండ్లలో కొత్తగా డ్రగ్ టెస్టింగ్ ల్యాబ్స్ రాలేదని, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల సంఖ్యను పెంచలేదన్నారు. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా కొత్త ల్యాబులను ఏర్పాటు చేస్తామని మంత్రి అధికారులకు తెలిపారు. హైదరాబాద్‌లో ప్రస్తుతం ఉన్న ల్యాబ్ ఆధునీకరణ, కొత్తగా 4 ల్యాబుల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. మషల్కర్ కమిటీ సిఫారసులకు అనుగుణంగా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల సంఖ్యను పెంచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. ప్రస్తుతం 71 మంది డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు మాత్రమే ఉన్నారని, కనీసం 150(అడిషనల్‌గా ఇంకో 80 పోస్టులు) మంది అవసరం అని అధికారులు మంత్రికి తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి గారితో చర్చించి అవసరమైనమేర పోస్టులు మంజూరు చేయిస్తామని మంత్రి తెలిపారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్లను వారు పనిచేస్తున్న ఏరియాకే పరిమితం చేయొద్దని, ర్యాండమ్‌గా ఇతర డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల పరిధిలోని సంస్థల్లో తనిఖీలకు పంపించాలని డీజీ కమలాసన్‌రెడ్డిని మంత్రి ఆదేశించారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు, డీఎంహెచ్‌వోలతో కోఆర్డినేట్ చేసుకోవాలన్నారు. మెడిసిన్ ధరలు, నాణ్యత విషయంలో నిబంధనలు ఉల్లఘించే హస్పిటళ్ల సమాచారాన్ని డీఎంహెచ్‌వోలకు అందజేయాలని, ఆయా హాస్పిటళ్లపై క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. హాబిట్ ఫార్మింగ్ డ్రగ్స్‌ను(మత్తును కలిగించే మెడిసిన్) విచ్చలవిడిగా అమ్ముతున్నవారిపై నిఘా పెట్టాలని మంత్రి సూచించారు. టీజీఎంఎస్ఐడీసీ పరిధిలో ఉండే సెంట్రల్ మెడికల్ స్టోర్స్‌ను కూడా డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు తనిఖీ చేయాలని, అక్కడ మెడిసిన్ సరియైన విధానంలో భద్రపరుస్తున్నారో, లేదో చెక్ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ హాస్పిటల్స్‌కు వచ్చే పేషెంట్లకు నాణ్యమైన మెడిసిన్ అందించేలా డీసీఏ, టీజీఎంఎస్ఐడీసీ చర్యలు ఉండాలన్నారు. సమావేశంలో హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తూ, డీసీఏ డీజీ విబి.కమలాసన్‌రెడ్డి, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ హేమంత్ సహదేవరావు, డీసీఏ జాయింట్ డైరెక్టర్ జి.రాందాన్ తదితరులు పాల్గొన్నారు.

## అరెస్టులతో అడాయిని ఆపలేరు

**రైతులను తీవ్రవాదులుగా చూస్తారా**

**ఎక్స్ వేదికగా కెటిఆర్ ఆగ్రహం**

**హైదరాబాద్,నవంబర్12( వెలుతురు):**
అరెస్టులతో లగచర్ల లడాయిని ఆపలేరని, బెదిరింపులతో రైతులను భయపెట్టలేరని భారాసకార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. కొడంగల్ నియోజకవర్గంలో సోమవారం చోటుచేసుకున్న ఘటన నేపథ్యంలో జరిగిన అరెస్టులపై ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. అర్ధరాత్రి 300 మంది పోలీసులను పంపి రైతులను అరెస్ట్ చేస్తారా..? అని ప్రశ్నించారు. రైతులను తీవ్రవాదులు అనుకుంటున్నారా? ఇదేనా ప్రజాస్వామ్య పాలన.. రైతు సంక్షేమ పాలన? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ తీరు అమానుషమని ఆ పార్టీకి చెందిన మరో సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. లగచర్ల వాసులను తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 300 మంది పోలీసులు గ్రామానికి చేరుకొని అరెస్టు చేయడం దారుణమన్నారు.

## వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయ సిబ్బంది పై దాడి కి నిరసనగా టిజిపిసిబి హెడ్ ఆఫీస్ ముందు ఉద్యోగులు సిబ్బంది నిరసన



**హైదరాబాద్ వెలుతురు నవంబర్ 12:**
వికారాబాద్ జిల్లాలో ఫార్మా సిటీ ఏర్పాటు చేయడానికీ తీసుకున్న ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా భూసేకరణ సమావేశంలో జిల్లా కలెక్టర్ పై జరిగిన దాడిని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి అధికారులు సిబ్బంది హెడ్ ఆఫీస్ దగ్గర ఉద్యోగుల సంఘం అద్యక్షుడు, ప్రదాన కార్యదర్శి శ్రీవాస్తవ, కృపానంద్ ల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. డ్యూటీలో ఉన్న సిబ్బందిపై జరిగిన ఈ దాడిని తీవ్రంగా ఖండించారు. అద్యక్షులు శ్రీవాస్తవ మాట్లాడుతు అధికారులు పట్ల గౌరవం, ప్రజాస్వామ్య విధానాల పట్ల అంకిత భావము వుండాలని వారు డిమాండ్ చేసారు. బాధ్యులపై ప్రభుత్వము కఠిన చర్యలు తీసుకోవలసిందిగా విజ్ఞప్తి చేసారు. కాలుష్య నియంత్రణ మండలి చేపట్టే పబ్లిక్ హియరింగు లకు పోలీసులు తగిన భద్రత ఏర్పాటు చేయాలన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు రక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నామని తెలిపారు.

## రాచాల ఎఫెక్ట్....
## ఆంధ్రా ప్రాంత ఉద్యోగుల రిలీవ్
### ఫిర్యాదు చేసిన 24 గంటల్లోపే స్పందించిన అధికార యంత్రాంగం



**మహబూబ్ నగర్ వెలుతురు నవంబర్ 12:**
ఆంధ్ర ప్రాంత ఎక్సైజ్ కానిస్టేబుళ్లను రిలీవ్ చేస్తూ మహబూబ్ నగర్ జిల్లా ఎక్సైజ్ అధికారి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఆంధ్రా ప్రాంతానికి చెందిన ఎక్సైజ్ కానిస్టేబుళ్లు 11 ఏళ్లుగా నిబంధనకు విరుద్ధంగా పనిచేస్తున్నారని, దీంతో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన ఎక్సైజ్ కానిస్టేబుళ్లు తీవ్రంగా నష్టపోతున్నారని, వారిని వెంటనే రిలీవ్ చేయాలని లేనిపక్షంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఫిర్యాదు చేస్తామని బిసి పొలిటికల్ జెఏసి చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ సోమవారం జిల్లా కలెక్టర్, ఆబ్కారీ అధికారులను కలిసి విజ్ఞప్తి చేశారు. రాచాల ఫిర్యాదుపై స్పందించిన మహబూబ్ నగర్ జిల్లా ఎక్సైజ్ అధికారి 24 గంటల్లోపే వారి స్వంత రాష్ట్రానికి రిలీవ్ చేయడం విశేషం.

## ఏమ్మెల్యే రాజ్ గోపాల్ రెడ్డి ని కలిసిన గౌడ సంఘాల నాయకులు
### కంఠ మహేశ్వర స్వామి వేడుకలకు హాజరు కావాలని వినతి





**హైదరాబాద్ వెలుతురు నవంబర్ 12:**
మునుగోడు నియోజక వర్గంలోని స0స్థాన్ నారాయణ పూర్. చౌటుప్పల్ పట్టణంలో ఈ నెల 15, 16 తేదీలలో జరిగే శ్రీశ్రీ సురమాంబ కంఠమహేశ్వర స్వామి కళ్యాణ, బోనాల మహోత్సవం కార్యక్రమానికి హాజరవ్వాలని కోరుతూ మనుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి ని ఆయా కంఠ మహేశ్వర స్వామి దేవాలయాల కమిటీ అధ్యక్షులు. కమిటీ సభ్యులు మంగళ వారం హైదరాబాదులోని ఏమ్మెల్యే నివాసంలో కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో నారాయణ పూర్ కంఠ మహేశ్వర స్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు రాపర్తి కరుణాకర్. కమిటీ ప్రముఖులు మొగుదాల సత్తయ్య. పాలకూర్ల యాదయ్య (సూర్య ),నీళ్ల గాలయ్య. పాలకూర్ల సత్తయ్య లు అదేవిధంగా చౌటుప్పల్ పట్టణ గౌడ సంఘం సభ్యులు మొగుదాల రమేష్. రవి. బొంగు జంగయ్య,అడ్వకేట్ శ్రీనివాస్. సత్యనారాయణ. ఇతర గౌడ ప్రముఖులు ఉన్నారు, కంఠ మహేశ్వర స్వామి బోనాల పండుగ కార్యక్రమంలో పాల్గొనే0దుకు హాజరు అవుతానాన్ని వారికి ఏమ్మెల్యే రాజ్ గోపాల్ రెడ్డి తెలిపారు,

## గీత కార్మికుల ఉపాధి కై చర్యలు చేపట్టండి
### కేజీకేపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు యం.వి.రమణ

**హైదరాబాద్ వెలుతురు నవంబర్ 12:**
రాష్ట్రంలో ఐదు లక్షల కుటుంబాలు కల్లుగీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని వీరి ఉపాధి మెరుగుపడే విధంగా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు యం.వి రమణ అన్నారు. మంగళవారం రోజున సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు అధ్యక్షతన రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృత్తిలో ఉపాధి మెరుగు పడాలంటే ప్రధానంగా చెట్ల పెంపకానికి భూమి ఇవ్వాలని, కల్లు కు మార్కెట్ సౌకర్యం కల్పించాలని, నీరా తాటి ఈత ఉత్పత్తుల పరిశ్రమలు ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రకృతి పానీయం స్వచ్ఛమైన కల్లు ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరమైందని దీనిని ఆధునిక పద్ధతుల ద్వారా ప్రజలకు అందజేయాలని తద్వారా గీత కార్మికుల ఉపాధి మెరుగు పడుతుందని అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని నందనం లో గత ప్రభుత్వ హయాంలో నీరా ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి 8 కోట్ల బడ్జెట్ కేటాయించడం జరిగిందని, బిల్డింగ్ నిర్మాణం పూర్తయిందని అందుకు సంబంధించిన మిషనరీని నిర్మాణం చేశారన్నారు.కోట్ల



రూపాయలు వెచ్చించి నిర్మించిన భవనము, మిషనరీ నేడు పడావు పడి ఉందనీ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వము వెంటనే జోక్యం చేసుకొని తగిన నిధులు కేటాయించి ఈ కేంద్రాన్ని ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రణాళికలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో బొలగాని జయరాములు, చౌగాని సీతారాములు, ఎస్ రమేష్ గౌడ్, గాలి అంజయ్య, మద్ది అంజిబాబు, బాల్నే వెంకట మల్లయ్య, బండ కింది అరుణ్, వి. వెంకట నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

# కెటిఆర్ ప్రోద్భలంతోనే అధికారులపై దాడులు

**దాడి చేసిన వారు ప్రతిపక్ష నాయకులకు, సన్నిహితులు**

**ఫోన్ సంభాషణలతో బయటపడ్డ బిఆర్ఎస్ కుట్ర**

**అసలు దొంగ కేటీఆర్ ను వెంటనే అరెస్ట్ చేయాలి**

**బిసి పొలిటికల్ జెఏసి చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్**



**హైదరాబాద్ వెలుతురు నవంబర్ 12:**
వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్లలో విధి నిర్వహణలో ఉన్న వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మరియు ఇతర అధికారులపై కెటిఆర్ ప్రోద్భలంతోనే బిఆర్ఎస్ నాయకులు దాడి చేశారని, దాడి చేసిన బిఆర్ఎస్ నాయకులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని బిసి పొలిటికల్ జెఏసి చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం హైదరాబాద్ లోని బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాచాల మాట్లాడుతూ నిన్న అధికారులపై జరిగిన పాశావిక దాడి ముందస్తు పథకం ప్రకారమే చేసిన దాడిగా చూడాలని, రాజకీయాలకు అతీతంగా విధులు నిర్వర్తిస్తున్న అధికారులపై దాడి చేయడం అంటే ప్రజాస్వామ్య వ్యవస్థపై దాడిచేయడంగానే పరిగణించి దోషులతో పాటు వారి వెనక ఉన్న పార్టీ పెద్దలను శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రజల దృష్టి మరల్చేందుకు బీఆర్ఎస్ ముఖ్య నాయకులు అష్ట కష్టాలు పడుతున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి గారు డ్రగ్స్ విషయంలో కఠినంగా వ్యవహరిస్తూ హైదరాబాదును డ్రగ్స్ రహిత నగరంగా చేయాలని సంకల్పించడంతో హైదరాబాదులో డ్రగ్స్ దొరకటం లేదని, దీంతో కేటీఆర్ పిచ్చిపట్టినట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. కొడంగల్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నియోజకవర్గం కావడంతో ఉద్యోగులను అడ్డంపెట్టుకొని రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ అనిశ్చితి సృష్టించి లబ్ది పొందాలని బిఆర్ఎస్ పార్టీ కుట్రచేయడం సిగ్గుమాలిన చర్య అని అన్నారు. దాడికి పాల్పడిన వ్యక్తి సురేష్ ఫోన్ నుంచి పట్నం నరేందర్ రెడ్డికి కేటీఆర్ కి అనేకసార్లు ఫోన్ కాల్స్ వెళ్లడం అనేక అనుమానాలకు దారి తీస్తుందన్నారు. గత ప్రభుత్వంలో నాయకులు ఎప్పుడు కూడా అభివృద్ధి అంశాల్లో రాజకీయం చేయలేదని, ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలపై వింత విధానాన్ని బారాస నాయకులు అనుసరిస్తున్నారని వాపోయారు. సమగ్ర కుల గణనను అడ్డుకోవాలని టిఆర్ఎస్ బిజెపి నాయకులు కుట్రపూరిత విధానాన్ని అవలంబిస్తున్నారని, సమగ్ర సర్వేకు ఎవరు అడ్డువచ్చినా సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో బిసి పొలిటికల్ జెఏసి రాష్ట్ర కార్యదర్శి వివి గౌడ్, నాయకులు సాయిబాబా, రాఘవేందర్ ,నగేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## గౌడ అమర వీరులకు నవ సంఘర్షణ సమితి సంతాప సభ

### - పంజాల జైహింద్ గౌడ్

**హైదరాబాద్ వెలుతురు నవంబర్ 12:**
ఆంధ్రప్రదేశ్ లో సర్దార్ పాపన్న ఫ్లెక్స్ కడుతున్న సమయంలో ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి మృతి చెందిన నలుగురు గౌడ బిడ్డలు తాటిపర్రు గ్రామానికి చెందిన బొల్లా వీర్రాజు, మారిశెట్టి మణికంత,పామర్తి నాగేంద్ర, కాసగాని కృష్ణ గార్లు మృతికి తెలంగాణ రాష్ట్రం గౌడ సంఘాల జేఏసీ సంతాప సభ ఉప్పల్ రింగ్ రోడ్ సర్దార్ సర్వాయి పాపన్న భవనలో సర్దార్ పాపన్న సీనిమా నిర్మాత, హీరో పంజాల జైహింద్ గౌడ్, పంజాల శ్రవన్ గౌడ్ గార్ల ఆధ్వర్యంలో మంగళవారం రోజున ( 12.11.2024 ) ఉదయం 11:30 గంటలకు నిర్వహించి ఘణ నివాళులు అర్పించడం జరిగినది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్రంలోని వివిధ గౌడ సంఘాల ప్రముఖులు హాజరయ్యారు వీరిలో ముఖ్యంగా గోపా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బండి సాయన్న గౌడ్, ఉపాధ్యక్షులు ముద్దగౌని రామ్ మోహన్ గౌడ్, సంయుక్త కార్యదర్శి యల్మకంటి మీరయ్య గౌడ్, రంగరాజు గౌడ్, అంబాల నారాయణ గౌడ్ గౌడ ఐక్య



సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు, ఎలికట్టె విజయకుమార్ గౌడ్ గౌడ జన హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు, మొగిలయ్య గౌడ్, ఏడుకొండలు గౌడ్ జై గౌడ సేన అధ్యక్షుడు దేశం మహేష్ గౌడ్, పన్యాల మమత గౌడ్ నవ సంఘర్షణ సమితి మహిళా అధ్యక్షురాలు, చెండూరు లింగమ్ గౌడ్, ఉడుతల బాలక్రిష్ణ గౌడ్ నూతన గౌడ సంఘం అధ్యక్షుడు, కిషన్ నాయక్ నవ సంఘర్షణ సమితి జాతీయ కోఆర్డినేటర్, రంగ భాస్కర్ సర్దార్ సర్వాయి పాపన్న సేన రాష్ట్ర నాయకుడు సారా సాయికుమార్ గౌడ్, ఉపెందర్ గౌడ్ అంబాల మల్లేష్ గౌడ్ లింగస్వామి గౌడ్ నాని నితీష్ బాబు లు పాల్గొని ఘణ నివాళులు అర్పించడం జరిగినది.

## గడ్డి అన్నారం పండ్ల మార్కెట్ అభివృద్ధి కోసం పెద్దలను కలిసిన పాలక వర్గం





**వెలుతురు. రంగారెడ్డిజిల్లా, నవంబర్ 12:**
తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి (కార్యదర్శి G,చంద్రశేఖర్ రెడ్డి ) ని మంగళవారం నాడు సచివాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పలు విషయాలను చర్చించిన గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి మరియు పాలకవర్గ సభ్యులు రఘుపతి రెడ్డి,నవరాజ్ ,గణేష్ నాయక్.గోవర్ధన్ రెడ్డి,వెంకటేశ్వర్లు గుప్తా.మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు ఆయన ను కలిసిన వారిలో ఉన్నారు, అలాగే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు (సిఎం ప్రజా వ్యవహారాలు) వేం నరేందర్ రెడ్డి ని సైతం మంగళవారం నాడు నరేందర్ రెడ్డి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసిన గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి తో పాటు మార్కెట్ కమిటీ సభ్యులు,ఈ సందర్భంగా త్వరలో కొహెడ ప్రాంతంలో నూతనంగా చేపట్టేబోయే మార్కెట్ నిర్మాణం డిపిఆర్ గురించి నరేందర్ రెడ్డి తో చర్చించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు.మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.



మంగళవారం రోజున శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి దేవాలయం యాంజాల్లో కార్తీక మాసం రెండవ మంగళవారం సందర్భంగా ఓంకారేశ్వర స్వామికి మరియు ఏకాదశి సందర్భంగా రమా సమేత వీర వెంకట సత్యనారాయణ స్వామి వారికి అభిషేకములు జరుపబడినవి మంగళవారం సందర్భంగా ఓంకారేశ్వర స్వామికి కూరగాయలతో ప్రత్యేక అలంకరణ చేయబడినది ఈ యొక్క కార్యక్రమానికి భక్తులు చాలామంది వచ్చి అభిషేకంలో పాల్గొని అలంకరణ లో పాల్గొని తీర్థప్రసాదాలు తీసుకొని స్వామివారి కృపకు పాత్రులైనారు.

**తూర్కయంజాల్ వెలుతురు నవంబర్ 12:**

# అధికారులపై దాడిని బిఆర్ఎస్ ప్రోత్సహించదు



**ప్రభుత్వ నిర్ణయంతో అమాయక రైతులు బలి**

**బిఆర్ఎస్ నేత ఆర్ఎస్ పవీణ్ కుమార్ వెల్లడి**

**వికారాబాద్,నవంబర్12 వెలుతురు:**
అధికారులపై దాడులను బిఆర్ఎస్ ఎప్పుడూ ప్రోత్సహించదని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. వికారాబాద్ జిల్లాలోని లగచర్ల గ్రామంలో జిల్లా కలెక్టర్, రెవిన్యూ సిబ్బందిపై జరిగిన దాడి ఘటనపై బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ స్పందించారు. మంగళవారం వికారాబాద్ జిల్లాలో పర్యటించిన ఆర్ఎస్పీ.. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ అనాలోచిత చర్యల వల్ల అమాయక రైతులు బలవుతున్నారని విమర్శించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి.. పదేళ్ల పాటు రాష్ట్రాన్ని విజయవంతంగా పాలించిన బీఆర్ఎస్ పార్టీ అధికారులపై దాడులను ప్రోత్సహించదని స్పష్టం చేశారు. అధికారులపై దాడికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఏదైనా కంపెనీ ప్రారంభించే ముందు స్థానిక రైతులతో మాట్లాడి నిర్ణయాలు తీసుకోవాలి.. కానీ రైతులు సీఎం రేవంత్ రెడ్డిని కలిసే అవకాశం లేకుండా పోయిందన్నారు. రైతులు రేవంత్ రెడ్డిని కలవానుకుంటుంటే ఆయన పోలీసులను అడ్డుకుపెట్టుకుంటున్నాడని విమర్శించారు. అధికారులను కవచంగా పెట్టి సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయాలు తీసుకుంటున్నాడని అసహనం వ్యక్తం చేశారు. పేద రైతులు వందలాది సంవత్సరాలుగా వ్యవసాయం చేస్తున్న భూములను లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని.. ఆరుగాలం కష్టపడి పంట కోతకొచ్చిన సమయానికి రైతులను అరెస్ట్ చేసి జైల్లో వేస్తున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. లగచర్ల గ్రామంలో కలెక్టర్, ఇతర ప్రభుత్వ అధికారులపై దాడికి కారణం సీఎం రేవంత్ రెడ్డేనని ఆరోపించారు. నక్సల్ ప్రాంతంలో ఇంటర్నెట్ బంద్ చేయడం చూశాం.. కానీ రైతులు తమ భూముల కోసం కొట్లాడుతుంటే కొడంగల్‌లో ఇంటర్నెట్ బంద్ చేశారన్నారు. ఇంటర్ నెట్ బంద్ చేసి రైతులను తీవ్రవాదులుగా, దేశ ద్రోహులుగా చూస్తున్నారా..? అనేది ముఖ్యమంత్రి చెప్పాలని డిమాండ్ చేశారు. తన సొంత నియోజకవర్గం కొడంగల్ కొలిమిలా మారితే సీఎం రేవంత్ రెడ్డి మాత్రం ఢిల్లీ, కేరళ యాత్రలు చేస్తున్నాడని నిప్పులు చెరిగారు. రైతులను పరామర్శించి సంఘీభావం తెలిపేందుకు వస్తే మమ్మల్ని అడ్డుకున్నారని పోలీసుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. కాగా, వికారాబాద్ జిల్లా లగచర్ల గ్రామంలో ఫార్మా కంపెనీ ఏర్పాటుపై ప్రజాభిప్రాయం తెలుసుకునేందుకు వెళ్లిన వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, రెవెన్యూ సిబ్బంది మూకుమ్మడిగా దాడి చేసిన విషయం తెలిసిందే.



# సంపాదకీయం..

## బజారుభాషపై తిరగబడాల్సిందే !

రాజకీయ నాయకులు ఉచ్చనీచాలు మరచి మాట్లాడుతున్నారు. దిగజారుడు భాషను ప్రయోగించి, రాజకీయాలను పూర్తిగా కలుషితం చేస్తున్నారు. ఎప్పుడు ఎలా మాట్లాడాలన్న హుందాతనం లేకుండా పోయింది. బహిరంగ సభల్లోనూ బజారు భాష వాడుతున్నారు. వాడూ,వీడూ..లుచ్చా లఫంగా లాంటి పదాలు ఉపయోగిస్తున్నారు. వారే కాకుండా వారి అనుచరగణం కూడా సోషల్ మీడియా వేదికగా జుగుప్సాకరంగా వ్యవహరిస్తునారు. హద్దూపద్దూ లేకుండా పోతోంది. ఈ క్రమంలో ప్రజలు ఇలాంటి వారిపై తిరగబడాలి. అలా మాట్లాడుతున్నప్పుడు ఎవ్వరైనా సరే నిలదీయం నేర్చుకోవాలి. పరస్పర విమర్శలతో ప్రజలను, సమస్యలను పక్కదారి పట్టించే కొత్త ఎత్తుగడ నేర్చుకున్నారు. తమ అవినీతి బయటపడకుండా చూసుకుంటున్నారు. గత పదేళ్ల కెసిఆర్ కుటుంబ పాలనలో ఎన్నో అవినీతి అక్రమాలు జోరుగా సాగాయి. ప్రజాధనం లూటీ అయ్యింది. విచారణు సాగుతున్నాయి. ఇందులో ఏ ఒక్కదానికీ సమాధానం లేదు. కానీ కెటిఆర్ లాంటి వారు బజారుభాషతో విమర్శలు గుప్పిస్తున్నారు. అవినీతి అంటూ రంకెలు వేస్తున్నారు. తానేమీ తక్కువ కాదన్నట్లుగా సిఎం రేవంత్ కూడా అలాంటి భాషనే వాడుతున్నారు. ఇలా ఎవరు వాడినా తప్పే. ఎపిలో జగన్ కూడా అలాగే అలవాటు చేసుకున్నారు. ఐదేళ్లపాటు కెసిఆర్ బాటలో రాష్ట్రాన్ని లూటీ చేశారు. అభివృద్ధిని పక్కన పెట్టి ప్రజల సొమ్ముతో సోకులు చేసుకున్నారు. ఇకపోతే ఈ రెండు పార్టీలకు చెందిన సోషల్ మీడియా ఉన్మాదులు మరింతగా రెచ్చిపోతున్నా. నాగరిక సమాజం ఆమోదించని విధంగా భాషతో విమర్శలు చేస్తున్నారు. ఎంతగా అంటే తల్లీచెల్లికి తేడా లేకుండా విమర్శలకు దిగుతున్నారు. అంతెందుకు జగన్ సొంత చెల్లెలు షర్మిలను లక్ష్యంగాచేసుకుని వైసిపి సోషల్ మీడియా దుర్మార్గులు చేస్తున్న కామెంట్లు చూస్తే..అలాంటి వారిని బహిరంగంగా ఉరితీయడమే సరైనదన్న భావన వస్తోంది. ప్రముఖుల ఇళ్లలోని ఆడవాళ్లను దూషించడానికి కూడా వెనకాడడం లేదు. జగన్ అధికారం లో ఉన్నా, విపక్షంలో ఉన్నా ఇదేతీరు కొనసాగుతోంది. ఉచ్చనీచాలు మరచి మహిళలను దారుణంగా కించపరుస్తున్న తీరుతో ఇప్పుడు ఎపిలో పోలీసులు కేసులు పెట్టి దొంగలను పట్టుకునే పనిలో పడ్డారు. జగన్ హయాంలో కావచ్చు, కెసిఆర్ హయాంలో కావచ్చు...అప్పుడు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఇప్పుడు ఎపిలోకూటమి, తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అదే బరితెగింపు కొనసాగింది. దీతో ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు పోలీసు ఉన్నతాధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంతో రాష్ట్రవ్యాప్తంగా వైసీపీకి చెందిన సోషల్ మీడియా ఉన్మాదులపై వేట మొదలైంది. ఐదేళ్ల తన పాలనలో చేసిన దుర్మార్గాలను మరచిపోయి జగన్ ఇప్పుడు నీతి వ్యాఖ్యలు వల్లెవేస్తున్నారు. తెలంగాణలో కూడా సోషల్ మీడియాలో అసంబద్ధ ప్రచరాలపై ప్రభుత్వం కఠినంగానే ఉంటోంది. నిజానికి పార్టీలు ఏవైనా, వ్యక్తులు ఎవరైనా బజారుభాష మాట్లాడితే ముందుగా ప్రజలు నిలదీయాలి. కేసులు పెట్టాలి. అలా మాట్లాడిన వారిని బొక్కలో తోసేదాకా పోరాడాలి. ప్రభుత్వంలో ఉన్నవారు సైతం హుందాగా సంయమనంతో ఉండాలి. భాషను దుర్వినియోగం చేయడం సరికాదు. ఇకపోతే సోషల్ మీడియా వ్యవహారం ఇప్పుడు ఎపిని కుదిపేస్తోంది. ఇంతకాలం ఓపిక పట్టిన కూటమి ప్రభుత్వం మేల్కొంది, మెల్లాగా దగుల్బాజీ పనులు చేస్తున్న వారిని గుర్తించి కేసులు పెడుతోంది. వైసీపీ సోషల్ మీడియా పూర్వ ఇన్‌చార్జి సజ్జల భార్గవ్ రెడ్డి మంగళవారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించారు. గుడివాడ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో తనపై నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిలు మంజూరు చేయాలని కోరారు. సీఎం చంద్రబాబు, కుటుంబ సభ్యులపై సామాజిక మాధ్యమంలో అభ్యంతరకర పోస్టులు పెట్టారని,సజ్జల భార్గవ్ రెడ్డి ఆదేశాలతో ఆ పోస్టులు పెట్టానని విచారణలో ఖాజాబాబా వెల్లడించారు. ఇకపోతే మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సొంతగడ్డ పులివెందులలో పోలీసులు వైసీపీ సోషల్ మీడియా సైకోల తీగలాగు తున్నారు. పోలీసులు వరుసగా వైసీపీ నేతలపై కేసులు నమోదు చేస్తున్నారు. ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి పీఏ రాఘవరెడ్డితో పాటు వైసీపీ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్‌లపై ఎస్సీ, ఎస్టీ కేసులను పోలీసులు నమోదు చేశారు. నిందితులు ఇద్దరి కోసం పోలీసు బృందాలు గాలిస్తున్నాయి. ఇప్పటికే సజ్జల భార్గవ్ రెడ్డి, అర్జున్ రెడ్డిలపై పులివెందుల పోలీసులు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. మరోవైపు ప్రభుత్వ ఆదేశాల మేరకు వైసీపీ సైకో ఫ్యాక్టరీపై ఉక్కుపాదం మోపేందుకు ఏపీ పోలీసులు చర్యలు చేపట్టారు. ఇందుకోసం సైబర్ నిపుణులతో స్పెషల్ టీమ్‌లను ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వ పెద్దలు, మహిళా మంత్రులు, వారి కుటుంబ సభ్యులపై సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టే వారిపై ప్రత్యేక నిఘా పెట్టారు. ఫేక్ ఐడీలతో పోస్టులు పెట్టినా గుర్తించి పట్టుకునే విధంగా సాంకేతికతను వియోగిస్తున్నారు. అందుకు సంబంధించిన ప్రత్యేక టీమ్‌లను రంగంలోకి దింపారు. జిల్లాలోని రాజకీయ పార్టీలు, సామాజిక వర్గాలకు చెందిన సోషల్ మీడియా గ్రూపులపై నిరంతరం నిఘా ఏర్పాటు చేశారు. ఇప్పటికే తప్పుడు ప్రచారం చేసిన వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తలు, సానుభూతిపరు లను అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా యాక్టివిస్ట్ వర్రా రవీంద్రరెడ్డిని పోలీసులు మంగళవారం ఉదయం 5 గంటలకు కడప రెండో అదనపు మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. విచారణ అనంతరం రవీందర్‌రెడ్డికి జడ్జి 14 రోజుల రిమాండ్ విధించారు. ఇవన్నీ ప్రస్తుతం కనిపిస్తున్న కేసులు. ఇక విదేశాల నుంచి తెలంగాణ నేతలపై పోస్టులు పెడుతున్న సంఘటనలు ఉన్నాయి. వీరిని కూడా బోనెక్కిస్తే తప్ప మార్గం లేదు. బజారు భాషను వాడినా, సోషల్ మీడియా వేదికగా ఇష్టం వచ్చినట్లుగా పోస్టులు పెట్టినా కఠిన చర్యలు తీసుకుంటేనే పరిస్థితి అదుపులోకి రాగలదు.

# కేసులను తప్పదోవ పట్టించే యత్నం

### ఢిల్లీలో ఫిర్యాదులతో కెటిఆర్ హైడ్రామా

### కాంగ్రెస్ అధిష్టానంతో భేటీ కానున్న రేవంత్



**న్యూఢిల్లీ,నవంబర్12( వెలుతురు):** మొగుడిని కొట్టి మొగసాలకు ఎక్కిన చందంగా ఇప్పుడు కెటిఆర్ ఢిల్లీ మెట్లెక్కారు. బిజెపిపై నమ్మకం లేదంటూనే, అదే ప్రభుత్వానికి జఫిర్యాదులు మోసుకెళ్లారు. తమ హయాంలో జరిగిన అవినీతిపై ఓ వైపు విచారణ సాగుతోంది. వాటికి సమాధానం ఇవ్వడం లేదు. కానీ పదకొండు నెలల రేవంత్ రెడ్డి పాలనలో మాత్రం తెలంగాణ ఆగమైందని ఆయన వలపోస్తున్నారు. ఈక్రమంలో ఢీల్లీకి వెళ్ల అమృత్ పథకంలో అక్రమాలు జరిగాయని ఫిర్యాదుచేశారు. గతంలో ప్రధాని స్వయంగా కాళేశ్వరం కెసిఆర్‌కు ఎటిఎంలాగా మారిందని ప్రధాని స్వయంగా ఆరోపించారు. బిజెపి నేతలు కూడా ఆరోపించారు. వీటిని తిప్పికొట్టడం మినహా బిఆర్‌ఎస్ చేసిందేమీ లేదు. ఇప్పుడు కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్, ఫార్ములా రేసింగ్ తదిరాల్లో అవినీతి గుప్పుమంది. మొత్తంగా ఇన్ని రోజులు తెలంగాణకే పరిమితమైన కుంభకోణాల రాజకీయం ఇప్పుడు ఢిల్లీ చేరింది. తెలంగాణకు చెందిన కీలకమైన ముగ్గురు వ్యక్తులు హస్తినలో మకాం వేసారు. ఎవరి పనుల మీద వారు ఢిల్లీ వెళ్లినా రాజకీయ కోణంలో కొంత ఆసక్తి కలుగుతోంది. రాజకీయం ఎప్పుడు ఎలాంటి మలుపు తీసుకుంటుందో చెప్పలేం. ఇప్పటికే రేవంత్ సర్కారుపై కేటీఆర్ ఫిర్యాదు చేశారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి హస్తిన వెళ్లారు. మరోవైపు గవర్నర్ ఢిల్లీ పర్యటన అనేక చర్చలకు దారి తీస్తోంది. అమృత్ పథకంలో భారీ స్కామ్ జరిగిందని ఆరోపిస్తూ వస్తున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేంద్రమంత్రికి ఖట్టర్‌కు ఫిర్యాదు చేశారు. టెండర్లు రద్దు చేసి వెంటనే ఈ విషయంపై విచారణ చేపట్టాలని సూచించారు. రేవంత్ రెడ్డి భావమరిది సృజన్ రెడ్డికి ఈ టెండర్లు అక్రమంగా కట్టబెట్టారని కేటీఆర్ ఆరోపిస్తున్నారు. ఇవే కాకుండా మరిన్ని కుంభకోణాలు రాబోతున్నాయని టీజర్ కూడా ఇచ్చేశారు. సీరియల్ మాదిరి అన్ని శాఖల్లో జరిగిన అవినీతిని వెలికి తీస్తామని హెచ్చరించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ అక్రమాలను జాతీయ స్థాయిలోనే ఎండగడతామని ఎన్నిసార్లు అయినా ఢిల్లీ వస్తామని అన్నారు. కేటీఆర్ ఢిల్లీ వెళ్లి హడావిడి చేస్తున్న సమయంలోలోనే సీఎం రేవంత్ రెడ్డి కూడా మగంళవారం ఢిల్లీ పర్యటన ఆసక్తిని రేపుతోంది. దీపావళి తర్వాత మంత్రివర్గ విస్తరణ ఉంటుందని కాంగ్రెస్ నేతలు ప్రచారం చేస్తున్నారు. ఈ అంశంపై పార్టీలో చాలా పెద్ద చర్చ జరుగుతోంది. మరోవైపు త్వరలోనే ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కానుంది. ఈ అభ్యర్థులను కూడా ఖరారు చేయాల్సి ఉంది. వీటితోపాటు ఈ మధ్య కాలంలో రేవంత్ రెడ్డిపై ప్రతిపక్షం బీఆర్‌ఎస్ తీవ్ర ఆరోపణలు చేస్తూ వస్తోంది. ఇప్పుడు ఏకంగా కేంద్రమంత్రులకే ఫిర్యాదులు కూడా చేసింది. ఇన్ని అంశాలు ప్రచారంలో ఉండగా ముఖ్యమంత్రి ఢిల్లీ వెళ్లడం ఆసక్తిని కలిగిస్తోంది. కేవలం అధిష్టానం పెద్దలను కలవడానికే ఢిల్లీకి వస్తున్నారని అందరికీ తెలిసిందే. ఈ మధ్య మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రేవంత్ ఆ విషయంలో కాంగ్రెస్ అధిష్టానానికి ఏమైనా ఫీడ్ బ్యాక్ ఇచ్చే అవకాశం ఉంది. సీఎం రేవంత్ రెడ్డి, ప్రతిపక్ష ఎమ్మెల్యే కేటీఆర్ ఢిల్లీలో ఉండగానే తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ శర్మ ఢిల్లీ వెళ్లడం చర్చనీయాంశం అవుతోంది. ఫార్ములా ఈ- కార్ రేస్ కేసులో కీలక మలుపు తిరుగుతుందని కీలక వ్యక్తులను విచారించేందుకు అనుమతి ఇవ్వాలని గవర్నర్‌కు దర్యాప్తు సంస్థలు విన్నవించుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ కేసులో కీలకంగా కేటీఆర్ పేరు వినిపిస్తోంది. ఈ విషయంపై ఇంకా గవర్నర్ ఎలాంటి అనుమతి ఇవ్వలేదు. ఈ అంశంపై క్లారిటీ కోసం ఢిల్లీ వెళ్లారా లేకుంటే సాధారణంగా వెళ్లారా అనే చర్చ జరుగుతోంది. మొత్తంగా రేవంత్‌పై ఆరోపణలతో తమ తప్పులను కప్పిపుచ్చుకునే భారీ యత్నాల్లో కెటిఆర్ ఉన్నారు. ఆయన ఢిల్లీ పెద్దల కాళ్లు పట్టుకోవడానికే వెళ్లారని మంత్రులు పొన్నం, పొంగులేటిలు ఇప్పటికే ఆరోపించారు.

# నేడు జార్ఖండ్ తొలిదశ పోలింగ్

### పలు రాష్ట్రాల్లో ఉప ఎన్నికలకు నేడే ఓటింగ్

### వయనాడ్‌లో అదృష్టం పరీక్షించుకుంటున్న ప్రియాంక



**న్యూఢిల్లీ,నవంబర్12( వెలుతురు):** రెండు రాష్ట్రాలతో పాటు, పలు రాష్ట్రాల్లో ఉప ఎన్నికలకు రంగం సిద్ధం అయ్యింది. నేటినుంచే అంటే బుధవారం నవంబర్ 13న జార్ఖండ్‌లో అసెంబ్లీ ఎన్నికల తొలదశ పోలింగ్ జరగనుంది. తొలి విడత ఎన్నికల ప్రచారం సోమవారం సాయంత్రం 6గంటలతో నిలిచిపోయింది. తొలి దశలో రాష్ట్రంలోని 43 స్థానాలకు పోలింగ్ జరగనుంది. 683 మంది అభ్యర్థుల భవితవ్యాన్ని 1.37 కోట్ల మంది ఓటర్లు నిర్ణయిస్తారు. 950 పోలింగ్ బూత్‌లలో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓట్లు వేయనున్నారు. పోలింగ్ సిబ్బందిని హెలిడ్రాపింగ్ ద్వారా 194 పోలింగ్ కేంద్రాలకు తరలించారు. దీనితో పాటు, కర్ణాటకలోని 3 అసెంబ్లీ స్థానాలు, మధ్యప్రదేశ్‌లోని బుద్ని, విజయ్‌పూర్ అసెంబ్లీ స్థానాలు, అస్సాంలోని 5 అసెంబ్లీ స్థానాలు, రాజస్థాన్‌లోని 7 అసెంబ్లీ స్థానాలు, కేరళలోని చెలక్కర అసెంబ్లీ స్థానం, వాయనాడ్ లోక్‌సభ స్థానాలకు కూడా ఎన్నికల ప్రచారం ముగిసింది. కేరళలోని వాయనాడ్ లోక్‌సభ, చెలక్కర అసెంబ్లీ స్థానాలకు ఇదేరోజు ఉప ఎన్నికలు జరగనున్నాయి. దీంతో ఎన్నికల ప్రచారానికి తెరపడింది. రెండు చోట్లా నవంబర్ 13న పోలింగ్ జరగనుంది. కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాయనాడ్ స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. ఆమె ముందు ఎల్‌డీఎఫ్ సత్యన్ మొకేరిని అభ్యర్థిగా నిలబెట్టారు. నవ్య హరిదాస్‌ను బీజేపీ అభ్యర్థిగా బరిలోకి దిగారు. వాయనాడ్‌లో ఎన్నికల ప్రచారం చివరి రోజున ప్రియాంక గాంధీ సుడిగాలి పర్యటన నిర్వహించారు. 35 సంవత్సరాలుగా ప్రచారం చేస్తున్నానని, అయితే ఇది తన జీవితంలో అత్యంత సంతోషకరమైన ప్రచారమని ప్రియాంక అన్నారు. వయనాడ్‌లో ఎక్కడికి వెళ్లినా, తనకు అపారమైన ప్రేమ లభించిందని, ప్రచారమంతా ప్రజల ప్రేమ తనలో శక్తిని నింపిందన్నారు. కేరళవాసుల గొంతుకగా పార్లమెంటులో ప్రాతినిధ్యం వహించడం గొప్ప గౌరవంగా భావిస్తున్నానని ప్రియాంక అన్నారు. కలిసిన ప్రతి వ్యక్తి తనకు స్ఫూర్తినిచ్చారని, వాయనాడ్‌లో భారతదేశ సౌందర్యాన్ని చూశానన్నారు. మా అన్నయ్యను విడిచిపెట్టడం బాధగా ఉన్నప్పటికీ, అంకితభావంతో వాయనాడ్ ప్రజల కోసం పోరాడటానికి ఇక్కడకు వచ్చినందుకు సంతోషంగా ఉందన్నారు ప్రియాంక. కర్ణాటకలోని షిగ్గావ్, చన్నపట్న, సండూర్ అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్నాయి. సోమవారం సాయంత్రంతో అయా నియోజకవర్గాల్లో ప్రచారం ముగిసింది. షిగ్గాంలో 8 మంది, చన్నపట్నంలో 31 మంది, సండూర్‌లో 6 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. షిగ్గావ్ నుంచి మాజీ ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై కుమారుడు భరత్‌ను బీజేపీ పోటీకి దింపింది. కాంగ్రెస్ అభ్యర్థి యాసిర్ అహ్మద్ ఖాన్ పఠాన్ పై భరత్ పోటీ చేస్తున్నారు. సండూర్‌లో బంగారు హనుమంత్‌ను బీజేపీ అభ్యర్థిగా నిలబెట్టింది. ఆయన కాంగ్రెస్‌కు చెందిన అన్నపూర్ణతో తలపడుతున్నారు. అదే సమయంలో ఎన్డీయే మిత్రపక్షం జేడీఎస్ చన్నపట్నం నుంచి నిఖిల్ కుమారస్వామిని బరిలోకి దింపింది. ఆయన కాంగ్రెస్ సీనియర్ నేత సీపీ యోగీశ్వర్‌తో తలపడనున్నారు. ఇకపోతే బుధవారమే నవంబర్ 13న మధ్యప్రదేశ్‌లోని బుద్ని, విజయ్‌పూర్ అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్నాయి. దీనికి సంబంధించిన ఎన్నికల ప్రచారాన్ని సోమవారం సాయంత్రం 6 గంటలకు నిలిపివేశారు. విదిశా మాజీ ఎంపీ రమాకాంత్ భార్గవను బుద్నీ నుంచి బీజేపీ పోటీకి దింపింది. ఆయన ముందు కాంగ్రెస్ మాజీ మంత్రి రాజ్‌కుమార్ పటేల్ ఉన్నారు. విజయ్‌పూర్‌లో బీజేపీ అభ్యర్థి రాంనివాస్ రావత్ కాంగ్రెస్ సీనియర్ నేత ముఖేష్ మల్హోత్రాతో తలపడుతున్నారు. నవంబర్ 13న అస్సాంలోని 5 స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్నాయి. సోమవారం సాయంత్రంతో వీటిలో ప్రచారం నిలిచిపోయింది. ఉప ఎన్నికలు జరగనున్న స్థానాలు ధోలై (రిజర్వ్‌డ్), సిడ్లీ (రిజర్వ్‌డ్), బెహలి, బొంగైగావ్ మరియు సంగురి. ఈ స్థానాలకు మొత్తం 34 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ధుబ్రీ ఎంపీ రకీబుల్ హుస్సేన్ కుమారుడు తంజీల్‌ను సంగురి స్థానానికి కాంగ్రెస్ పోటీ చేసింది. ఆయన కంటే ముందు డిప్లో రంజన్ శర్మకు బీజేపీ టిక్కెట్టు ఇచ్చింది. రాజస్థాన్‌లోని ఏడు అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరగ నున్నాయి. సోమవారం సాయంత్రంతో అయా నియోజకవర్గాల్లో ప్రచారం నిలిచిపోయింది. ఝుంఝును, దౌసా, ఖిన్వ్‌సర్, డియోలి-ఉనియారా, సాలంబెర్, చౌరాసి మరియు రామ్‌గఢ్ ఎన్నికలు జరగనున్న స్థానాలు. ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951లోని సెక్షన్ 126 ప్రకారం, ఎన్నికల ప్రచారం ముగిసిన తర్వాత, నిశ్శబ్ద సమయంలో, అభ్యర్థులు, వారి మద్దతుదారులు ఇంటింటికీ వెళ్లి మాత్రమే, ఓటు వేయమని ఓటర్లకు విజ్ఞప్తి చేస్తున్నారు. మొత్తంగా ఈ ఎన్నికలు అటు బిజెపికి, ఇటు కాంగ్రెస్ కూటమికి పరీక్ష లాంటివే.


# ఉసిరి శివస్వరూపం...అందుకే కార్తీక దీపం



**తిరుమల,నవంబర్12( వెలుతురు):** కార్తీక మాసానికి, ఉసిరి మధ్య ఉన్న సంబంధం అంతాఇంతా కాదు. కార్తిక మాసంలో ఉసిరికి ఎంతో ప్రాధాన్యత ఉంటుందని తెలిసిందే. కార్తిక మాసం వచ్చిందంటే చాలు చాలా మంది శైవ క్షేత్రాల్లో ఉసిరితో దీపాలను వెలిగిస్తుంటారు. ఇక కార్తిక పౌర్ణమి రోజు స్నానం చేసే నీటిలో ఉసిరి వేసుకొని స్నానం చేస్తారననే విషయం తెలిసిందే. పురాణాల ప్రకారం ఉసిరి చెట్టును ఈశ్వర స్వరూపంగా భావిస్తారు. అందుకే ఈ మాసంలో ఉసిరి చెట్టును పూజిస్తారు. ముఖ్యంగా ఉసిరి చెట్టు కింద దీపాలను వెలిగిస్తుంటారు. ఇలా చేయడం వల్ల కష్టాలన్నీ దూరమై మంచి జరుగుతుందని విశ్వసిస్తుంటారు. వ్యాస మహర్షి రచించిన శివమహాపురాణంలో ఈ విషయాలను వెల్లడించారు. ఇక ఉసిరికాయ అంటే లక్ష్మీదేవికి కూడా ప్రతిరూపమని భావిస్తుంటారు. అందుకే కార్తిక మాసంలో ఉసిరి దీపం వెలిగిస్తే లక్ష్మీదేవీ అనుగ్రహం లభిస్తుందని విశ్వసిస్తారు.ఇక కార్తిక పౌర్ణమి రోజున ఉసిరి దీపాలను వెలిగించడం ఎంతో మంచిదని చెబుతుంటారు. ఈ రోజు ఉసిరి దీపాన్ని వెలిగించడం వల్ల శ్రీ మహావిష్ణువు అనుగ్రహం కూడా లభిస్తుందని భక్తులు విశ్వసిస్తారు. అలాగే కార్తిక పౌర్ణమి రోజున ఉసిరి దీపాన్ని వెలిగిస్తే నవగ్రహ దోషాలు తొలగిపోతాయని చెబుతుంటారు. కార్తిక మాసంలో ఉసిరి దీపాన్ని వెలిగించే సమయంలో కొన్ని నియమాలు పాటించాలని పండితులు చెబుతున్నారు. శివాలయం లేదా విష్ణు ఆలయ ప్రాంగణంలో నీటితో శుభ్రం చేసి వరిపిండితో ముగ్గు పెట్టాలి. ముగ్గును పసుపు కుంకుమలతో, పూలతో అలంకరించాలి. తరువాత ఉసిరికాయను తీసుకుని, పై భాగంలో గుండ్రంగా తొలిచి, ఆ తర్వాత అందులో నెయ్యిని నింపాలి. ఆ తర్వాత తామర కాడలతో తయారైన వత్తులను వేసి దీపాన్ని వెలిగించాలి. దీపాన్ని పసుపు కుంకుమలతో, అక్షింతలతో అలంకరించాలి.

# కొడంగల్‌లో కొనసాగుతున్న నిర్బంధ కాండ

**హైదరాబాద్, నవంబర్ 12 ( వెలుతురు):**



సీఎం రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌లో నిర్బంధ కాండ కొనసా గుతున్నది. ప్రజాపాలనతో పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజా ఉద్యమాలను ఉక్కుపాదంతో అణచి వేస్తున్నది. ఫార్మా కంపెనీల కోసం భూముల సేకరణపై వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మండలం లగచర్లలో ప్రభుత్వం సోమవారం చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణ రణరంగంగా మారింది. కాంగ్రెస్ సర్కార్ మొండిపట్టుతో సహనం నశించిన కర్షకులు కన్నెర్రజేశారు. తమ భూములు గుంజుకునే ప్రయత్నాలపై కట్టలు తెంచుకున్న ఆగ్రహంతో తిరగబడ్డారు. ఏకంగా కలెక్టర్, అదనపు కలెక్టర్ సహా ఇతర అధికారులపైకి దండెత్తి దొరికినోళ్లను దొరికినట్లు తరిమికొట్టారు. కడా స్పెషల్ ఆఫీసర్, పరిగి డీఎస్పీని చుట్టుముట్టి మరీ చితకబాదారు. దీంతో అర్ధరాత్రి నుంచే పోలీసు బలగాలు భారీ ఎత్తున లగచర్లను చుట్టుముట్టాయి. ఎక్కడికక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటూ చేస్తూ ఎవరిని అనుతించడం లేదు. ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. కొడంగల్ నియోజకవర్గ పరిధిలో అర్ధరాత్రి నుంచే ఇంటర్నెట్ సేవలు పని చేయడం లేదు. నియోజకవర్గంలోని గిరిజన తండాలు పోలీసుల చక్రబంధంలో విలవిల్లాడుతున్నాయి. మీడియాపై కూడా అంక్షలు విధించారు. అసలు కొడంగల్‌లో ఏం జరుగుతుందోనని లంబాడి సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఫార్మా క్లస్టర్లు వ్యతిరేకిస్తే ఇంత దారుణమా అంటూ వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## వరి ధాన్యం కేంద్రాలను ప్రారంభించిన కొత్త కురుమ సత్తయ్య



**ఇబ్రహీంపట్నం,వెలుతురు: నవంబర్ 12**

ఇబ్రహీంపట్నం నియోజకవర్గం లో డీసీఎంస్ వరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలను తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య ప్రారంభించాడు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం లోని యాచారం, మంథన్ గౌరెల్లి, కోహెడ గ్రామంలో డిస్ట్రిక్ట్ కో ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధన్యం కొనుగోలు కేంద్రాలను కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించి అనంతరం రైతులతో మాట్లాడుతూ వోడ్ల కొనుగోలు పై రైతుల సందేహాలకు తెలుసుకొని, ప్రతి గింజ ప్రభుత్వం కొంటుందని, అలాగే ధాన్యం బస్తాలు ఉచితంగా కేంద్రం దగ్గర ఇస్తారు అని రైతులకు తెలియజేసారు. ఈ కార్యక్రమం లో డీసీఎంస్ చైర్మన్ కృష్ణ రెడ్డి,యాచారం పాక్స్ చైర్మన్ తోట రాజేందర్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బిళ్ళకంటి శేఖర్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, మరియు తుర్కయంజాల్ వైస్ చైర్మన్ కొత్తరాంరెడ్డి, డైరెక్టర్లు లక్ష్మారెడ్డి, సంజీవ్ రెడ్డి కృష్ణ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి అసిస్టెంట్ రిజిస్టర్ రవి కుమార్, మండల అగ్రికల్చర్ ఆఫీసర్,మానిటరింగ్ ఆఫీసర్ గోపినాథ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## చంపాపేట్ లో సీసీ రోడ్డు ను ప్రారంభించిన ఏమ్మెల్యే సుధీర్ రెడ్డి



**వెలుతురు, ఎల్ బి నగర్, నవంబర్ 12:**

ఎల్ బి నగర్ నియోజక వర్గం చంపాపేట డివిజన్ పరిధిలోని డిఫెన్స్ కాలనీ నందు దాదాపు 36 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన సీ.సీ.రోడ్డు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి .ఈ సందర్భంగా ఏమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని ప్రధాన సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారం చేయడం జరుగుతుందని అన్నారు. అనంతరం డిఫెన్స్ కాలనీ లో నిర్మిస్తున్న కమ్యూనిటి హాల్ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ముడుపు రాజిరెడ్డి,మహిళ అధ్యక్షురాలు రోజారెడ్డి,సీనియర్ నాయకులు సుంకోజు కృష్ణమాచారి,సదానంద్ రెడ్డి,కాలనీవాసులు జైపాల్ రెడ్డి, సురేందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, కృష్ణరెడ్డి, రాము, బాలరాజు, భాస్కర్ రెడ్డి,రవీందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, జనార్ధన్రెడ్డి, నాయకులు మల్లేష్గౌడ్, అంజిరెడ్డి, బెనర్జీ, యాదగిరి, బొంబాయి, రమాదేవి, ఉమ మహేశ్వర్, రాజు, వసంత తదితరులు పాల్గొన్నారు.

## ఆలోచన లో మార్పు వస్తే విజయం మనదే

**- మాజీ ఏమ్మెల్యే లక్ష్మా రెడ్డి**



**వెలుతురు, ఎల్ బి నగర్, నవంబర్ 12:**

ఆలోచన విధానంలో మార్పు వస్తే విజయం మీదేకలలు కనాలి – సాకారం కోసం కష్టపడాలి. బుద్వేల్ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల విద్యార్థులతో మహేశ్వరం నియోజక వర్గంకాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కిచెన్నగారి లక్ష్మా రెడ్డి అన్నారు, మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం చెప్పినట్టు కలలు కనండి వాటిని సాకారం చేసుకోనే దిశగా విద్యార్థులు కష్టపడాలని మాజీ ఎమ్మెల్యేలక్ష్మారెడ్డి సూచించారు. రంగారెడ్డి జిల్లా బుద్వేల్ లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల విద్యార్థులతో KLR ట్రస్టు నిర్వహించే లీడ్ ఇండియా ప్రోగ్రాంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఉన్నతమైన లక్ష్యాలతో కష్టపడి చదివితే తప్పకుండా విజయం వరిస్తుందన్నారు. పేదరికం పోవాలన్నా గొప్ప వ్యక్తులుగా కావాలన్నా చదువు ఒక్కటే మార్గం అన్నారు,నలుగురికీ ఉపాధి కల్పించే పారిశ్రామిక వేత్తలుగా తయారు కావాలని విద్యార్థులకుకేఎల్ ఆర్ వారికి సూచించారు.

## పి ఏ సి చైర్మన్.ఏమ్మెల్యే గాంధీ ఇంట్లో కుల గణన సర్వే నిర్వహించిన అధికారులు

**వెలుతురు, శేరిలింగంపల్లి. నవంబర్ 12:**

సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ మరియు కుల సర్వేలో భాగంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జరుగనున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నేపథ్యంలో మంగళ వారం వివేకానంద నగర్ లోని సప్తగిరి కాలనీ లో గల పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ఇంటి లో డీసీ కృష్ణయ్య ,మరియు జిఎంసీ అధికారులు కలిసి కుటుంబ సభ్యులవివరాలు నమోదు చేస్తూ దరఖాస్తును పూర్తి చేశారు,



## సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నుండి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులను మినహాయించాలి

### బాలల హక్కుల సంక్షేమ సంఘం(బిహెచ్ఎస్ఎస్) విజ్ఞప్తి



**హైదరాబాద్ వెలుతురు నవంబర్ 12:**

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు నియమించబడ్డ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులను సర్వే విధులనుండి మినహాయించాలని , విద్యాహక్కు చట్టం ప్రకారం నిర్ణీత పనిదినాలు, బోధనా గంటలు (టీచింగ్ హవర్స్) విద్యాభ్యాసం పొందే పిల్లల హక్కును కాపాడాలని బాలల హక్కుల సంక్షేమ సంఘం(బిహెచ్ఎస్ఎస్) ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి విజ్ఞప్తి చేస్తుంది.

రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన "సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే" కోసం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సేవలను తీసుకోవడానికి విద్యాశాఖప్రధాన కార్యదర్శి 1.11.2024 నాడు మెమో నెంబర్ 1112 ద్వారా 36,559 %ూ+ు% ఉపాధ్యాయులను, 3414 ప్రధానోపాధ్యాయులను ఎన్యుమారెటర్లుగా , సూపర్ వైజర్లుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అంతే కాకుండా పాఠశాలలను ఉదయం 9 గంటల నుండి మ. 1 గంటల వరకే (ఒంటి పుటనే) నిర్వహించాలని ఈ ఉత్తర్వుల లో పేర్కొన్నారు. ఐతే ప్రభుత్వ పాఠశాలపై దిగజారుతున్న విశ్వాసానికి ఈ ఆదేశాలు తల్లిదండ్రులలో మరింత ఆందోళన, ఆవేదనకు గురి చేస్తున్నవి. విద్యా హక్కు చట్ట ప్రకారం సంవత్సరంలో ప్రాథమిక పాఠశాలలు 200 పనిదినాలు మరియు 800 బోధనా గంటలుగా(టీచింగ్ హవర్స్) గా నిర్ణయించడం జరిగింది.

అంతే కాకుండా ఉపాధ్యాయులకు జనాభా గణన లెక్కలు, ప్రకృతి వైపరిత్యాలలో సహాయ విధులు మరియు పార్లమెంటు, రాష్ట్ర శాసన సభ, స్థానిక ప్రభుత్వాలకు జరిగే ఎన్నికలకు సంబందించిన విధులను మినహాయించి ఏ ఇతర విద్యేతర పనులకు పంపకూడదని విద్యా హక్కు చట్టం నిర్దేశిస్తుంది. కానీ రాష్ట్ర ప్రభుత్వం కులగణన కోసం ఉపాధ్యాయులను వినియోగించుటకు జారీచేసిన పై ఉత్తర్వులు విద్యా హక్కు చట్ట ఉల్లంఘన కిందికి రావడమే కాకుండా బాలల విద్యా హక్కును నిరోధించినట్లుగా, ఉల్లంఘించినట్లుగా కూడా అర్థం అవుతుంది.

ప్రభుత్వ బడులలో చదివే పిల్లల తల్లిదండ్రులు అత్యధిక శాతం కూలి నాలి చేసుకునే దళిత బహుజనులే! వాళ్ళు ఉదయం వ్యవసాయ పనులకు, కూలీ పనులకు వెళ్లి సాయంత్రం కానీ ఇళ్ళకు తిరిగి రారు. సగం పూటే బడులు నడపడం(ఒంటి గంట వరకే బడులు నడపడం) వలన పిల్లలు ఇంటికి వస్తే ఇంటివద్ద ఎవరూ ఉండరు. మధ్యాహ్నం పూట పిల్లలు గాలికి తిరుగుతారు. ఆడపిల్లలు ఒంటరిగా ఉండడం వలన అనేక అనర్థాలు సమస్యలు ఎదురౌతాయి . ఈ పరిస్థితుల్లో ఆ సగం పూట కూడా పనికి వెళ్లే తల్లిదండ్రులు పిల్లలను తమ వెంట తీసుకుపోతారు. దీనితో పిల్లలు పాఠశాలకు రాకుండా తల్లిదండ్రులతో పాటు వెళ్లడం వల్ల అది క్రమంగా డ్రాప్ ఔట్ కు దారితీసే ప్రమాదం ఉంది. మళ్లీ బడులకు రావడం అలవాటుకు సమయం పడుతుంది. ఈ సర్వే పనుల వలన ఉదయం పూట మాత్రమే బడులు నడుపడం మధ్యాహ్నం సెలవు ఇచ్చి ఉపాధ్యాయులు గ్రామంలో సర్వేకు పోవడం వల్ల ఒక్కపూటలో అంతంత మాత్రం చదువుల వల్ల పిల్లల సామర్థ్యాలపై చాలా ప్రభావం చూపుతుంది. అసలే నాణ్యమైన విద్య అందించడంలో మన తెలంగాణ రాష్ట్రం చాలా వెనుకబడి ఉందనేది దేశవ్యాప్తంగా నిర్వహించిన నేషనల్ అచీవ్ మెంట్ సర్వే(న్యాస్) నివేదిక ద్వారా తెలియ వచ్చింది. ఇక ప్రభుత్వ పాఠశాలలల్లో ఎస్సి, ఎస్టీ, బి సి తదితర సామజిక వర్గాల విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు ఇంకా ఎక్కువ ఆందోళనకరంగా ఉన్నాయి. మొత్తంగా మన రాష్ట్రం బాలలు అన్ని రాష్ట్రాలలో కంటే తక్కువ అభ్యసన సామర్థ్యాలు కలిగి ఉన్నారనేది అనేక సర్వేల ద్వారా అవగతమౌతుంది.

ఇటీవలనే ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య అందించడానికి వేలాదిగా ఖాళీగా ఉన్న పోస్టులలో ఉపాధ్యాయులను నియమించి నందుకు తల్లిదండ్రులు, పౌర, ప్రజా సంఘాలు మరియు సమాజం హర్షించింది. కాని ఈ సంతోషం ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులను బోదనేతర పనులకు వినియోగించడం వలన విద్యార్థుల బోధన కుంటుపడడమే కాకుండా విద్యార్థులు బడిమానేసే ప్రమాదం పొంచి ఉంది.

కాబట్టి విద్యా హక్కు చట్టాన్ని దృష్టిలో ఉంచుకొని సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు నియమించబడ్డ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులను మినహాయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిని కోరుతూ ట్విట్టర్ ద్వారా విజ్ఞప్తి చేసినట్లు బాలల హక్కుల సంక్షేమ సంఘం (బిహెచ్ఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షులు డా గుండు కిష్టయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంజమూరి రఘునందన్ తెలిపారు.

సర్వే చేయడానికి ప్రత్యామ్నాయంగా ఇతర సిబ్బందిని నియమించుకోవాలని ఉపాధ్యాయులను ఈ బాధ్యతల నుండి తప్పించాలని వారు కోరారు.

**ఇంజమూరి రఘునందన్ ,**

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలల హక్కుల సంక్షేమ సంఘం(బిహెచ్ఎస్ఎస్)

సెల్: 9866102962.

## ప్రజల ముసుగులో బిఆర్ఎస్ కుట్రలు

**లగచర్ల దాడి ఘటనలో అడ్డంగా దొరికిన బిఆర్ఎస్**

**ప్రజాప్రభుత్వాన్ని అస్థిరపరచే దుర్మార్గ చర్య**

**దోషులను కఠినంగా శిక్షించకుండ వదలబోం**

**కఠినంగా హెచ్చరించిన ఎంపిలు మల్లు రవి, చామల**



**హైదరాబాద్, నవంబర్12 వెలుతురు:**

లగచర్ల ఘటన వెనక బిఆర్ఎస్ కుట్ర స్పష్టంగా ఉందని, అడ్డంగా దొరికి పోయారని కాంగ్రెస్ ఎంపిలు మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డిలు అన్నారు. ప్రజా ప్రభుత్వాన్ని ఇబ్బందులకు గురిచేయాలని పథకం ప్రకారం బీఆర్ఎస్ కుట్రలు చేస్తోందని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవిఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు తిరుగుబాటు చేస్తున్నారని చూపించాలనే డ్రామాలో భాగంగానే కొడంగల్ ఘటన చేశారని ఆరోపించారు.మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. ప్రజలే బీఆర్ఎస్ నేతలకు సరైన గుణపాఠం చెప్తారన్నారు. నిర్మాణాత్మక సూచనలు చేయకుండా దాడులకు పాల్పడటం సరైంది కాదన్నారు. కొడంగల్ ఘటనలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తానే లేఖ రాస్తానని ఎంపీ మల్లు రవి పేర్కొన్నారు.కొడంగల్లో భూసేకరణపై వికారాబాద్ కలెక్టర్ గ్రామస్తులతో సమావేశం అయ్యేందుకు వెళ్లారని.. బీఆర్ఎస్ నేతల ఆదేశాలతో రైతుల ముసుగులో కలెక్టర్పై దాడి చేశారని.. దీనిపై అన్ని ఆధారాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత రాకపోవడంతో ఇలాంటి పనులు చేస్తూ ప్రజలను రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. ఓడిపోయిన మాజీ ఎమ్మెల్యేకు నిమిషానిమిషానికి ఫోన్లు చేసి, మందు సేవించి కలెక్టర్పై దాడి చేశారన్నారు.ఇది సీఎం రేవంత్ రెడ్డిపై జరిగిన దాడి కాదని.. ప్రజాస్వామ్య పాలనపై జరిగిన దాడి అని తెలిపారు. కేసీఆర్ వైఫల్యాలపై కాంగ్రెస్ ఎప్పుడు హింస మార్గంలో పోరాటం చేయలేదని.. అహింస మార్గంలోనే తాము కేసీఆర్ పై పోరాడామన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, కుటుంబ సభ్యుల మేలు కోసమే కేసీఆర్ పదేళ్లు ప్రాధాన్యత ఇచ్చారని విమర్శించారు. దాడి చేయించి, కేటీఆర్ ఢిల్లీకి వచ్చి బీజేపీ పెద్దలతో అంతకుముందే ఉన్న చీకటి ఒప్పందంలో భాగంగా గతంలో బీజేపీ సహకరించిన విషయాలను గుర్తుచేసి అమృత్ భారత్ స్కాం అంటూ పిర్యాదు చేయడానికి వచ్చారని అన్నారు. బీజేపీ నేతలను రెచ్చగొట్టి.. రేవంత్ రెడ్డిపై బురదజల్లే ప్రయత్నం చేశారని తెలిపారు. ఏ ప్రాజెక్టు పనులైన టెండర్లు పిలిచే పనులు అప్పగిస్తారని.. ఆధారాలుంటే సీబీఐకి ఇవ్వాలన్నారు. రేవంత్ రెడ్డి సొంత బావమరిది అంటూ కేటీఆర్ ఆరోపణలు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే కందుల ఉపేందర్ అమృత్ భారత్ పనుల్లో ఎలాంటి తప్పులు జరగలేదని చెప్తున్నారన్నారు. బీజేపీకి వ్యతిరేకంగా పోరాడుతున్నది కాంగ్రెస్ మాత్రమే అని స్పష్టం చేశారు. మహారాష్ట్రలో బీఆర్ఎస్ ఎందుకు పోటీ చేయడం లేదో సమాధానం చెప్పాలన్నారు. మోడీ, అమిత్ షా ఆదేశాల మేరకు పోటీకి దూరంగా ఉన్నారన్నారు. ప్రధాన ప్రతిపక్షంగా కాకుండా శత్రువులుగా పనిచేస్తున్నారని మండిపడ్డారు. ఃాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం అడ్డుకునేలా కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులు వ్యవహరిస్తు న్నారన్నారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించిందే బీఆర్ఎస్ పార్టీ అని విరుచుకుపడ్డారు. పార్టీ ఫిరాయింపులపై మాట్లాడే నైతికత బీఆర్ఎస్కు లేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో కలెక్టర్లను, ఎస్పీలను, ప్రభుత్వ ఉద్యోగులను కూలీవారిలా ట్రీట్ చేశారని.. తాము అధికారుల్లాగా ట్రీట్ చేస్తున్నామన్నారు. మధుసూదనాచారి, బీఆర్ఎస్ నేతలు దాడికి గురైన వాళ్ళను చూడకుండా, దాడిని చేసిన వారిని చూడటానికి వెళ్తున్నారంటేనే ఆ పార్టీ వైఖరి ఏంటో స్పష్టం అవుతోందన్నారు. మహారాష్ట్ర ఎన్నికలకు రేవంత్ రెడ్డి డబ్బులు పంపిణీ చేస్తున్నారంటూ చేస్తున్న ఆరోపణలకు సాక్ష్యాలు బయటపెట్టాలని.. అంతేకాని ఇష్టానుసారంగా ఆరోపణలు చేయడంసరికాదన్నారు. వికారాబాద్ దాడి ఘటనను కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్కుమార్ రెడ్డి ఖండించారు. కలెక్టర్, ఆర్డీవో స్థాయి అధికారులపై దాడులు దురదృష్టకరమని పేర్కొన్నారు. మంచి పనులు చేస్తున్న ప్రభుత్వాన్ని అడ్డుకునే యత్నం చేస్తున్నారని విపక్షాలపై మండిపడ్డారు. దాడిని ప్రోత్సహించిన వారంతా భారాస కార్యకర్తలుగా గుర్తించినట్లు వెల్లడించారు. కేటీఆర్.. తమ కార్యకర్తలను రెచ్చగొట్టి భూసేకరణ ప్రక్రియను ఆపే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి చర్యలతో ఆయన ఏం సందేశం ఇవ్వాలనుకున్నారని ప్రశ్నించారు. అధికారులపై దాడికి పాల్పడ్డ కారకులను వదిలిపెట్టబోమని హెచ్చరించారు.

## నంది వనపర్తిలో జరిగిన జాబ్ మేళా

**వెలుతురు, యాచారం, నవంబర్ 12:**

ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో యాచారం మండల మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మంగళ వారం నందివనపర్తి గ్రామంలోని జ్యోతి ఎడ్యుకేటెడ్ యూత్ ఆవరణలో ప్రముఖ ఎలక్ట్రానిక్ మానుఫాక్షరింగ్ కంపెనీలు మెగా జాబ్ మేళానిర్వహించారు, ఈ జాబ్ మేళా కార్య క్రమంలో QUESS




మేనేజర్ కృష్ణ , పోలమోని రామకృష్ణ యాదవ్, బిల్లకంటి శేఖర్ రెడ్డి, ముదెడ్ల వెంకట్ రెడ్డి,గ్రామ శాఖ అధ్యక్షులు నర్రె శ్రీశైలం,షాహిద్ తదితరులు పాల్గొన్నారు, దఈ జాబ్ మేళా కార్యక్రమంలో దాదాపు 100 మంది యువతీ ,యువకులు పాల్గొన్నారు

## జిల్లా కలెక్టరు, అదనపు కలెక్టరు, ఇతర అధికారుల పై జరిగిన దాడిని వ్యతిరేకిస్తూ నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపిన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ లో జిల్లా యంత్రాంగం, అధికారులు



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వెలుతురు నవంబర్ 12:**

సోమవారం వికారాబాదు జిల్లా, దుద్యల మండలం, లగిచెర్ల గ్రామంలో జిల్లా కలెక్టరు, అదనపు కలెక్టరు, ఇతర అధికారుల పై జరిగిన దాడిని వ్యతిరేకిస్తూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ లో బోజన విరామ సమయంలో జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి తో కలిసి తెలంగాణ గజిటెడ్ ఆఫీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా యంత్రాంగం, అధికారులు అందరూ నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు, ప్రభుత్వ ఉద్యోగస్తులకు, అధికారులకు భద్రత కల్పించాలని కోరారు. ఇటువంటి ఘటన వల్ల అభద్రత భావన కలుగుతుందని, ఈ దాడికి పాల్పడిన వారి పై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, ఇటువంటి దాడులు పునరావృత్తం కాకుండా చూడాలని కోరారు.

## చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ హడక్ కమిటీ సభ్యునిగా కంకణాల వెంకటసుబ్బయ్య...



**కూకట్ పల్లి నవంబర్ 12 వెలుతురు:**

చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ హడక్ కమిటీ సభ్యునిగా కంకణాల వెంకటసుబ్బయ్యను నియమితులైనట్లు తెలుగుదేశం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యుడు, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి వి. నరసింహులు తెలిపారు. ఈ సందర్భంగా వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవీ బాధ్యతలు అప్పగించిన నరసింహులు కి కృతజ్ఞతలు తెలిపారు. తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా పదవికి న్యాయం చేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

## ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు తన వంతు కృషి...

**- కార్పొరేటర్ దొడ్ల**



**కూకట్ పల్లి నవంబర్ 12 వెలుతురు:**

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఉషముళ్ళపూడి ప్రధాన రహదారి ఎల్లమ్మచెరువు వద్ద జరుగుతున్న రోడ్డు విస్తరణ నిర్మాణ పనులను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఎల్లమ్మ చెరువు వద్ద ప్రధాన రహదారిలో ఇటీవల జరుగుతున్న రోడ్డు విస్తరణ, పైప్ లైన్ నిర్మాణ పనులు వల్ల వాహనదారులకు ఇబ్బంది ఏర్పడిందని అన్నారు. అతి త్వరలోనే నిర్మాణ పనులన్నీ పూర్తిచేసి ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తామని అన్నారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పిస్తూ, ఎటువంటి ఇబ్బంది కలగకుండా సుఖవంతమైన ప్రయాణానికి బాటలు వేస్తామని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## కాలనీ వీధీ లైట్ల సమస్య ను పరిష్కరించిన కార్పొరేటర్



**వెలుతురు, హిమాయత్ నగర్, నవంబర్ 12:**

హిమాయత్ నగర్ డివిజన్ లో బి జె ఆర్ కాలేజ్ కి వెళ్లే దారిలో ఉన్న జస్వాల్ కాలనీ లో మరియు ఆయిల్ సీడ్స్ కాలనీలో వీధి దీపాల పనిచేయకపోవడంతో కాలనీవాసులు చాలా ఇబ్బంది పడుతున్నారని తెలుసుకొని వెంటనే స్పందించి స్థానిక కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ ఈ ఈ సంతోష్ మరియు డి ఈ అశోక్ లతో మాట్లాడి మంగళ వారం కొత్త వీధి దీపాలు ఏర్పాటు చేసి బిగించడం ద్వారా కాలనీ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా చేసిన కార్పొరేటర్ కు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే స్వయంగా వచ్చి దగ్గర ఉండి కాలనీ వాసులసమస్యలనుపరిక్షరించడంతో కాలనీవాసులు ప్రణీ కుమార్, నాగరాజు, దయానంద్ పేరుకా, శ్రీహరి హర్షం వ్యక్తం చేశారు, కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ మాట్లాడుతూ డివిజన్లో ఇంకా చాలా కాలనీ మరియు బస్తీలోలో స్ట్రీట్ లైట్స్ యొక్క సమస్య ఉందని వాటిని పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు,110 వాట్స్ స్ట్రీట్ లైట్స్ స్టాక్ లేకపోవడంతో ఈ యొక్క సమస్యను అందరూ ఎదుర్కొంటున్నారని అతి త్వరలో స్ట్రీట్ లైట్స్ స్టాక్ సమస్యను పరిష్కరించడం జరుగుతుందని మహాలక్ష్మి రామన్ గౌడ్ తెలిపారు,

## ఆధార్, పాన్ ఐచ్ఛికమేనని రాష్ట్ర ప్రభుత్వమే చెబుతోంది

### బీసీ కులగణన సర్వేలో బీసీలందరూ పాల్గొనాలి.

### జాజుల లింగంగౌడ్



**మిర్యాలగూడ వెలుతురు నవంబర్ 12:**
కులగణన సర్వేలో బీసీ లందరూ స్వచ్ఛందంగా పాల్గొని మన కులాన్ని గర్వంగా చెప్పుకొని భవిష్యత్తు తరాల మన అభివృద్ధికి బాటలు వేసుకుందామని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ, బిఆర్ఎస్ పార్టీలు కులగణనకు అడ్డుపడే విధంగా మాట్లాడుతున్నారని ఇది సరైన పద్ధతి కాదన్నారు బీసీల యొక్క జనాభా ఎంత ఉందో తెలిస్తేనే స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెరిగే అవకాశం ఉందని దయచేసి కులగణన గురించి వ్యతిరేకంగా మాట్లాడొద్దని విజ్ఞప్తి చేస్తున్నాం. ఆధార్, పాన్ ఐచ్ఛికమేనని అవి ఇష్టముంటేనే చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వమే చెబుతుందని అన్నారు. సర్వేలో భాగంగా ఇంటికి వచ్చిన ఎన్యుమనేటర్లకు కచ్చితంగా మన కులాన్ని గర్వంగా చెప్పుకోవాలని ఈ సందర్భంగా లింగంగౌడ్ బీసీలకు పిలుపునిచ్చారు.

## డెకరేషన్ (ఇండ్ల )వెంకన్న కుటుంబానికి సమ్మి గౌడ్ ఫౌండేషన్ చైర్మన్ పరామర్శ



**కేసముద్రం వెలుతురు నవంబర్ 12:**
కేసముద్రం పట్టణం కిష్టాపురం కి చెందిన ఇండ్ల వెంకన్న తండ్రి ఇండ్ల ఐలయ్య అనేక పరిశ్రమలలో,ఫెర్టిలైజర్ షాపులలో గుమస్తాగా పనిచేసిన అనుభవం కలిగిన వ్యక్తి ఇటీవల అనారోగ్యంతో మరణించగా మంగళవారం సమ్మి గౌడ్ ఫౌండేషన్ చైర్మన్ గోపా డివిజన్ అధ్యక్షులు కాంగ్రెస్ మండల నాయకులు చిలువేరు సమ్మయ్య గౌడ్ ఐలయ్య కుమారులు వెంకన్న, అనిల్ కుమార్ లను పరామర్శించి వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.అనంతరం వారి కుటుంబానికి మనోధైర్యాన్ని కల్పించారు. ఈ పరామర్శలో సమ్మి గౌడ్ వెంట కాంగ్రెస్ మండల నాయకులు సమ్మి గౌడ్ ఫౌండేషన్ గౌరవ సలహాదారులు సామల నర్సయ్య,ఎర్రం శెట్టి అశోక్,శ్రీరాములు,రవి కొండేటి కళాధర్,పబ్బతి ప్రశాంత్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## నియమ నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

### - అసిస్టెంట్ డైరెక్టర్ దాస్



**సూర్యాపేట జిల్లా వెలుతురు నవంబర్ 12:**
నియమ నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని అసిస్టెంట్ డైరెక్టర్ దాస్ అన్నారు. డిజీ డ్రగ్ కంట్రోల్ అథారిటీ ఆదేశాలుసారం మంగళవారం సూర్యాపేట జిల్లా ఔషధ నియంత్రణ అధికారి సురేందర్ తో కలిసి నూతనకల్ మండలం ఎర్రపాడు గ్రామంలో తనిఖీలు నిర్వహించినట్లు వెల్లడించారు. ఎలాంటి అనుమతులు లేకుండా 30 రకాల మందులు సుమారు 22 వేల రూపాయల విలువ గల మందులను జలగం వెంకటేశ్వర్లు అతను నిల్వ ఉంచడం జరిగిందని డ్రగ్స్ అండ్ కాస్మోటిక్ యాక్ట్ ప్రకారం సీజ్ చేసి తుంగతుర్తి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. నియమ నిబంధనలను ఉల్లంఘిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

## రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దు చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం

### రామన్నపేట పిఏసిఎస్ చైర్మన్ నంద్యాల బిక్షం రెడ్డి



**రామన్నపేట వెలుతురు న్యూస్ నవంబర్ 12**
పల్లివాడ, ఇంద్రపాలనగరం, సిరిపురం గ్రామాలలో పిఏసిఎస్ సెంటర్లను సహకార సంఘం చైర్మన్ నంద్యాల బిక్షం రెడ్డి, రామన్నపేట తహసిల్దార్ లాల్ బహుదూర్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అనుకూలంగా అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నారు. రైతులు తేమ లేని ధాన్యాన్ని సెంటర్లోకి తీసుకువచ్చి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలన్నారు. సన్న రకాల ధాన్యమునకు 500 రూపాయల బోనస్ ఇస్తున్నామన్నారు. రైతులకు సెంటర్ల వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకుండా, వారి అవసరాలను గుర్తిస్తూ, తొందరగా కొనుగోలు అయ్యే విధంగా చూడాలని స్థానిక సిబ్బందిని ఆదేశించారు.

## షరతులు లేకుండా జర్నలిస్టులందరికి అక్రిడేషన్ కార్డ్ ఇవ్వాలి

### డిజిటల్ మీడియా జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

### ఈనెల 17న మానుకోట లో డిఎంజేయూ ఆవిర్భావ సభను విజయవంతం చేద్దాం

### డిఎంజేయూ జాతీయ గౌరవాధ్యక్షులు ఏనుగు మల్లారెడ్డి

### మానుకోటలో సభ కరపత్రం ఆవిష్కరణ



**మహబూబాబాద్ వెలుతురు నవంబర్ 12:**
కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జర్నలిస్టుల సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేదని, అందుకే దేశవ్యాప్తంగా డిజిటల్ మీడియా జర్నలిస్టు యూనియన్ పోరాట సంఘాన్ని బలోపేతం చేసి జర్నలిస్ట్ హక్కులకై ఉద్యమిస్తామని డిజిటల్ మీడియా జర్నలిస్ట్ యూనియన్ జాతీయ గౌరవాధ్యక్షులు ఏనుగు మల్లారెడ్డి తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని స్థానిక విశ్రాంతి భవనంలో ఈనెల 17న మానుకోటలో తలపెట్టిన డిఎంజేయు ఆవిర్భావ సభ జండా ఆవిష్కరణ కార్యక్రమ పత్రాన్ని యూనియన్ వ్యవస్థాపకులు ఏంపల్లి ముతేష్, జాతీయ నాయకులు సీఎస్ రావు,రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కే రాజేంద్రప్రసాద్, బొడ్డు అశోక్ తో కలసి ఆవిష్కరించారు. అనంతరం మల్లారెడ్డి మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా పనిచేస్తున్న జర్నలిస్టులకు పాలక ప్రభుత్వాలు మాయమైన అక్రిడేషన్ కార్డు, ఇండ్లు ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తుందని మండిపడ్డారు. దేశవ్యాప్తంగా జర్నలిస్టుల హక్కుల కోసం డిజిటల్ మీడియా యూనియన్ పోరాటాలు చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. యూనియన్ ఆవిర్భాసభ మానుకోటలో ఈ నెల 17న నిర్వహించుకొని భవిష్యత్తు కార్యాచరణతో ముందుకు పోతామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు యార సాంబయ్య, యూనియన్ జిల్లా నాయకులు బండారి పవన్, మాదాసు మహేష్ తదితరులున్నారు.

## జనంపల్లి గ్రామంలో వరుస దొంగతనాలు



**వెలుతురు న్యూస్ నవంబర్ 12**
రామన్నపేట మండలంలోని జనంపల్లి గ్రామంలో వరుస దొంగతనాలతో, గ్రామ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలో సీసీ కెమెరాలు అందుబాటులో ఉన్నా, కూడా పది రోజుల క్రితం కోనేటి యాదయ్యకు చెందిన నాలుగు మేకలను గుర్తు తెలియని, నిందితులు ఎత్తుకొని వెళ్లారు. ఈ విషయంపై రామన్నపేట ఎస్సై మల్లయ్య ఆధ్వర్యంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. ఈ సంఘటన గ్రామ ప్రజలు మరువక ముందే సోమవారం రోజు రాత్రి నక్క చిన్న రుక్కయ్య బావి వద్ద గల స్థానిక రైతులకు చెందిన రన్నింగ్ ట్రాన్స్ ఫార్మర్ కు కరెంటు వైర్ కట్ చేసి బుడ్లను పగలగొట్టి అందులోని కాపర్ వైరును తీసుకొని పారిపోయారు. ఈ విధంగా గ్రామంలో వరుస దొంగతనాలు జరగడంతో పోలీసుల నిఘా పెంచి దొంగల బారి నుండి రక్షించాలని గ్రామ ప్రజలు పోలీసులను వేడుకుంటున్నారు.

# స్థానిక పత్రికలపై సొంత రాష్ట్రంలో వివక్ష

## అన్యాయం జరిగితే పోరాటాలకు సిద్ధం

### స్థానిక పత్రికల ఎంప్యానల్మెంట్ విషయంలో ఏళ్ల తరబడి జాప్యం కొనసాగించడం తగదు

### పత్రికల హాజరు శాతాన్ని బట్టి ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఎంప్యానల్మెంట్ చేపట్టాలని డిమాండ్

### ఇప్పటి వరకు ఎంప్యానల్మెంట్ కోసం పెండింగ్ లో ఉన్న దరఖాస్తులు అన్నింటిని తక్షణం పరిష్కరించాలి

### హైదరాబాద్‌లో డబ్ల్యూజేఐ రాష్ట్ర సదస్సు




**హైదరాబాద్ వెలుతురు నవంబర్ 12:**
తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన స్థానిక పత్రికల యాజమాన్యాలు రాష్ట్రంలో అంతులేని వివక్షకు గురవుతున్నాయని డబ్ల్యుజేఐ రాష్ట్ర సదస్సు అభిప్రాయపడింది. రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి స్థానిక పత్రికల పట్ల సానుభూతి ఉన్నప్పటికీ, వాటి సమస్యలపై సరైన ప్రతినిధ్యం వహించే విషయంలో రాష్ట్ర జర్నలిస్టులకు సుదీర్ఘకాలం ప్రాతినిధ్య వహిస్తున్నామని చెప్పుకొంటున్న సంఘం వైఫల్యం చెందిందని ఆరోపించింది. తెలంగాణ స్థానిక పత్రికలు- యాజమాన్యాలు- అక్రిడిటేషన్లు - రేట్ కార్డులో వివక్ష... డిమాండ్ల సాధన అంశాలపై బీఎంఎస్ అనుబంధ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూజేఐ) మంగళవారం హైదరాబాద్ నాగోల్‌లో మంగళవారం రాష్ట్ర సదస్సు విజయవంతంగా జరిగింది. రాష్ట్రం నలుమూలల నుంచి స్థానిక పత్రికల యజమానులు, ఎడిటర్లు, పాత్రికేయులు దీనికి పెద్ద ఎత్తున తరలివచ్చారు.

డబ్ల్యూజేఐ గౌరవాధ్యక్షుడు నందనం కృపాకర్ అధ్యక్షత వహించిన ఈ సదస్సుకు సామాజికవేత్త, రిటైర్డ్ ప్రొఫెసర్ మురళీమనోహర్, వీ 3 న్యూస్, విశ్వంభర పత్రికల అధినేత, పలుస్వచ్ఛంద సంస్థల నిర్వాహకుడు డాక్టర్ కాచం సత్యనారాయణ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. డబ్ల్యూజేఐ అధ్యక్షుడు రాణాప్రతాప్, ఉపాధ్యక్షులు తాడూరు కరుణాకర్, అనిల్ దేశాయ్, ప్రధాన కార్యదర్శి రావికంటి శ్రీనివాస్, కార్యదర్శులు శివనాద్రి ప్రమోద్‌కుమార్, క్రాంతి, సహ కార్య నిర్వాహక కార్యదర్శి బెజ్జంకి నరేశ్ కుమార్ తదితరులు ప్రసంగించారు.

#### జాతి ప్రయోజనాలే లక్ష్యం కావాలి

జాతి ప్రయోజనాలే లక్ష్యంగా జర్నలిస్టులు పనిచేయాలని మురళీమనోహర్ సూచించారు. పాత్రికేయులు తమ రాతలతో దేశ ఔన్నత్యాన్ని చాటాలన్నారు. కించపరిచేలా, గొప్పదనాన్ని తగ్గించేలా కథనాలు రాయవద్దన్నారు. సమాజంలో వెలుగులు నింపే వృత్తిని స్వచ్ఛందంగా స్వీకరించిన పాత్రికేయుల జీవితాలు చీకట్లో ఉండటం బాధాకరమన్నారు. వారి సమస్యలపై పోరాడేందుకు డబ్ల్యూజేఐ ముందుకు రావడం హర్షణీయమన్నారు. ఈ సంస్థకు అందరూ అండగా ఉండాలని పిలుపునిచ్చారు.

#### సంఘాలు ప్రభుత్వాలకు వత్తాసు పలకొద్దు: కాచం

డాక్టర్ కాచం సత్యనారాయణ మాట్లాడుతూ పాత్రికేయ సంఘాలు ప్రభుత్వాలకు వత్తాసు పలకకుండా జర్నలిస్టుల సంక్షేమం కోసమే పాటుపడాల్నారు. అప్పుడే ఆ సంఘాలకు , నాయకులకు విలువ, గౌరవం లభిస్తాయన్నారు. సమాజాన్ని ప్రభావితం చేసే వారిలో అత్యంత ముఖ్యులు పాత్రికేయులని, వారు చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. వారి సంక్షేమం కోసం డబ్ల్యూజేఐ చేసే పోరాటాలకు అండగా ఉంటానని అన్నారు. చిన్నా, పెద్ద అని కాకుండా అన్ని పత్రికలను సమంగా చూడాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. సంఘాలతో నిమిత్తం లేకుండా అందరు పాత్రికేయుల సంక్షేమం కోసం డబ్ల్యూజేఐ పాటు పడుతుందని నందనం కృపాకర్ అన్నారు. జాతీయ స్థాయిలో 17 రాష్ట్రాలలో కార్యకలాపాలు చేపట్టడమే కాకుండా జిల్లా, మండల స్థాయిలో విస్తరించిన యూనియన్ డబ్ల్యూజేఐ మాత్రమేనని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావికంటి శ్రీనివాస్ అన్నారు.

#### ఆ వ్యాఖ్యలు దురదృష్టకరం

మీడియా అకాడమీ అధ్యక్షుడిగా, జర్నలిస్టుల అక్రిడిటేషన్ల మార్గదర్శకాల రూపకల్పన కమిటీ ఛైర్మన్‌గా ఉన్న వ్యక్తి, సాక్షాత్తు ముఖ్యమంత్రి సమక్షంలో, అక్రిడిటేషన్లు అమ్ముకుంటున్నారని, అవి అంగట్లో సరుకులా మారాయని వ్యాఖ్యానించడం దురదృష్టకరమని, అలాంటి వ్యక్తికి ఆ పదవుల్లో ఉండే నైతిక అర్హత లేదని రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాడూరు కరుణాకర్ ఆరోపించారు. జర్నలిస్టు సమాజంలో అనైతిక విధానాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఇంతకాలం జర్నలిస్టులను నిర్దేశిస్తూ వచ్చిన సంఘమే కారణమన్నది జగమెరిగిన సత్యమన్నారు.స్థానిక పత్రికల సమస్యల పరిష్కారం విషయంలో ప్రభుత్వంతో ప్రాతినిధ్యం వహించేందుకు తమ సంఘం సిద్ధంగా ఉందని, ప్రభుత్వం ఈ సమస్యలను సానుభూతితో అర్థం చేసుకుంటుందనేనమ్మకం తమకుందన్నారు. స్థానిక పత్రికలకు ఎలాంటి అన్యాయం జరిగినా, వారితో కలిసి ప్రత్యక్ష ఆందోళనలకు సిద్ధమని ప్రకటించారు.

#### తీర్మానాలివే...

తెలంగాణ స్థానిక పత్రికల అక్రిడిటేషన్ల జారీ కోసం ఇంతకాలం అనుసరించిన కేటగిరిల విధానాన్ని తొలగించి పత్రికలన్నిటిని సమదృష్టితో చూడాలని రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పుకు లోబడి, ఆయా పత్రికలు ప్రచురించే పేజీల ఆధారంగా అక్రిడిటేషన్లు కేటాయించేందుకు అనువుగా మార్గదర్శకాలు రూపొందించాలని బిఎంఎస్ అనుబంధ వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.

12 పేజీలతో వెలువడే పత్రికలకుసమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ కార్యాలయంలో కనీసం 8 అక్రిడిటేషన్లు, ప్రచురణ కేంద్రంలో రెండు అక్రిడిటేషన్లు, ప్రతి మండల కేంద్రంలో ఒకఅక్రిడిటేషన్ ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.

అలాగే 8 పేజీలతో వెలువడే పత్రికలకు ఐ అండ్ పిఆర్ కార్యాలయంలో ఆరు అక్రిడిటేషన్లతో పాటు ప్రతి మండల కేంద్రంలో పనిచేసే జర్నలిస్టుకు అక్రిడిటేషన్ సదుపాయం కల్పించాలని కోరింది. సీనియారిటీ, పేజీలు, సర్క్యులేషన్ ఆధారంగా స్థానిక పత్రికలకు కల్పించాల్సిన అప్ గ్రేడేషన్ విషయంలో ఏళ్ల తరబడి జరుగుతున్న జాప్యం పట్ల సమావేశం ఆందోళన వ్యక్తం చేసింది. గత ఏడేళ్లుగా కొనసాగుతున్న ఈ జాప్యానికి స్వస్తి పలికి, అప్ గ్రేడేషన్ ప్రక్రియ వెంటనే చేపట్టాలని డిమాండ్ చేసింది.

స్థానిక పత్రికల రేటు కార్డు పెంపుదలలో గత ఎనిమిది సంవత్సరాలుగా ఎలాంటి పురోగతి లేదని, సమైక్య రాష్ట్రంతో పోలిస్తే రేటు కార్డు ధరలు మరింత తగ్గిపోయాయని ఈ అన్యాయాన్ని సవరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని డబ్ల్యూజేఐ అభిప్రాయపడింది. న్యూస్ ప్రింట్, ప్రింటింగ్ మెటీరియల్ ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, ఈ పరిస్థితుల్లో స్థానిక పత్రికల యాజమాన్యాలు పత్రికలు ముద్రించడానికి ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని సమావేశం అభిప్రాయపడింది. గత పదేళ్లలో పెద్ద పత్రికల టారీఫ్ ధరలు పెంచిన ప్రభుత్వం తెలంగాణ ఉద్యమానికి ఊతం ఇచ్చిన చిన్న పత్రికల విషయంలో చూపడం తగదని పేర్కొంది. ఉమ్మడి రాష్ట్రంలో స్థానిక పత్రికలకు వర్గీకృత ప్రకటనలు, భూసేకరణ ప్రకటనలు ఇచ్చిన ప్రభుత్వం తెలంగాణ ఏర్పడిన తర్వాత పూర్తిగా నిలిపివేయడం బాధాకరమని పేర్కొంది. స్థానిక పత్రికలు క్లాసిఫైడ్, భూ సేకరణ ప్రకటనలు కేటాయిస్తేబడ్జెట్ తగ్గడంతో పాటు, ఆమేరకు ఖజానాకు సహాయపడుతుందని తెలిపింది. స్థానిక పత్రికల ఎంప్యానల్మెంట్ విషయంలో ఏళ్ల తరబడి జాప్యం కొనసాగించడం తగదని, డిపిఆర్ఓ కార్యాలయాలు, సమాచార శాఖ కార్యాలయంలో పత్రికల హాజరు శాతాన్ని బట్టి ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఎంప్యానల్మెంట్ చేపట్టాలని డిమాండ్ చేసింది. ఇప్పటివరకు ఎంప్యానల్మెంట్ కోసం పెండింగ్ లో ఉన్న దరఖాస్తులు అన్నింటిని తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేసింది. రోజురోజుకు పెరిగిపోతున్న మార్కెట్ ధరలకు అనుగుణంగా స్థానిక పత్రికలకు కేటాయించే ప్రకటన రేట్లు సవరించాలని కోరింది. ప్రస్తుతం పది రూపాయల నుండి ఉన్న రేట్లలో మార్పు తీసుకురావలసిన అవసరం ఉందని అభిప్రాయపడింది. నివేశన స్థలాల కేటాయింపు, బలహీనవర్గాల గృహ నిర్మాణ పథకాల్లో పెద్ద పత్రికల జర్నలిస్టులతో సమానంగా, స్థానిక పత్రికల జర్నలిస్టులకు వాటా ఇవ్వాలని కోరింది. నివేశన స్థలాల కేటాయింపు సంబంధించి జరిపే సంప్రదింపుల్లో అన్ని జర్నలిస్టు సంఘాలకు సమాన భాగస్వామ్యం కల్పించాలని డిమాండ్ చేసింది. జర్నలిస్టుల వృత్తి ప్రమాణాలను పెంపొందించడం కోసం రాష్ట్రంలో ప్రింట్, ఎలక్ట్రానిక్, మీడియా, డెస్కు, వీడియో జర్నలిస్టులకు కార్యశాలలు నిర్వహించి,, వారికి ఉపయుక్తమైన సాహిత్యాన్ని ముద్రించాల్సిన బాధ్యతల నుంచి పూర్తిగా వైదొలగిన మీడియా అకాడమీ అధ్యక్షుడు ఇతర వ్యాపకాల్లో మునిగితేలడాన్ని డబ్ల్యూజేఐ ఆక్షేపించింది.

## ప్రతిపక్షం లేకున్నా.. మనం బాధ్యతగా ఉండాల్సిందే

### ప్రజాసమస్యలపై స్పష్టతతో మాట్లాడాలి

### సభా కార్యక్రమాలపై అవగాహన పెంచుకోవాలి

### బడ్జెట్ కేటాయింపులు, బిల్లులపైనా చర్చించాలి

### ఎమ్మెల్యేలకు శిక్షణ కార్యక్రమలో చంద్రబాబు సూచనలు

**అమరావతి,నవంబర్12 వెలుతురు:**
సభలో ప్రతిపక్షం లేదు కదా మనకేముంది అని అనుకోవద్దని ఎమ్మెల్యేలకు సిఎం చంద్రబాబు నాయుడు సూచించారు. వాళ్లకు బాధ్యత లేదు... కానీ మనకు ఉందని గుర్తించాలని అన్నారు. మనం ప్రజలకు జవాబుదారీగా పనిచేద్దాం. ప్రజలకు ఏం అవసరమో... ప్రజలకు ఏం చేశామో చెప్పడానికి అసెంబ్లీ ఒక వేదిక. అసెంబ్లీకి మేము పంపిన ప్రతినిధి మా కోసం ఏం మాట్లాడుతున్నారని ప్రజలు ఎప్పుడూ గమనిస్తారని గుర్తుంచుకోవాలసి సిఎం చంద్రబాబు తెలిపారు. ఏపీ అసెంబ్లీ కమిటీ హాలులో ఎమ్మెల్యేలకు అవగాహన సదస్సు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలతో సీఎం మాట్లాడుతూ.. రానురాను ఎమ్మెల్యేలకు స్జబెక్టు నేర్చుకోవాలనే ఆసక్తి తగ్గుతోందని.. ఇది మంచిది కాదని... నిరంతరం నేర్చుకోవాలి... తెలుసుకోవాలని సూచించారు. 'ఇప్పుడు ఎవరు ఏ స్జబెక్టు మాట్లాడుతున్నారో నేను కూడా నోట్ చేసుకుంటున్నా. కేంద్ర బడ్జెట్‌లో కూడా ఏ విధమైన నిధుల కేటాయింపులు ఉన్నాయో స్టడీ చేసుకుంటే ఎమ్మెల్యేలకు ఉపయోగ పడుతుంది. పని చేయాలన్న ఆసక్తి మీలో ఉంటే ఏదైనా సాధ్యమవుతుందన్నారు. సమస్యలపై మాట్లాడకుండా బూతులు తిడితే ప్రజలు ఎట్టిపరిస్థితుల్లో స్వాగతించరని.. గతంలో అదే జరిగిందన్నారు. శాఖల్లో ఏం జరుగుతుందో ఎమ్మెల్యేలకు అవగాహన లేకపోతే నియోజకవర్గానికి ఏం అవసరమో తెలియదన్నారు. బడ్జెట్ సమావేశాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని చెప్పుకొచ్చారు. బడ్జెట్ సమావేశాలపై ఎమ్మెల్యేలకు అవగాహన ఉండాలని.... వచ్చే మంచి ఆలోచనలు సభలో పంచుకోవాలని సూచించారు. ప్రభుత్వం తెచ్చే బిల్లులు, పాలసీలపై ప్రతి ఎమ్మెల్యే అధ్యయనం చేయాలన్నారు. పబ్లిక్ గవర్నెన్స్‌లో ఎమ్మెల్యేలనూ భాగస్వామలను చేస్తామన్నారు. ప్రజలు ఎన్నో ఆశలు, నమ్మకం పెట్టుకున్నందున సమస్యలపై సభలో చర్చించాలని తెలిపారు. అర్థవంతమైన చర్చలకు సభ వేదిక కావాలన్నారు. వరుసగా విజయం సాధించడం అనేది మన పనితనం, పార్టీ నిర్మాణాన్ని బట్టి ఉంటుందన్నారు. టీడీపీ నుంచి 61 మంది, జనసేన నుంచి 15 మంది, బీజేపీ నుంచి నలుగురు, వైసీపీ నుంచి నలుగురు ఎమ్మెల్యేలు కొత్తగా ఎన్నికయ్యారని తెలిపారు. ఒకప్పుడు అసెంబ్లీ ప్రొసీడింగ్స్ ఆల్ ఇండియా రేడియో, దూరదర్శన్‌లో వచ్చేవని.. కానీ ఇప్పుడు లైవ్, సోషల్ మీడియాలో కూడా ప్రసారం అయ్యే దాకా టెక్నాలజీ వచ్చిందన్నారు. ఎమ్మెల్యేలుగా గెలిచిన వాళ్ళకు సభలో పబ్లిక్ పాలసీలు రూపొందిస్తామని.. ఈ పాలసీలు ప్రజా జీవితంలో మార్పులు తెస్తాయని చంద్రబాబు అన్నారు. గతంలో కొందరు ఎమ్మెల్యేలను విదేశాలకు పంపి ఆయా దేశాలు సాధించే ఫాస్ట్ గ్రోత్ రేట్ గురించి స్టడీ చేయించామని గుర్తుచేశారు. మనం తెచ్చే పాలసీలే రాష్ట్రంలోని సమస్యలకు శాశ్వత పరిష్కారాలను చూపిస్తాయన్నారు. గతంలో ఒక స్జబెక్టుపై ఎంత సమయమైనా చర్చించేవాళ్లమన్నారు. విజన్-2047పై అందరి అభిప్రాయాలు తెలియజేయలని తెలిపారు. మంచి చర్చ, సమస్యల పరిష్కారానికి శాసనసభ, శాసన మండలి ఇకపై వేదికగా నిలవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఎమ్మెల్యేలు నిరంతరం నేర్చుకోవాలని, తెలుసుకోవాలని సూచించారు. విజన్ 2047పై అందరి అభిప్రాయాలు తెలియజేయాలని కోరారు. పనిచేయాలనే ఆసక్తి ఉంటేనే ఏదైనా సాధ్యమవుతుందని తెలిపారు.ప్రజలకు ఏం అవసరం.. మనం ఏం చేశామనేది చెప్పడానికి అసెంబ్లీ ఒక వేదిక అని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. అసెంబ్లీలో తమ ప్రతినిధి మాట్లాడుతున్నారని ప్రజలు గమనిస్తూనే ఉంటారని తెలిపారు. అలాంటప్పుడు బూతులు మాట్లాడితే ప్రజలు స్వాగతించరని చెప్పారు. ఈ కార్యక్రమానికి స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అధ్యక్షత వహించారు.

# ఆరోపణలు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా

## కర్ణాటక సీఎం సిద్ధరామయ్య డిమాండ్



**బెంగళూరు, నవంబర్ 12 ( వెలుతురు):**
కర్ణాటక ఎక్సైజ్ శాఖలో రూ. 700 కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపించిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ .. ఆ ఆరోపణలను నిరూపించాలని కర్ణాటక సీఎం సిద్ధరామయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఓ సవాల్ విసిరారు. ఆరోపణలు నిజమని రుజువైతే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని ప్రకటించారు. నిరూపించలేకపోతే మోదీ రాజకీయాల నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు. కాగా, రెండు రోజుల క్రితం మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో భాగంగా మోదీ మాట్లాడుతూ.. కర్ణాటక ఎక్సైజ్ శాఖలో భారీ కుంభకోణం జరిగిందని, ఆ సొమ్మును మహారాష్ట్ర, ఝూర?ండ్‌లో ఎన్నికల ప్రచారానికి కాంగ్రెస్ వాడుకుంటోందని ఆరోపించారు. 'ఎక్కడ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే.. ఆ రాష్ట్రం కాంగ్రెస్ రాజ కుటుంబానికి డబ్బులు అందించే ఏటీఎంగా మారిపోతుంది. ఇప్పుడు కాంగ్రెస్ రాజ కుటుంబానికి తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలు ఏటీఎంలుగా మారిపోయాయి. మహారాష్ట్రలో ఎన్నికలు జరుగుతుంటే తెలంగాణ, కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ వసూళ్లకు పాల్పడుతున్నది. మహారాష్ట్రలో ఎన్నికల కోసం తెలంగాణ, కర్ణాటకలో వసూళ్లు రెట్టింపయ్యాయని ప్రజలు చెప్తున్నారు. కర్ణాటకలోని లిక్కర్ వ్యాపారుల నుంచి రూ.700 కోట్లు వసూలు చేసినట్టు ఆరోపణలు వస్తున్నాయి.' అని మోదీ ఆరోపించారు. ఈ నేపథ్యంలో మోదీ ఆరోపణలను సీఎం సిద్ధరామయ్య ఖండించారు. నిధుల దుర్వినియోగం జరగలేదని స్పష్టం చేశారు. ఈ దేశ ప్రధాని ఇంత అబద్ధాలు చెప్పడం చూసి ఆశ్చర్యపోయానన్నారు. 'మహారాష్ట్రలో ఎన్నికల ప్రచారం చేస్తూ.. కర్ణాటక కాంగ్రెస్ ఎక్సైజ్ శాఖలో కుంభకోణానికి పాల్పడిందని మోదీ ఆరోపించారు. మహారాష్ట్ర, జార?ండ్ ఎన్నికల్లో ఖర్చుచేసేందుకు రూ.700 కోట్లు సమీకరించిందని ఆయన పేర్కొన్నారు. ఈ దేశ ప్రధాని ఇంత అబద్ధాలు చెప్పడం చూసి నేను ఆశ్చర్యపోతున్నాను. ఈరోజు నేను ప్రధానికి ఓ సవాల్ విసురుతున్నా. ఆయన చేసిన ఆరోపణలను నిరూపిస్తే నేను రాజకీయాల నుంచి తప్పుకుంటా. నిరూపించకపోతే ఆయన పాలిటిక్స్ నుంచి తప్పుకోవాలి' అని సిద్ధరామయ్య అన్నారు. కాగా, కర్ణాటక వైన్ మర్చెంట్స్ అసోసియేషన్ ఇటీవల ఎక్సైజ్ విభాగంపై తీవ్ర ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. మరీ ముఖ్యంగా మంత్రి ఆర్‌బీ తిమ్మాపూర్‌ను లక్ష్యంగా చేసుకుంది. లైసెన్సులు మంజూరు చేసేందుకు, ట్రాన్స్‌ఫర్ల కోసం రూ. 30 లక్షల నుంచి రూ. 70 లక్షలు వసూలు చేస్తున్నట్టు ఆరోపించింది. గత ఏడాది కాలంలో ఇలా 1000 లైసెన్సులను అక్రమంగా కేటాయించారని, ఫలితంగా రూ. 300–700 కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపించింది.

# ఉల్లి మరింత ఘాటు

## కిలో రూ.70 నుంచి రూ.80

**న్యూఢిల్లీ, నవంబర్ 12 ( వెలుతురు):**
దేశంలో ఉల్లి ఘాటు మరింత పెరిగింది. నిన్న మొన్నటి వరకు హోల్‌సేల్ మార్కెట్లలో రూ.40–60 పలికిన కిలో ఉల్లి ధర.. ఇప్పుడు ఏకంగా రూ.70–80కి చేరింది. దిగుబడి తగ్గడమే ధరల పెరుగుదలకు కారణంగా తెలుస్తోంది. ఆర్థిక రాజధాని ముంబై నగరాల్లో కిలో ఉల్లి ధర రూ. 80గా ఉంది. దేశంలోని ఇతర నగరాల్లో కూడా ఉల్లి ధరలు ఇదేవిధంగా కొనసాగుతున్నాయి. ఉల్లితో పాటు ఇతర కూరగాయల ధరలు కూడా ప్రస్తుతం ఆకాశాన్నంటుతున్నాయి. దీంతో సామాన్య ప్రజలు ఇంట్లో వంట వండుకోలేని పరిస్థితి. చాలీచాలని జీతాలకు తోడు పెరుగుతున్న నిత్యావసర ధరలు మరింత భారంగా మారాయని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధరలు పెరగడంతో ఆహారపు అలవాట్లపై ప్రభావం చూపుతున్నాయని చెబుతున్నారు. ఉల్లితోపాటు వెల్లుల్లి ధర కూడా రెట్టింపు కావడంతో కుటుంబ బడ్జెట్‌ను దెబ్బతీస్తున్నదని కొనుగోలుదారులు వాపోతున్నారు. ప్రభుత్వం చొరవ తీసుకొని కూరగాయల ధరలను తగ్గేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# ఢిల్లీని కమ్మేసిన పొగమంచు



**న్యూఢిల్లీ, నవంబర్ 12 ( వెలుతురు):**
దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం కొనసాగుతోంది. గత పది రోజులుగా రాజధాని ప్రాంతంలో కాలుష్యం తీవ్రస్థాయిలో ఉంది. సోమవారం ఉదయం కూడా గాలి నాణ్యత సూచి అధ్వానంగా నమోదైంది. అదేవిధంగా నగరాన్ని పొగమంచు దట్టంగా ఆవహించింది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రకారం.. ఉదయం 9 గంటలకు ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 349గా నమోదైంది. రాజధానిలోని కొన్ని ప్రాంతాల్లో గాలి నాణ్యత సూచి 400కి (తీవ్రమైన స్థాయి) పైనే నమోదైంది. బవానాలో ఏక్యూఐ 401, జహంగీర్‌పురిలో 412, ఆనంద్ విహార్‌లో 378, అశోక్ విహార్‌లో 379, ద్వారకా సెక్టార్ 8లో 356, ఇందిరా గాంధీ ఇంటర్నేషన్ ఎయిర్‌పోర్ట్ ప్రాంతంలో 336, ముండ్కా ప్రాంతంలో 379, ద్వారకాలో 379, పంజాబీ బాగ్‌లో 385, ఆర్కే పురంలో 368, రోహిణిలో 383, వజీర్‌పూర్‌లో 391గా ఏక్యూఐ లెవల్స్ నమోదయ్యాయి. దేశ ఆర్థిక రాజధాని ముంబైలో గాలి నాణ్యత సూచీ 140తో మోడరేట్ కేటగిరీలో నమోదైంది. ముంబై మహానగరాన్ని సైతం పొగ మంచు కమ్మేసింది.

# ఆర్మూర్ గులాబీలో కలకలం




**నిజామాబాద్, నవంబర్ 12 ( వెలుతురు):**
నిజామాబాద్ జిల్లాలో మాజీ ఎమ్మెల్యేల తీరుపై.. గులాబీ క్యాడర్ గుస్సాగా ఉన్నారట. పార్టీ కష్టకాలంలో ఉంటే.. నేతలు నియోజకవర్గానికి ముఖం చాటేస్తుండటం పట్ల కార్యకర్తలు గుర్రుగా ఉన్నారట. పార్టీ సీనియర్ మహిళా శాసన సభ్యులు సబితా ఇంద్రారెడ్డి, సునీత లక్ష్మారెడ్డిపై.. సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిస్తే.. జిల్లాలో సగానికి పైగా నియోజకవర్గాల్లో నిరసన కార్యక్రమాలు జరగలేదంటే అక్కడి పరిస్థితి ఎలా ఉందో తేటతెల్లమవుతోందని జోరుగా చర్చించుకుంటున్నారట. బాల్కొండ, కామారెడ్డిలో సీఎం దిష్టిబొమ్మలు దగ్ధం చేస్తే.. బాన్సువాడ, ఆర్మూర్ లో మొక్కుబడిగా కార్యక్రమం జరిగినట్టు చెబుతున్నారు. ఇక నిజామాబాద్ అర్బన్, రూరల్, బోధన్, ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజకవర్గ నేతలు.. కేటీఆర్ ఆదేశాలను లైట్ తీసుకున్నారట. కార్యక్రమాలు చేసేందుకు క్యాడర్ కు సైతం దిశానిర్దేశం చేయలేదట. దీంతో గులాబీ శ్రేణులు తమ నేతల తీరుపై.. చిటపటలాడుతున్నారట. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో పార్టీ దాదాపుగా ఖాళీ అయ్యిందని పొలిటికల్ వర్గాల్లో టాక్ నడుస్తోంది. త్వరలో మేయర్ సైతం పార్టీ మారేందుకు సర్వం సిద్ధం చేసుకున్నారట. మాజీ ఎమ్మెల్యే బిగాల సైతం వలసలను అడ్డుకోలేకపోతున్నారట. దాంతో అడపాదడపా నియోజకవర్గానికి వస్తూ.. పార్టీ కార్యక్రమాలు మొక్కుబడిగా జరిపిస్తున్నారట. రూరల్ లో మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమి అనంతరం.. నియోజకవర్గానికి ఎక్కువగా రావడం లేదట. నేతలె పక్కదారి చూస్తుండడంతో.. క్యాడర్ సైతం హస్తం గూటికి క్యూ కట్టారట. ఇక బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి నుంచి ఇంకా తేరుకోలేకపోతున్నారట. ఇప్పటి వరకు నియోజకవర్గంలో అడుగు పెట్టలేదట. ఈ క్రమంలోనే నియోజకవర్గంలో ఇంచార్జీ బాధ్యతల నుంచి షకీల్ ను తప్పించాలని క్యాడర్ కోరుతున్నారట. ఆర్మూర్ లో మాజీ ఎమ్మెల్యే, జిల్లా అధ్యక్షునిగా ఉన్న జీవన్‌రెడ్డి.. హైదరాబాద్ కు పరిమితం అయ్యారట. ఇప్పటికే ఆర్మూర్ లోనూ ద్వితీయ శ్రేణి నేతలు హస్తం గూటికి చేరారట. అలానే ఎల్లారెడ్డి, జుక్కల్ మాజీ ఎమ్మెల్యేలు చాలా రోజులుగా నియోజకవర్గానికి దూరంగా ఉంటున్నారట. క్యాడర్ కు అందుబాటులో ఉండకుండా.. నియోజకవర్గానికి ముఖం చాటేశారట. జిల్లాల్లోని నేతలంతా పార్టీకి దూరంగా ఉండడం వెనుక ఏదైనా వ్యూహం ఉందా అనే టాక్ నడుస్తోందట. నేతలంతా పార్టీ మారాలనే ఆలోచనలో ఉన్నారా ? అన్న చర్చజరుగుతోందట. ఇంచార్జీలుగా ఉన్నా లేనట్లు కాకుండా.. పార్టీ పటిష్టత కోసం అందుబాటులో ఉండాలని క్యాడర్ కోరుతున్నారట. ఒక వైపు అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ఘోర పరాజయాలు.. ప్రతిపక్ష నేత కేసీఆర్ ఫాం హౌస్ కే పరిమితమవుతున్నారని విమర్శను మూటగట్టుకుంటున్నారు. పార్టీ కార్యక్రమాల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎక్కడ కనిపించక పోవడం ఆ వాదనలను మరింత బలపరుస్తున్నాయి. ఇక వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఉన్న కేటీఆరే పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. అయితే వర్కింగ్ ప్రెసిడెంట్ గా కేటీఆర్ విఫలం అయ్యారని విమర్శలు వస్తున్నాయి. రీసెంట్ గా కేటీఆర్ బావమరిది పాకాల రాజు ఫామ్ హౌస్ పార్టీ ఇష్యూ ఫుల్ హాట్ టాపిక్ అయ్యింది. దీంతో మూలిగే నక్క మీద తాటి పండు పడినట్లుగా.. మాజీలు సైతం ఒక్కొక్కరుగా సైడ్ అవుతుండడం పార్టీ కార్యకర్తలని కలవరపెడుతుందట. ఇప్పటికే వరుస ఓటములతో సతమవుతున్న గులాబీ పార్టీకి.. ఈ వ్యవహారం మరింత తలనొప్పులు తెస్తుందని అభిప్రాయపడుతున్నారట. మరోవైపు పార్టీ నేతల తీరుపై.. గులాబీ బాస్ అసంతృప్తితో ఉన్నారట. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్న తరుణంలో.. పార్టీ క్యాడర్ ను యాక్టివ్ చేయాల్సిన లీడర్లు పట్టించుకోకపోవడం పట్ల గుర్రుగా ఉన్నారట. ఈ పరిస్థితుల్లో మాజీల వ్యవహారంలో కేసీఆర్ ఏ నిర్ణయం తీసుకుంటారు ? అసలు మాజీలు ఏం చేయాలనుకుంటున్నారని చర్చ జరుగుతోంది.

# తెలంగాణ డబ్బులతో మహారాష్ట్ర, జార్ఖాండ్ లో యాడ్స్



**హైదరాబాద్, నవంబర్ 12 ( వెలుతురు):**
తెలంగాణ ప్రజల సొమ్ముతో మహారాష్ట్రలో యాడ్స్.. ఏంటి రేవంతన్నా ఇదీ! తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పది నెలలైంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు సీఎం ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే కొన్ని అమలవుతున్నాయి తెలంగాణాలో పదేళ్ల తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఇందుకు కారణం ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు ఒక కారణమైతే.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనతో ప్రజలు విసిగిపోవడం.. కేసీఆర్ అహంకార పూరిత పాలనపై ఆగ్రహంగా ఉండడం కూడా కాంగ్రెస్ గెలుపునకు దోహందం చేశాయి. ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీ.. రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీంతో ఎన్నికల హామీలు నెరవేర్చడంపై రేవంత్ సర్కార్ దృష్టిపెట్టింది. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తోంది. ఇటీవలే రైతుల పంట రుణాలు మాఫీ చేశారు. అయితే పూర్తిస్థాయిలో జరగలేదని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఇక ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్ల పెంపు, రేషన్ కార్డుపై సన్నబియ్యం, విద్యార్థులకు స్కూటీలు ఇవ్వలేదు. ఖరీఫ్‌లో రైతులకు పెట్టుబడి సాయం చెల్లించలేదు. వీటిపై విపక్ష బీఆర్ఎస్, బీజేపీ ఆందోళనలు చేస్తున్నాయి. ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని, ఇప్పుడు సన్న వడ్లకు ఇస్తామని మాట మార్చారు. ఇలాంటి పరిస్థితిలో మన పొరుగు రాష్ట్రం మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చింది. నవంబర్ 13న ఎన్నికలు జరుగనున్నాయి. దీంతో తెలంగాణ కాంగ్రెస్ నేతలు మహారాష్ట్రతో పాటు జార్ఖండ్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. ఇదిలా ఉంటే.. తెలంగాణ నేతలు ప్రచారానికి పరిమితం కాకుండా.. తెలంగాణ ప్రజల సొమ్ముతో మహారాష్ట్ర పత్రికల్లో కాంగ్రెస్ పార్టీ విజయాలు, గొప్పలు, తెలంగాణలో అమలవుతున్న పథకాల గురించి ప్రకటనలు ఇస్తున్నారు. మరాఠా ఓటర్లను ఆకట్టుకునే ప్రనయత్నం చేస్తున్నారు. దీనిపై ప్రజలు మండిపడుతున్నారు. విపక్ష బీజేపీ, బీఆర్ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. మహారాష్ట్రలో ఏం చేస్తారో చెప్పకుం డా.. తెలంగాణలో అది చేశాం.. ఇది చేశాం అని గొప్పలు చెప్పడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఇందుకు తెలంగాణ ప్రజల సొమ్ము వినియోగించడంపై మండిపడుతున్నారు. తెలంగాణ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు ఇంకా అమలు కాలేదు. అనేక హామీలు హామీలుగానే ఉన్నాయి. ఈ క్రమంలో రేవంత్ సర్కార్ మహారాష్ట్రలో తెలంగాణలో అన్నీ చేశామని ప్రచారం చేసుకోవడంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. తప్పుడు ప్రచారంతో మహారాష్ట్ర ప్రజలను మోసం చేయాలని చూస్తోందని విమర్శించారు. అబద్ధాలు చెప్పడంలో కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్‌ను మించిపోయిందని పేర్కొన్నారు. మాజీ సర్పంచుల కోసం బీఆర్ఎస్ ఆందోళన చేయడంపై మండిపడ్డారు. గతంలో బిల్లులు పెండింగ్‌లో పెట్టిందే బీఆర్ఎస్ ప్రభుత్వమని తెలిపారు. చంపినోడే సంతాప సభ పెట్టినట్లు బీఆర్ఎస్ వ్యవహరిస్తోందని మండిపడ్డారుఇక రేవంత్‌సర్కార్ తలపెట్టిన మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టు ఓ కాంగ్రెస్ నేత అల్లు కోసమే అని బండి సంజయ్ ఆరోపించారు. రూ.15 వేల కోట్లు ఖర్చు చేయాల్సిన దానికి రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు పెడతామని అంటున్నారని తెలిపారు. శంషాబాద్ ఆంజనేయస్వామి ఆలయంపై దాడిని కండించారు. హిందూ ఆలయాలపై దాడులు జరుగుతున్నా సీఎం రేవంత్‌రెడ్డి స్పందించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందువులంతా రెడ్డెక్కే పరిస్థితి తెచ్చుకోవద్దని హెచ్చరించారు.


# రెండో రాజధాని అడుగులు




**వరంగల్, నవంబర్ 12 ( వెలుతురు):**
తెలంగాణలో రెండో రాజధాని ఏదంటే, ఎవరైనా వెంటనే వరంగల్ అని చెప్పేస్తారు. హైదరాబాద్, సికింద్రాబాద్ మాదిరిగా వరంగల్, హన్మకొండ కలిసిపోయి విస్తరిస్తున్నాయి. పైగా, కాకతీయులు ఏలిన చారిత్రక నగరం కావడంతో భౌగోళికంగా కూడా వరంగల్ ఎంతో స్పెషల్. ఈ నేపథ్యంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక ఫోకస్ పెట్టింది. ఇప్పటికే సీఎం దీనిపై అధికా రులకు ఆదేశాలు కూడా ఇచ్చారు. హెరిటేజ్ సిటీగా తీర్చిదిద్దేందుకు అన్ని ప్రణాళికలు రచించాలని చెప్పారు. ఈ క్రమంలోనే వడివడిగా అడుగులు పడుతున్నాయి. చారిత్రక నేపథ్యం ఉన్న వరంగల్ నగర అభివృద్ధికి భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విజన్ 2050తో ముందుకెళ్తోంది ప్రభుత్వం. అప్పటి జనాభాను దృష్టిలో పెట్టుకొని రూపొందించిన మాస్టర్ ప్లాన్ కూడా తుది దశకు చేరుకుంది. త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా మాస్టర్ ప్లాన్‌ను విడుదల చేయనున్నారు. దీనికి సంబంధించి వరంగల్ జిల్లా ఇంఛార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కీలక సమావేశం నిర్వహించారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఎంసీహెచ్‌ఆర్‌డీలో వరంగల్, హన్మకొండ జిల్లాల అభివృద్ధి కార్యక్రమాలపై మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, ఆయా జిల్లాల ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన మాస్టర్ ప్లాన్, వరంగల్ ఇన్నర్ రింగ్ రోడ్, ఔటర్ రింగ్ రోడ్, భద్రకాళి టెంపుల్ అభివృద్ధి, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, మెగా టెక్స్‌టైల్ పార్క్, మామునూరు ఎయిర్ పోర్ట్, ఎకో టూరిజం తదితర అంశాలపై ప్రధానంగా చర్చించారు. హైదరాబాద్ నగరానికి ధీటుగా వరంగల్‌ను అభివృద్ధి పరచాలన్న కృతనిశ్చయంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని అన్నారు పొంగులేటి. ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న వరంగల్ మాస్టర్ ప్లాన్‌ను తమ ప్రభుత్వం కొలిక్కి తీసుకువచ్చిందని చెప్పారు. అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. ఇన్నర్ రింగ్ రోడ్, ఔటర్ రింగ్ రోడ్‌కు అవసరమైన భూసేకరణను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని అధికారులను ఆదేశించారు. 41 కిలోమీటర్ల పరిధి ఉన్న వరంగల్ ఔటర్ రింగ్ రోడ్డును మూడు దశల్లో చేపట్టాలని మొదటి దశలో 20 కిలో మీటర్లు, రెండవ దశలో 11 కిలోమీటర్లు, మూడవ దశలో 9 కిలోమీటర్లు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. హైదరాబాద్ మినహా రాష్ట్రంలో మరెక్కడా సరైన ఎయిర్‌పోర్ట్ లేదు. అయితే, వరంగల్ జిల్లాలో రాబోతోందని, వీలైనంత త్వరగా పనులను ప్రారంభించి ఏడాదిలోపు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి అవసరమైన కార్యాచరణను రూపొందించాలని అధికారులను ఆదేశించారు పొంగులేటి. 382 ఎకరాల పరిధిలో ఉన్న చారిత్రాత్మకమైన భద్రకాళి చెరువులో పేరుకుపోయిన పూడికను తీయాలని, ఇందుకు సంబంధించిన పనులను వెంటనే మొదలు పెట్టాలని, ప్రజలకు ఇబ్బంది లేకుండా చెరువును ఖాళీ చేయాలని అధికారులకు సూచించారు. ఈ చెరువు 40 శాతం గుర్రపుడెక్కతో నిండిపోయిందన్నారు. మెగా టెక్స్ టైల్ పార్క్ లో ఏర్పాటు చేసిన కంపెనీలు తప్పనిసరిగా స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వరంగల్ నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులను వీలైనంత త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# ముందుకు సాగని రైతు కమిషన్

**హైదరాబాద్, నవంబర్ 12 ( వెలుతురు):**
ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతుల సంక్షేమం కోసం ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం. జీవో నెంబర్ 36తో దీన్ని ఏర్పాటు చేసి, కిసాన్ కాంగ్రెస్ నేత కోదండ రెడ్డిని చైర్మన్‌గా నియమించింది. భూ చట్టాల నిపుణుడు సునీల్‌తో సహా మరో ఆరుగురు సభ్యులుగా ఈ కమిషన్ ముందుకెళ్తోంది. మొదటి సమావేశం బూర్గుల రామకృష్ణారావు భవన్‌లో జరిగింది. అయితే, కమిషన్‌కు సంబంధించి అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండడం చర్చనీయాంశంగా మారింది. విద్యా కమిషన్‌కు వసతులు ఆగమేఘాలపై ఏర్పాటు కాగా, రైతు కమిషన్‌పై మాత్రం అశ్రద్ధ వహిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. బీఆర్‌కే భవన్‌లో కమిషన్ ఏర్పాటైంది కానీ, సరైన సౌకర్యాలు చేయలేదు సంబంధిత అధికారులు. కనీస వసతులు, కావాల్సిన సిబ్బంది లేక ఇబ్బంది పడుతున్నారు సభ్యులు. చాంబర్లు ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు ఉన్నతాధికారులు. ప్రస్తుతం చైర్మన్ కోదండ రెడ్డి కోసం ఒక చాంబర్ ఏర్పాటు చేయగా, అందులో వాష్ రూమ్‌కు డోర్ లేని పరిస్థితి. ఎవరైనా వాష్ రూమ్‌కు వెళ్లాలంటే మరొకరు దగ్గరలో నిలబడాల్సి వస్తోంది. వచ్చిన గెస్టులు దీన్ని చూసి షాక్ అవుతున్నారు. ఈ పరిస్థితి చూసి బాధ్యతలు తీసుకోడానికి సభ్యులు వెనుకాడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యానికి ఇది నిలువెత్తు నిదర్శనం గా కనిపిస్తోంది. బాధ్యతలు తీసుకున్న మెంబర్లు చాంబర్ల లేక చైర్మన్ రూమ్‌లోనే కూర్చుంటున్నారు. ఈ పరిస్థితి చూసి రాములు నాయక్ తనకు పదవి వద్దని అంటున్నట్టు సమాచారం. ఓవరాల్‌గా ఈ వ్యవహారం చూశాక, అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా రైతుల కోసం ఈ కమిషన్‌ను ఏర్పాటు చేస్తే, కిందిస్థాయిలో అధికారులు నీరుగార్చే ప్రయత్నంలో ఉన్నారు. దీనికి ప్రధాన కారణం, వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రఘునందన్‌కు కమిషన్ ఏర్పాటు ఇష్టం లేదనే టాక్ వినిపిస్తోంది. అందుకే, కమిషన్ ఏర్పాటుపై జీవో ఇవ్వడానికి ఈయన మొదట్లో ఆలస్యం చేశారని అనుకుంటున్నారు. రాష్ట్రంలో రైతు సంక్షేమం కోసం నిర్ణయాలు తీసుకుంటోంది ప్రజా ప్రభుత్వం. ఇప్పటికే రుణమాఫీ అందించి ఎన్నో కుటుంబాల్లో సంతోషాన్ని నింపింది. వారి అవసరాల కోసం ప్రభుత్వం రైతు కమిషన్‌ను ఏర్పాటు చేస్తే, అధికారులు మాత్రం దీన్ని పెత్తనంగా భావిస్తున్నారు. అందుకే, పైసా కూడా వ్యవసాయ శాఖ నుండి విడుదల కావడం లేదట. దీంతో సొంత ఖర్చులతోనే టీ, స్నాక్స్ తెప్పించుకుంటున్నారు సభ్యులు. అంతేకాదు,



సొంత మనుషులనే సిబ్బందిగా వాడుకుంటున్నారట. ఈ ఇష్యూని సీఎం దృష్టికి తీసుకెళ్లే పనిలో కమిషన్ చైర్మన్, సభ్యులు ఉన్నారురైతు కమిషన్‌పై సీఎం రేంత్ రెడ్డి ఎంతో కృతనిశ్చయంతో ఉన్నారు. రైతుల పట్ల ఉన్న ప్రేమతో దీన్ని ఏర్పాటు చేశారు. కానీ, వ్యవసాయ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా వారిలో మార్పు రావాలి. నిజానిజాలు బయటకు తీసుకొస్తుంది. జాగ్రత్త ఆఫీసర్స్.

# దేశ నిర్మాణంలో విద్యార్థులదే కీలక పాత్ర

## ప్రధానోపాధ్యాయురాలు ప్రియదర్శిని




**జహీరాబాద్ వెలుతురు నవంబర్ 12:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం కొత్తూరు(బి) గ్రామం లోని జెడ్పి ఎచ్ ఎస్ పాఠశాలలో విద్యార్థులకు ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు మంగళవారం టీ షర్ట్, ఐడెంటీ కార్డు, బెల్ట్ లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణను అలవాటు చేసుకొని ఉత్తమ పౌరులుగా ఎదగాలని సూచించారు. అప్పుడే దేశ నిర్మాణంలో ప్రధాన పాత్ర పోషిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగేష్, సిద్దన్న, బాబు, భాస్కర్, ప్రసాద్ బాబు, తారా బాయి, సునీత విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# రెవెన్యూ అధికారులపై దాడికి నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన....



**జహీరాబాద్ వెలుతురు నవంబర్ 12:**
వికారాబాద్ జిల్లాలో కలెక్టర్, ఇతర అధికారులపై జరిగిన దాడిని సంగారెడ్డి జిల్లా న్యాల్కల్ మండల రెవిన్యూ అధికారులు ఖండించారు. సోమవారం వికారాబాద్? జిల్లా దుద్యాల మండలం లగిచెర్ల గ్రామంలో జిల్లా కలెక్టర్?, అదనపు కలెక్టర్?, ఇతర అధికారులపై జరిగిన దాడిని వ్యతిరేకిస్తూ న్యాల్కల్ మండల రెవిన్యూ అధికారులు భోజన విరామసమయంలో నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులకు, అధికారులకు భద్రత కల్పించాలని కోరారు. ఇటువంటి ఘటన వల్ల అభద్రతా భావన కలుగుతుందని, ఈ దాడికి పాల్పడిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, ఇటువంటి దాడులు పునరావృత్తం కాకుండా చూడాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో న్యాల్కల్ మండల తహసీల్దార్ వి. భూపాల్, డిప్యూటీ తహసీల్దార్ రాజ్ రెడ్డి మరియు మండల రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# బదిలీపై వచ్చిన ఎస్ఐకి సన్మానం



**వెలుతురు నారాయణఖేడ్ నవంబర్ 12 :**
నారాయణఖేడ్ నియోజకవర్గం మనూరు మండల కేంద్రంలో బదిలీపై వచ్చిన ఎస్ఐకి కాంగ్రెస్ సీనియర్ నాయకులు రహీం పండరి నర్సింలు మంగళవారం శాల్వతో సన్మానించారు.. ఈ సందర్భంగా రహీమ్ మాట్లాడుతూ.. ప్రజలకు సైబర్ క్రైమ్ మీద , ప్రజలకు చట్టాల పైన అవగాహన ,మానవ హక్కుల పరిరక్షణ కోసం,బాల్య వివాహాల పైన ,అవగన చర్చించడం జరిగింది అదే విధంగా మండలంలో శాంతి భద్రతలు కాపాడాలని కోరారు. ఎస్ ఐ కోటేశ్వర రావు మాట్లాడుతూ చట్టాల అవగాహన కోసం మీ అందరి సహకారం ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తాం అన్నారు.

# ప్రధానం కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే



**వెలుతురు నారాయణఖేడ్ నవంబర్ 12 :**
నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని కట్ట మైసమ్మ ఆలయం దగ్గర వీరి శెట్టి కుమార్తె ప్రధానం కార్యక్రమానికి హాజరై నూతన వధువుకు శుభాకాంక్షలు తెలియజేసిన గౌరవ నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహా రెడ్డి భూపాల్ రెడ్డి వారితోపాటు మండల పార్టీ అధ్యక్షులు పరమేష్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పరశురాం, పట్టణ పార్టీ అధ్యక్షులు నగేష్ సెట్, టిఆర్ఎస్వి నియోజకవర్గ అధ్యక్షులు అంజా గౌడ్, మండల యువత అధ్యక్షులు మచ్చేందర్, కురుమ సంఘం తాలూకా ఉపాధ్యక్షుడు మల్గొండ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కును అందించిన ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి



**వెలుతురు నారాయణఖేడ్ నవంబర్ 12 :**
నారాయణఖేడ్ నియోజకవర్గం సిర్గాపూర్ మండల కేంద్ర పరిధి లోని ఆప్తులు ఏ.బాల్ రాజ్ సీఎంఆర్ చెక్కును అందించిన గౌరవ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి వారి వెంట శంకరయ్య స్వామి,శంకర్ నాయక్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# బీజేవైఎం న్యాల్కల్ మండల అధ్యక్షుడిగా విష్ణు సునర్ నియామకం...

**జహీరాబాద్ వెలుతురు నవంబర్ 12:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం న్యాల్ కల్ మండల కేంద్రమైన న్యాల్ కల్ లో మంగళవారం బీజేపీ మండల అధ్యక్షులు ఓంకార్ యాదవ్ ఆధ్వర్యంలో బీజేపీ ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో న్యాల్ కల్ మండల బీజేవైఎం అధ్యక్షుడిగా సునార్ విష్ణు ని నియమించినట్లు మండల పార్టీ అధ్యక్షులు ఓంకార్ యాదవ్ తెలిపారు. ఈ నియమక పత్రాన్ని బిజెపి రాష్ట్ర నాయకులు గొల్ల భాస్కర్, ఓబిసి జిల్లా అధ్యక్షులు మాజీ జడ్పీటీసీ శివాజీ రావు పాటిల్, బిజెపి మండల అధ్యక్షులు ఓంకార్ యాదవ్ ల చేతుల మీదుగా విష్ణు సునర్ కి అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా విష్ణు మాట్లాడుతూ నా మీద నమ్మకం ఉంచి నన్ను బీజేవైఎం మండల అధ్యక్షులుగా నియమించిన మండలం అధ్యక్షులు ఓంకార్ యాదవ్ అన్న మరియు సీనియర్ నాయకులందరికి పేరు పేరున హృదయ



పూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శులు మల్లేష్ గంగ్వార్, రాహుల్ పాలింకర్, సీనియర్ నాయకులు మధుసూదన్ రెడ్డి, నవీన్ విరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రూం టు రీడ్ గ్రంథాలయ ప్రారంభోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న డీఈవో వెంకటేశ్వర్లు

**జహీరాబాద్ వెలుతురు నవంబర్ 12:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని ప్రభుత్వ ప్రైమరీ స్కూల్ రంజోల్ లో మంగళవారం రూం టు రీడ్ గ్రంథాలయ ప్రారంభోత్సవం కార్యక్రమం డీఈవో వెంకటేశ్వర్లు , ఎంఈఓ బసవరాజు, పాఠశాల కంప్లెక్ ప్రధాన ఉపాధ్యాయులు, నాను సింగ్, పాఠశాల ఉపాధ్యాయులు, మహమ్మద్ షబ్బీర్ అలీ, రూం టు రీడ్ స్టేట్ మేనేజర్ నరసింహ చారి ల చేతుల మీదుగా నిర్వహించడం జరిగింది. రూమ్ టు రీడ్ గ్రంథాలయంకి సంబంధించి మరియు ఇన్స్ట్రక్షన్ ప్రోగ్రాం కి సంబంధించి ఈ రెండు కార్యక్రమాలు నిర్వహణలో భాగంగా సద్వినియోగం చేసుకునేలా పుస్తకాలను వినియోగించుకోవాలని డిఈ వో చెప్పడం జరిగింది. ఎంఈఓ కార్యక్రమంను ఉద్దేశించి సూచనలో భాగంగా ఒకటవ తరగతి పిల్లల పైన ఎక్కువ దృష్టి పెట్టాలని అందుకు తోడుగా లైబ్రరీ పుస్తకాలను కూడా వాడుకోవాలని చెప్పారు. గ్రంథాలయం యొక్క ప్రాముఖ్యతను మరియు వాటి నిర్వహణ గురించి చర్చిస్తూ ప్రతిరోజు పిల్లలు టైం టేబుల్ ప్రకారంగా గ్రంథాలయ పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పడం జరిగింది. ఇంస్ట్రక్షన్స్ మరియు లైబ్రరీ కి సంబంధించిన మెటీరియల్స్ గురించి డీ కోటబుల్ బుక్స్ ఒకటవ తరగతి చదువుతున్న విద్యార్థులు ఎంతో ఉపయోగ పడుతుందని పుస్తకాలు పంపిణీ మరియు వినియోగం గురించి రూం టు రీడ్ స్టేట్



మేనేజర్ చెప్పడం జరిగింది. చిన్నారులు నాటకీకరణ మరియు growby కి సంబంధించి యాక్టివిటీస్ ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం సందర్భంగా అందించిన డీ కోటబుల్ బుక్స్ మరియు పేరెంట్స్ క్యాలెండర్ ని ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఫహీమున్నిసా బేగం, జి.శ్యాంసుందర్, ఆర్షియ ఖానం, బి .సబిత,సదఫ్, గీతాంజలి మరియు రూమ్ టుడే స్టేట్ మేనేజర్ నరసింహ చారి, అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసరు తేజస్వీ, లిటరసీ ఫెసిలిటేటర్ రవి,విజయశ్రీ, సంధ్య మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలు పాల్గొన్నారు.

# ఎస్ సీ బాలికల వసతి గృహంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు




**జహీరాబాద్ వెలుతురు నవంబర్ 12:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండల లీగల్ సర్వీసెస్ కమిటీ వారి ఆధ్వర్యంలో స్థానిక ఎస్ సీ బాలికల వసతి గృహంలో మంగళవారం విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సును సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ సూరి కృష్ణ నిర్వహించి విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి చదువుతోపాటు సాధారణ చట్టాలపై అవగాహన కలిగి ఉండడం ఎంతయినా అవసరమని అన్నారు. కార్యక్రమంలో మోటారు వాహనాల చట్టం, పోక్సో చట్టం, బాలకార్మిక నిర్మూలన చట్టం, బాల్య వివాహ నిరోధక చట్టం, జువైనెల్ జస్టిస్ యాక్ట్, ఉచిత న్యాయసేవా సహాయంపై విద్యార్థులకు తెలియజేసారు. విద్యార్థులందరూ చట్టాలను గౌరవించాలని సూచించారు. మీ చుట్టు బాల్య వివాహ బాధితులు, బాల కార్మికులు ఎక్కడైనా ఉన్నట్లు గుర్తిస్తే స్థానిక తహసీల్దార్ లేదా స్థానిక పోలీస్ అధికారికి లేదా మండల లీగల్ సర్వీసెస్ కార్యాలయంలో గాని లేదా 1098 కి ఫోన్ ద్వారా తెలుపవచ్చని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలియజేసారు. ఏ సమాచారం గురించి తెలుసుకోవాలనుకున్న మండల లీగల్ సర్వీసెస్ కమిటీ కార్యాలయంను సంప్రదించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో బార్ ప్రెసిడెంట్ గోపాల్, లీగల్ సర్వీసెస్ సిబ్బంది, పారాలీగల్ వాలంటీర్లు, వసతి గృహ వార్డెన్, సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# మహాప్రసారం అందజేసిన మాజీ జెడ్పిటిసి



**వెలుతురు నారాయణఖేడ్ నవంబర్ 12 :**
నారాయణఖేడ్ మండల తాజా మాజీ జెడ్పిటిసి రథోడ్ లక్ష్మీబాయి రవీందర్ నాయక్ కరణ్ గజేంద్ర మహారాజ్ ఆధ్వర్యంలో సుమారు 200 మందితో చేపట్టిన గానుగాపూర్ దత్తాత్రేయ స్వామి 7వ మహా పాదయాత్ర కార్యక్రమాన్ని విజయవంతంగా ముగించుకొని స్వామివారి మహా ప్రసాదాన్ని గౌరవ నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహా రెడ్డి భూపాల్ రెడ్డి అందజేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే భక్తులందరినీ అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పరమేష్, నాయకులు అంజా గౌడ్,మల్గొండ, మచ్చేందర్, కృష్ణ ప్రసాద్, చింటూ నరేష్, గుండేష్ యాదవ్, తదితరులు ఉన్నారు.

# కులగణనలో 75 ప్రశ్నలు అవసరమా

## ఇంత సంక్లిష్టంగా ప్రశ్నలు దేనికి

## యాప్ రూపొందిస్తే..సులువయ్యేది కదా

## సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ




**హైదరాబాద్,నవంబర్12 వెలుతురు:**
తెలంగాణలో కులగణన వివాదం కాకుండా సులభతరం చేయాలని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ స్పందించారు. కానీ దీనికి 75 ప్రశ్నలు అవసరమా? అని ప్రశ్నించారు. యాప్ రూపొందిస్తే ఎవరి ఫామ్ వాళ్లే పూర్తి చేస్తారన్నారు. వ్యక్తిగత ఆస్తులు, అప్పులు, బ్యాంకు లావాదేవీలు ప్రభుత్వానికి ఎందుకన్నారు. అయితే గణన ద్వారా రాజకీయంగా, ఆర్థికంగా వెనుకబడినవారిని ప్రోత్సహించవచ్చని.. సూచించారు. వికారాబాద్ జిల్లాలో కలెక్టర్, అధికారులపై గ్రామస్థులు ఆవేదనతో దాడి చేశారని.. తమ భూములు పోతాయనే ఆవేదనతోనే వారు అధికారులను అడ్డుకున్నారన్నారు. ఇకపోతే రాజకీయాల్లో దుష్ట సంస్కృతిని ప్రధాని మోదీ తీసుకొచ్చారని నారాయణ విమర్శించారు. జమిలి ఎన్నికలపై ఉన్న దృష్టి దేశ సమస్యలపై లేదని అన్నారు. ధరలు, నిరుద్యోగంపై ఎప్పుడైనా మాట్లాడారా అని ప్రశ్నించారు. జమిలి కోసమే మహారాష్ట్ర, ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలను ఆయన ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారని చెప్పారు. ఆ రెండు రాష్ట్రాల్లో గెలిస్తే జమిలి ఎన్నికల దిశగా వెళ్లాలని మోదీ చూస్తున్నారన్నారు. ఆ ఎన్నికలు ఫెడరల్ వ్యవస్థకు విరుద్ధమని చెప్పారు. మఖ్దూం భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మహారాష్ట్రలో కూటమి పొత్తులో భాగంగా ఒక స్థానంలో పోటీ చేస్తున్నామని.. ఝార్ఖండ్‌లో ఒంటరిగా బరిలో నిలిచామని నారాయణ తెలిపారు. వైకాపా అధ్యక్షుడు జగన్ (జా ఏజీణజీని) 12 ఏళ్లుగా బెయిల్‌పై ఉన్నారన్నారు. కోర్టులకు కూడా ఆయన వెళ్లడం లేదని ఆక్షేపించారు. మోదీ, అమిత్‌షా సహకారంతోనే జగన్ బయట ఉన్నారని ఆరోపించారు.

# సమగ్ర కుటుంబ సర్వేలో 21 రకాల వైకాల్యలకు చోటు ఎక్కడ?

## వైకల్య రకాల కోడ్ లు లేకుండా ముద్రించిన సర్వే పత్రాన్ని మార్చాలి...

## సకలాంగులకు, కులాలకు ఇచ్చిన ప్రాధాన్యత వికలాంగులకు ఎందుకు ఇవ్వలేదు...

## సంగారెడ్డి జిల్లా జిల్లా ప్రధాన కార్యదర్శి, కొన్నింటి నరసింహులు...

**జహీరాబాద్ వెలుతురు నవంబర్ 12:**
సమగ్ర కుటుంబ సర్వేలో 21 రకాల వైకాల్యలకు చోటు ఎక్కడ? వైకల్య రకాల కోడ్ లు లేకుండా ముద్రించిన సర్వే పత్రాన్ని మార్చాలి అని పేర్కొంటూ సంగారెడ్డి జిల్లా జిల్లా ప్రధాన కార్యదర్శి, కొన్నింటి నరసింహులు, వికలాంగుల హక్కుల జాతీయ వేదిక తెలంగాణ రాష్ట్ర కమిటి సభ్యులు రాజకుమార్, అశ్వాక్ లు జహీరాబాద్ రెవిన్యూ డివిజనల్ అధికారి కి మంగళవారం వినతి పత్రం సమర్పించడం జరిగిందని వారు ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు. వారు తెలిపిన పూర్తి వివరాల ప్రకారం...తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో 21 రకాల వికలాంగుల వివరాలు నమోదు చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (NPRD) తెలంగాణ రాష్ట్ర కమిటి డిమాండ్ చేస్తుందని పేర్కొన్నారు. ఈ మేరకు దీనికి సంభందించి ఈ రోజు మెయిల్, వాట్సాప్ ద్వారా వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ బి. శైలజకి వినతిపత్రం పంపించడం జరిగిందని తెలిపారు. కుటుంబ యజమాని మరియు కుటుంబ సభ్యుల వ్యక్తిగత వివరాలు సేకరించడానికి పార్ట్-1 ఫారంలో 13వ నెంబర్ కాలమ్ లో మీరు దివ్యాంగులా అని అడిగారు. 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం 21రకాల వైకాల్యలను గుర్తించింది. సర్వే పత్రంలోని కాలామ్ 13లో కోడ్ నింపడానికి, షెడ్యూల్ నింపడానికి సూచనల పేరుతో ప్రత్యేకంగా హ్యాండ్ బుక్ ఇచ్చారు. హ్యాండ్ బుక్ మిగత వివరాలు సమగ్రంగా ఉన్నప్పటికి



వికలాంగుల వివరాలు మాత్రం సమగ్రంగా లేవు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్వేలో 21రకాల వికలాంగులను విస్మరించడం దురదృష్టకరం. సమగ్ర కుటుంబ సర్వేలో 21 రకాల వైకాల్యలను గుర్తించకుండా రాష్ట్ర ప్రభుత్వం వికలాంగులను మోసం చేసింది. సకలాంగులకు, కులాలకు ఇచ్చిన ప్రాధాన్యత వికలాంగులకు ఎందుకు ఇవ్వలేదు. గత ప్రభుత్వం వికలాంగుల గురించి ఏనాడు పట్టించుకోలేదు. మార్పు తెస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ వికలాంగుల విషయంలో గత ప్రభుత్వం బాటలోనే నడుస్తుంది. సర్వే పత్రంలో వికలాంగుల వివరాలు (వైకల్య రకాలు) లేకుండా ప్రింట్ చేయడం అంటే వికలాంగుల పట్ల వివక్షత తప్ప మరొకటి కాదు. రాష్ట్ర ప్రభుత్వమే వికలాంగుల పట్ల వివక్షత చూపడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. సర్వేలో 21రకాల వికలాంగుల వివరాలు సేకరించడానికి ప్రతి వైకల్యానికి ఒక్క కోడ్ ఉండాల్సిన అవసరం ఉంది. 21రకాల వైకాల్యలకు వెంటనే కోడ్ లు కేటాయించి సర్వే కొనసాగించాలని కోరుతున్నామని వారు తెలిపారు.

## అమృత్ టెండర్ల అవినీతిపై

# ఆధారాలున్నాయ్

**అర్హత లేకున్నా కంపెనీలకు కట్టబెడుతున్నారు**

**కేంద్ర ప్రభుత్వ స్కీంలో అవినీతి జరుగుతుందో ప్రధాని ఏం చేస్తున్నట్లు**

**త్వరలోనే పొంగులేటి, రేవంత్ రెడ్డి పదవులు పోతాయ్**

**రూ.8,888 కోట్ల పనులపై కేంద్ర ప్రభుత్వం విచారణ చేపట్టాలి**

**రేవంత్‌రెడ్డిపై కేంద్ర మంత్రికి ఫిర్యాదు చేశా :**

**న్యూఢిల్లీ, నవంబర్ 12 ( వెలుతురు):**
తెలంగాణ సీఎం రేవంత్ తనకు ఇష్టం వచ్చిన కంపెనీలకు అర్హత లేకున్నా టెండర్లు కట్టబెడుతన్నారని, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతి, కుంభకోణాల్లో కూరుకుపోయిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రాష్ట్రానికి కేటాయించిన రూ.8,888 కోట్ల పనులపై కేంద్ర ప్రభుత్వం విచారణ జరపాలని డిమాండ్ చేశారు. అమృత్ టెండర్ల అవినీతిపై అన్ని ఆధారాలున్నాయని చెప్పారు. సీఎంగా ఉండి రేవంత్‌రెడ్డి అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కేంద్రమంత్రిని కోరామన్నారు. ఢిల్లీలో కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. అర్హత లేకపోయినా శోధా కంపెనీకి టెండర్లు కట్టబెట్టారని చెప్పారు. రూ.1,137 కోట్లకు సంబంధించిన పనులు ఆ కంపెనీకి ఇచ్చారన్నారు. 2021-22లో శోధా కన్‌స్ట్రక్షన్ నికర ఆదాయం రూ.2.2 కోట్లు మాత్రమేనని, అలాంటి కంపెనీకి రూ.800 కోట్ల టెండర్లు ఎలా చేస్తుందని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన టెండర్లు రద్దు చేయాలని కేంద్రమంత్రిని కోరామన్నారు. అమృత్ పథకం టెండర్లకు సంబంధించి వెబ్‌సైట్‌లో వివరాలు లేవని, కేంద్రం స్కీమ్‌లో అవినీతి జరిగితే ప్రధాని మోదీ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఆర్ఆర్ ట్యాక్ వసూలు చేస్తున్నారని ప్రధాని మోదీ స్వయంగా ఆరోపించారు. మరి ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. రేవంత్ తన బావమరిదికి అమృతం పంచి.. కొడంగల్ ఫార్మాతో ప్రజలకు విషం ఇస్తున్నారని చెప్పారు. కుటుంబ సభ్యులకు కాంట్రాక్టులు అప్పగిస్తే అధికార దుర్వినియోగం కాదా అని ప్రశ్నించారు. తెలంగాణలో ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారని వెల్లడించారు. ఆర్ఆర్ అంటే రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ ట్యాక్స్ అని చెప్పారు. రాహుల్, కాంగ్రెస్‌కు తెలంగాణ ఏటీఎంలా మారిందన్నారు. రాష్ట్రంలో తప్పులు జరుగుతున్నాయని ఆధారాలతో వివరాలు ఇస్తున్నామని తెలిపారు. అల్లుడి కోసం కొడంగల్‌ను బలిపెట్టే పరిస్థితి తలెత్తిందని చెప్పారు. అందుకే కొడంగల్‌లో తిరుగుబాటు మొదలైందన్నారు. రుణమాఫీ, రైతుబంధుకు డబ్బులు లేవంటున్నారు. మహారాష్ట్రలో సిగ్గులేకుండా రూ.300 కోట్ల తెలంగాణ సొమ్ముతో ప్రకటనలు ఇచ్చారని విమర్శించారు. పొగులేటి కంపెనీకి రూ.4,300 కోట్ల పనులు అప్పగించారని చెప్పారు. రేవంత్ సర్కార్‌పై కేంద్రం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. సోనియా, చౌహాన్ సహా చాలా మంది పదవులు కోల్పోయారు. రేవంత్ రెడ్డి, పొంగులేటి పదవులు కూడా పోతాయన్నారు. మేం ఢిల్లీకి వస్తే మీకెందుకు భయం అని కాంగ్రెస్ పార్టీని ఉద్దేశించి అన్నారు. ప్రధాన ప్రతిపక్షంగా తాము ఢిల్లీకి వస్తామని, దేశ ప్రజల దృష్టికి ప్రభుత్వ మోసాలను తీసుకొస్తామన్నారు. మీ ఆరోపణలపై మీకు నమ్మకం ఉంటే విచారణ జరిపించాలని తెలిపారు. తెలంగాణలో జరుగుతున్న అవినీతిపై ఎప్పటికప్పుడు ఢిల్లీకి వచ్చి ఎండగడతానన్నారు. తెలంగాణ నుంచి ఇతర రాష్ట్రాలకు డబ్బు వెళ్తున్నదని చెప్పారు. తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దుల్లో ఈసీ సెక్యూరిటీ పెంచాలన్నారు. రాష్ట్రంలో వసూళ్లు, బెదిరింపులు పెరిగాయని చెప్పారు.

## ఎన్ టి పి సి 50 సంవత్సరాలు పూర్తి చేసిన సందర్భంగా కాంట్రాక్ట్ కార్మికులకు స్వీట్స్ గిఫ్ట్ లు పంపిణీ చేయాలి.

### ఎన్టిపిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కు వినతి పత్రం ఇచ్చిన సిఐటియు

**గోదావరిఖని, వెలుతురు,నవంబర్ .12**
రామగుండం ఎన్టిపిసి విద్యుత్, సంస్థ 50 సంవత్సరాలు పూర్తి చేసిన సందర్భంగా అందులో భాగస్వామ్యులైన కాంట్రాక్ట్ కార్మికులకు గుర్తింపుగా గిఫ్ట్స్, స్వీట్స్, పంపిణీ చేయాలని సిఐటియు, అనుబంధ రామగుండం ఇండస్ట్రియల్ వర్కర్స్, యూనియన్, మంగళవారం, ఎన్టిపిసి ఎగ్జిక్యూటివ్, డైరెక్టర్‌కు మెమోరాండం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎన్టిపిసిలో యూనియన్, ప్రధాన కార్యదర్శి నాంసాని శంకర్, మాట్లాడుతూ రామగుండం ఎన్టిపిసిలో3500 మంది కాంట్రాక్టు కార్మికులు విద్యుత్తు ఉత్పత్తిలో భాగస్వాములై, దేశంలోనే ఎన్టిపిసి అగ్రగామి సంస్థగా గుర్తింపు పొందడంలో తమ వంతుపాత్ర పోషించి, సంస్థకు ఎన్నో అవార్డులు, రివార్డులు తీసుకురాగలిగారని, కాంట్రాక్టు కార్మికులు ఈ సంస్థను పురోగతివైపుతీసుకు వెళ్ళడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ఎన్టిపిసి విద్యుత్, సంస్థ50 సంవత్సరాల సంబరాలు, రేసింగ్‌డే, జరుపుకుంటున్న సందర్భంగా కాంట్రాక్టు కార్మికులకు గిఫ్ట్స్,స్వీట్స్ పంపిణీ చేయాలని యూనియన్, ఆధ్వర్యంలో ఎన్టిపిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. యూనియన్ అధ్యక్షుడు గిట్ల లక్ష్మారెడ్డి, దండ రాఘవరెడ్డి, కాదశి మల్లేష్, ఎండి యాకూబ్, కేటాప్ రాజకుమార్, పాల్గొన్నారు.

## ప్రజలకు ఉపయోగపడే పనులు చేయండి

### వీది విక్రయ దుకణసముదాయాలను వినియోగంలోకి తీసుకురండి,

### రామగుండం మాజీ శాసనసభ్యులు బి.ఆర్.ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్,



**గోదావరిఖని, వెలుతురు, నవంబర్ .12**
వీధీవిక్రయ దుకాణ సముదాయాన్ని వినియోగంలోకి తీసుకురావాలని రామగుండం మాజీ ఎమ్మెల్యే బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ అన్నారు. మంగళవారం ఎఫ్ .సి .ఐ కార్నర్,వద్ద వీధివిక్రయ దుకాణాల సముదాయాలను ఆయనసం దర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిరువ్యాపారుల కోసం బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో నాటి మంత్రి కేటీఆర్,మాంజురు చేసిన 50 లక్షల రూపాయల నిధులతో విధివిక్రయ దుకాణ సముదాయాలను నిర్మించడం జరిగిందన్నారు. దుకణాలను వినియోగంలోకి తీసుకురాక పోవడం మూలంగా శిధిలావస్థకుచేరుకుందన్నారు. స్దానిక ఎమ్మెల్యే విక్రయ దుకణాలకు కావాల్సిన సౌకర్యాలు కల్పించి వినియోగంలోకి తీసుకురావలన్నారు. ఈకార్యక్రమం లో డిప్యూటీ,మేయర్ నడిపెల్లి అభిషేక్ రావు, కార్పోరేటర్లు కుమ్మరి శ్రీనివాస్, కల్వచర్ల కృష్ణవేణీ, బాదె అంజలి,నాయకులు బుర్ర శంకర్ గౌడ్, పర్వతాలు, నారాయణ దాసు మారుతి, వీరాలాల్ చందుశంకర్, మల్లేష్, కిరన్, జీవెంకటేష్, పాల్గొన్నారు.

## విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వాయిస్తున్న కృష్ణవేణి టాలెంట్ స్కూల్



**గోదావరిఖని, వెలుతురు , నవంబర్, 12**
విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తూ గోదావరిఖనికృష్ణవేణి టాలెంట్ స్కూల్ యాజమాన్యం మంగళవారం, విద్యార్థులకు వైద్య శిభిరం నిర్వహించారు. విద్యార్థులకు విద్యతో పాటు వారు ఆరోగ్యంగా అందేలా చూసుకునే విధంగా కృష్ణవేణి విద్యాసంస్థలుగత రెండు సంవత్సరాలుగా వైద్యశిబిరాన్ని నిర్వహించడం జరుగుతుందని పాఠశాల డైరెక్టర్ మంజుల శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ వైద్య శిబిరంలోవిద్యార్థిని విద్యార్థులకు కంటి, దంత,జనరల్ ఫిజీషియన్,డాక్టర్ల సమక్షంలో పరీక్ష నిర్వహించడం జరిగిందని,చిన్న చిన్న ఆరోగ్య కారణాలు తెలుసుకోవడం పిల్లలని రెగ్యులర్గా పాఠశాలలో హాజరపరచటం, పిల్లల హాజరు శాతంపెంచడం, పిల్లల ఆరోగ్య నివేదిక తయారు చేసివారి ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవడం తమ భాధ్యత భావించామని అన్నారు. ఈకార్యక్రమంలో డాక్టర్లు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## సమగ్ర సర్వేలో వ్యక్తిగత వివరాలు ఎందుకు

### ప్రజలకు అనుమానాలు రావడం సహజం

### సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

**వరంగల్,నవంబర్12( వెలుతురు):**
సమగ్ర ఇంటింటి సర్వేలో వ్యక్తిగత వివరాలు చెప్పాల్సిన అవసరం లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఇన్ని ప్రశ్నలతో ప్రజల వద్దకు వెళితే వారు సహజంగానే అనుమానిస్తారని అన్నారు. మంగళవారం గార్ల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కులగణన కోసమే సర్వే చేయాలన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ మతోన్మాద రాజకీయాలను ప్రోత్సహిస్తున్నదని, మైనార్టీ నాయకులను అణిచివేస్తున్నదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో సాధ్యం కాని హామీలిచ్చి ప్రజలకు మొండి చేయి చూపిస్తున్నదన్నారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలు ఎప్పుడో అమలు చేస్తారో కాంగ్రెస్ పార్టీకే తెలియని పరిస్థితి నెలకొందన్నారు. రైతులకు హామీ ఇచ్చిన రైతు భరోసా, రూ. రెండు లక్షల రుణమాఫీ కూడా చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్‌లో ఏ మంత్రి ఏం మాట్లాడుతారో అర్థం కాని పరిస్థితి ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 11 నెలలైనా ఒక్క హామీని పూర్తి స్థాయిలో అమలు చేయలేదని తమ్మినేని అన్నారు.

## రైతు కలలో ఆనందం చూడడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

### గుంటూరు పల్లిలో వడ్లు కొనుగోలు కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే మక్కన్ సింగ్



**గోదావరిఖని, వెలుతురు,నవంబర్. 12**
రైతుల కళ్ళలో ఆనందమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని మక్కన్ సింగ్ రాజ్ ఠాగూర్, అన్నారు. పాలకుర్తి మండలం గుంటూరుపల్లి మంగళవారం రోజున ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే మక్కన్ సింగ్, ప్రారంభించారు. ఈసందర్భంగా, ఎమ్మెల్యే మాట్లాడుతూ. ధాన్యంలో ఎలాంటి కటింగ్, లేకుండా కేంద్రాల ద్వారా మద్దతు ధరకుకొనుగోలు చేస్తామనిభరోసా ఇచ్చారు. సన్నధాన్యాని కిక్వింటాలుకు రూ.500 బోనస్, చెల్లిస్తామని రైతులు భరోసాగా ఉండాలని తెలిపారు. దళారుల చేతిలో మోసపోవద్దని కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు, వాటిని రైతుకు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కొందరు ప్రతిపక్ష పార్టీల నాయకులు చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని, ప్రతి గింజ సన్నవడ్లకు బోనస్, రాష్ట్రప్రభుత్వం చెల్లిస్తుందని హామీ ఇచ్చారు.నిబంధనలు మేరకు ధాన్యంలో తేమశాతం ఉండేలా రైతులు ధాన్యాన్ని ఆరబోయాలని సూచించారు. తడిసిన,మొలకెత్తిన ధాన్యం ఉంటే వేరువేరుగా ఉంచాలని మిలర్లతో మాట్లాడి సపరేటుగా మద్దతు ధర కుకొనుగోలు చేయించే భాధ్యత నాదేనని ఎమ్మెల్యే హామీఇచ్చారు. రానున్న యాసంగి సాగుకు అనురాధ కార్తెలోనార్లు పోయాలని,తద్వారా అనుకూల వాతావరణంలో పంట చేతికి వస్తుందని అన్నారు. యాసంగిలో తెగుళ్లను తట్టుకునే వరిరకాలను సాగు చేసుకోవాలని రైతులకు వివరించారు. 1010,64,118 రకాల యాసంగికి అనుకూలమన్నారు. రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని, ప్రజాపాలనలో రైతులకు మేలు చేయడమే కాంగ్రెస్ సర్కార్, లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమాల్లో గ్రామసమాఖ్య సంఘం నిర్వహులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసిలు, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సిబ్బందికి ఆత్మస్థైర్యం కల్పించేలా చర్యలు

### ట్రెస్సా జిల్లా అధ్యక్షులు డి శ్రీనివాస్

### వికారాబాద్ ఘటనలో నిందితులకు కఠిన శిక్ష విధించాలి

### వికారాబాద్ ఘటన పై నిరసన కార్యక్రమాలు నిర్వహించిన జిల్లా రెవెన్యూ సిబ్బంది





**పెద్దపల్లి,వెలుతురు,నవంబర్ -12:**
రెవెన్యూ సిబ్బందికి ఆత్మస్థైర్యాన్ని కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ట్రెస్సా జిల్లా అధ్యక్షులు డి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా రెవెన్యూ సిబ్బంది వికారాబాద్ జిల్లాలో రెవెన్యూ సిబ్బంది, కలెక్టర్ పై జరిగిన దాడికి నిరసనగా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డి వేణు రెవెన్యూ సిబ్బంది నిరసన కార్యక్రమంలో పాల్గొని వారికి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ట్రెస్సా జిల్లా అధ్యక్షులు డి శ్రీనివాస్ మాట్లాడుతూ, వికారాబాద్ ఘటన చాలా దురదృష్టకరమని, అధికారులపై దాడులు చేయడం, ప్రజలకు రెవెన్యూ సిబ్బంది అనేక రకాలుగా అందించే సేవలను విస్మరిస్తూ, పూర్తి అవగాహన రాహిత్యంతో భౌతిక దాడులు దిగడం దుర్మార్గమని అన్నారు. దాడి చేసిన వారిపై కఠినంగా శిక్షించాలని, రెవెన్యూ సిబ్బందికి ఆత్మస్థైర్యం కల్పించాలని, అవసరమైన భద్రత కల్పించాలని అన్నారు. ట్రెస్సా అసోసియేట్ అధ్యక్షులు రాజ్ కుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసే ఫార్మాసిటీ కోసం భూసేకరణ ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన వికారాబాద్ జిల్లా కలెక్టర్, కోడా ప్రత్యేక అధికారి, రెవెన్యూ సిబ్బంది పై గ్రామస్తులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, ప్రజలతో నేరుగా సంబంధాలు ఉంటూ పని చేసే రెవెన్యూ సిబ్బందిపై దాడులు అవాంఛనీయమని అన్నారు. జిల్లా కలెక్టర్ రెవెన్యూ అధికారులపై దాడులు చేసిన వారిని గుర్తించి వెంటనే అరెస్ట్ చేయాలని, వారిపై హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి కఠినంగా శిక్ష పడేలా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో భూసేకరణ కోసం వెళ్లే రెవెన్యూ సిబ్బందికి భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు. అనంతరం ట్రెస్సా జిల్లా కమిటీ తరఫున రెవెన్యూ సిబ్బంది డిమాండ్లను వివరిస్తూ కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ట్రెస్సా అధ్యక్షులు వకీల్, పెద్దపల్లి జనరల్ సెక్రెటరీ మహేష్, పెద్ద ఎత్తున రెవెన్యూ సిబ్బంది సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ ఎన్విరాన్ మెంట్ జి ఎం సైదులును సన్మానించిన ఆర్ జీ-1 జీఎం లలిత్ కుమార్




**గోదావరిఖని, వెలుతురు, నవంబర్, 12**
డైరెక్టర్,సైంటిస్ట్-ఎఫ్ మినిస్ట్రీ ఆఫ్, ఎన్విరాన్,మెంట్, ఫారెస్ట్ & క్లైమెట్ ఛేంజ్,గౌవర్నమెంట్ ఆఫ్ఇండియా తరుణ్ కత్తుల, నూతనఎన్విరాన్ మెంట్ క్లియరెన్స్ కండిషన్స్,మైన్ క్లోజర్ అక్టివిటిస్ సంబందించి పరిశీలించటకోసం మంగళవారం, ఆర్.జి1ఏరియా కు విచ్చేయటంజరిగింది. వీరిని స్వీకరించిఆర్జీ. 1 జియం లలిత్ కుమార్,కార్పొరేట్ ఎన్విరాన్ మెంట్ జియం బి.సైదులు, పుష్పగుచ్చం అందించి శాలువాతో సన్మానం చేసి వారికి స్వాగతంపలికారు. ఈ సందర్బంగా ముందుగా పర్యావరణ పరిరక్షణ, సంరక్షణలో భాగంగాప్రతి 6 నెలలకుఒక్కసారి తనికి చేయటంలో భాగంగా మేడిపల్లి ప్రభావిత గ్రామం నందు నూతనముగా నిర్మాణంలోఉన్న కమ్యూనిటిహాలు పరిసర ప్రాంతంలో మొక్కలునాటడం జరిగినది, అనంతరం మేడిపల్లి, లింగాపూర్ గ్రామంలోరోడ్ల నిర్మాణంసోలార్ లైట్లను పరిశీలించడం జరిగినది. ఈ సందర్బంగా మేడిపల్లి ఉపరితలగనిని వ్యూపాయింట్ ద్వారా సందర్శించటం జరిగింది. మేడిపల్లి ఉపరితలగనిలో, రాక్టి వాల్, క్వారీఏరియా పెన్సింగ్ నిర్మాణం, డ్రైన్స్, ప్లాంటేషన్‌లను పరిశీలించటం జరిగింది. అనంతరం తిలక్ నగర్ నందు స్కిల్,డెవలప్ మెంట్ సెంటర్, ను సందర్శించడము జరిగినది. తదనతరం ఎన్విరాన్,మెంట్ క్లియరెన్స్,కండిషన్, మైన్ క్లోజర్, అక్టివిటిస్‌కు సంబందించి జీఎం కార్యలయంలోవివిధ అధికారులతో పవర్ పాయింట్, ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించటం జరిగింది. మేడిపల్లి ఓపెన్ కాస్ట్,క్లస్టర్ ఆఫ్ అండర్ గ్రౌండ్, మైన్స్‌కు సంబందించిన, ఫారెస్ట్ ల్యాండ్‌ల పరిశీలన, ప్లాంటేషన్, సెటిలింగ్ పాండ్, అటవీ విస్తరణకు అనువైన పరిస్థితులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పరిశీలించారు. గ్రామాలలోసింగరేణి నిర్మించినఇంకుడు గుంతలు,సోలార్ లైట్స్, రోడ్డుకు ఇరువైపులానాటిన మొక్కల గురించి వారికి వివరించటం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్జీ. జియంలలిత్,కుమార్, కార్పొరేట్ ఎన్విరాన్ మెంట్ జియంబి. సైదులు ఏజంట్, రమేష్, ఎన్విరాన్, మెంట్ అధికారులు, కార్పొరేట్, రవికిరణ్, సి.హెచ్.శ్రీనివాసు, ఏరియా ఎన్విరాన్‌మెంట్ అధికారి ఆంజనేయ ప్రసాద్, ఫారెస్ట్ అధికారి కర్ణ, మేనేజర్, మల్లిఖార్జున్ యాదవ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## సింగరేణి సులబ్, కార్మికులకు లాభాల వాటా చెల్లించాలని ఆర్జీవన్ కార్యాలయం ముందుఐఎఫ్టియు ధర్నా,




**గోదావరిఖని, వెలుతురు, నవంబర్,12**
సింగరేణికార్మికులైన సులబ్,కార్మికులకు లాభాలవాటా తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ, మంగళవారం, ఐఎఫ్టియు,అర్జీ వన్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐ ఎఫ్ టి యు,రాష్ట్ర కార్యదర్శి,ఏవెంకన్న, రాష్ట్రఉపాధ్యక్షులు బి అశోక్, మాట్లాడుతూ ఆర్ జీ వన్ డివిజన్ పరిధిలోసుమారు,24 సులబ్,కాంప్లెక్స్ లు ఉన్నాయనీ వాటిల్లో 24 మంది కాంట్రాక్ట్ కార్మికులు విధులు నిర్వహిస్తున్నారనీ అందరికార్మికులతో పాటుఈ కార్మికులకు లాభాల్లోవాటా ఇవ్వాలనిడిమాండ్ చేశారు. సింగరేణిలో పనిచేస్తున్నకాంట్రాక్టు కార్మికులకు సింగరేణిలో వచ్చినలాభాల్లో వాటాగా5000 రూపాయలు ఇవ్వడం జరిగిందనీ.కానీఆర్,జీ వన్,డివిజన్,పరిధిలోనీ సులబ్ కాంప్లెక్స్ లలోపనిచేస్తున్న సుమారు24మంది కాంటాక్ట్ కార్మికులకు ఇప్పటివరకు ఇతర డివిజన్లోసులబ్ కాంప్లెక్స్,లలో పనిచేస్తున్న కార్మికులకు ఇచ్చినవిధంగా లాభాలవాటా 5000 రూపాయలు ఇవ్వలేదని ఈ కార్మికులుకూడా సింగరేణిసులభ కాంప్లెక్స్ లలోనే పనిచేస్తున్నారని వీరిని సింగరేణి యామాన్యం గుర్తించి లాభాలవాట 5 వేల రూపాయలు తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈధర్నా,కార్యక్రమంలోఐ ఎఫ్ టీ యు, జిల్లా అధ్యక్షులుఈ నరేష్,సులబ్ కార్మికులుకోటవెంకన్న, ఈ భానయ్య, జీ నవీన్,డీ మల్లేశ్వరి, సంతోష్ కుమార్, సమ్మయ్య,ఏ దుర్గ, మిరియాలసరోజన, టీదామోదర్, మధునయ్య, పాల్గొన్నారు.

## జగన్ అక్రమాస్తుల కేసు వ్యవహారం

### మరో బెంచ్‌కు బదిలీ చేసిన సిజెఐ ధర్మాసనం



**న్యూఢిల్లీ,నవంబర్12 వెలుతురు:**
వైకాపా అధ్యక్షుడు జగన్ అక్రమాస్తుల కేసు వ్యవహారంలో సుప్రీంకోర్టులో కీలక పరిణామం చోటు చేసుకుంది. తెదేపా ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణను సీజేఐ ధర్మాసనం మరో బెంచ్‌కు మార్చింది. జగన్ బెయిల్ రద్దు చేయాలని, విచారణను హైదరాబాద్ నుంచి మార్చాలని తెదేపా ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు గతంలో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. దీనిపై సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా ధర్మాసనం విచారణ జరిపి పిటిషన్లపై విచారణ బెంచ్‌ను మార్చింది. సీజేఐ ధర్మాసనంలో జస్టిస్ సంజయ్‌కుమార్ సభ్యుడిగా ఉన్నారు. విచారణ ప్రారంభం కాగానే.. ఈ పిటిషన్లు ఆంధ్రప్రదేశ్‌కు చెందినవి అని జగన్ తరఫు న్యాయవాది రంజిత్‌కుమార్ తెలిపారు. మారిన పరిస్థితుల నేపథ్యంలో కౌంటర్ దాఖలు చేసేందుకు తమకు కూడా కొంత సమయం కావాలని సీబీఐ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోరారు. ఈ క్రమంలో జస్టిస్ సంజయ్ కుమార్ 'నాట్ బిఫోర్ మీ' అనడంతో రఘురామకృష్ణరాజు దాఖలు చేసిన పిటిషన్లను మరో ధర్మాసనానికి సీజేఐ బదిలీ చేశారు. జస్టిస్ అభయ్ ఎస్ ఓకా నేతృత్వంలోని ధర్మాసనం ముందు డిసెంబర్ 2న విచారణకు పంపాలని రిజిస్ట్రీని ఆదేశించారు.

## ఎపికి పెట్టుబడుల వెల్లువ

### రిలయన్స్ 65 వేల కోట్ల పెట్టబడులు

### 500 ఆధునిక బయోగ్యాస్ ప్లాంట్ల ఏర్పాటు

### సిఎం చంద్రబాబు సమక్షంలో ఒప్పందం

### రిలయన్స్‌తో రెండున్నర లక్షల మందికి ఉపాధి

### అన్ని రకాలుగా సహకారం అందిస్తామన్న సిఎం చంద్రబాబు



**అమరావతి,నవంబర్12 వెలుతురు:**
ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయి. వరుసగా భారీ కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నాయి. మొన్నటికి మొన్న టాటా గ్రూప్ ఐటి సెంటర్ ఏర్పాటుకు ముందుకు వచ్చింది. తాజాగా రిలయన్స్ మరో భారీ పెట్టుబడితో ముందుకు వచ్చింది. రూ.65 వేల కోట్ల పెట్టుబడి పెట్టేందుకు రిలయన్స్ ఎనర్జీ ముందుకు వచ్చింది. ఈ మేరకు సీఎం చంద్రబాబు సమక్షంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ, రిలయన్స్ ఇండస్ట్రీస్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందంలో భాగంగా రాష్ట్రంలో 500 ఆధునిక బయోగ్యాస్ ప్లాంట్‌లను రిలయన్స్ ఏర్పాటు చేయనుంది. రిలయన్స్ పెట్టుబడులతో రాష్ట్రంలో 2.5 లక్షల మందికి ఉపాధి కలిగే అవకాశం ఉంది. గత నెలలో రిలయన్స్ ఛైర్మన్ ముకేష్ అంబానీ, రిలయన్స్ క్లీన్ ఎనర్జీకి నేతృత్వం వహిస్తోన్న అనంత్ అంబానీని లోకేష్ ముంబయిలో కలిశారు. గ్రీన్ ఎనర్జీ, క్లీన్ ఎనర్జీ రంగాలకు ఏపీ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను మంత్రి వారికి వివరించారు. ఏపీలో పెట్టుబడులకు పూర్తిస్థాయి రోడ్ మ్యాప్‌తో మంగళవారం సీఎం చంద్రబాబు సమక్షంలో అవగాహన ఒప్పందం కుదిరింది. కంపెనీ ప్రతినిధులు సుదీర్ఘంగా చర్చించారు. ఏపీలో పరిశ్రమల ఏర్పాటుకు తమ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని చంద్రబాబు రిలయన్స్ ప్రతినిధులకు భరోసా కల్పించారు. అనంతరం ఏపీలో రూ.65 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు రిలయన్స్ ఎనర్జీ గ్రూప్ అంగీకారం తెలిపింది. ఈ మేరకు సీఎం చంద్రబాబు సమక్షంలో రిలయన్స్ ఎనర్జీ గ్రూప్, ఏపీ విద్యుత్ శాఖ మధ్య అగ్రిమెంట్ కుదిరింది. ఏపీలో రిలయన్స్ భారీ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావడంపై హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రాభివృద్ధిలో ఇవాళ చాలా ముఖ్యమైన రోజు అని పేర్కొన్నారు. ప్రాజెక్టు మూడేళ్లలో పూర్తి కావాలని.. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం నుంచి అన్ని రకాలుగా సహకారం అందిస్తామన్నారు. ఒక్కో బయోగ్యాస్ ప్లాంట్‌ను రూ.131 కోట్లతో నిర్మిస్తారని చెప్పారు. 500 బయోగ్యాస్ ప్లాంట్లకు గాను రూ.65వేల కోట్ల పెట్టుబడులు రానున్నాయని సీఎం చెప్పారు. ఈ భేటీలో సీఎం మంత్రి నారా లోకేష్ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు రావడం సంతోషంగా ఉందన్నారు. ఏపీకి రూ.65 వేల కోట్ల మేజర్ ప్రాజెక్ట్ రావడం ఆనందంగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ పెట్టుబడుల ద్వారా రాష్ట్రంలోని యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. వీటితో పాటు త్వరలోనే మరిన్ని పెట్టుబడులు వస్తాయని పేర్కొన్నారు.

# ఎవరూ చేయని చెత్త రికార్డు కూటమి చేసింది

### ప్రజలను నిట్టనిలువునా మోసం చేసింది

### ఎమ్మెల్సీ, వైసీపీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు వరుదు కల్యాణి




**అమరావతి, నవంబర్ 12 ( వెలుతురు):**
ఏరు దాటాక తెప్ప తగలేసినట్లుగా కూటమి బడ్జెట్ ఉందని ఎమ్మెల్సీ, వైసీపీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు వరుదు కల్యాణి ఎద్దేవా చేశారు. ఏడు నెలల పాటు ఓటాన్ అకౌంట్ బడ్జెట్ అమలు చేసి దేశ చరిత్రలోనే ఎవరూ చేయని చెత్త రికార్డును కూటమి ప్రభుత్వం నెలకొల్పిందని విమర్శించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద వరుదు కల మాట్లాడుతూ ఎన్నో పథకాలు ఇస్తామని ప్రగల్భాలు పలికిన కూటమి ప్రభుత్వం.. ఈ బడ్జెట్‌లో దేనికీ నిధులు కేటాయించలేదని విమర్శించారు. ప్రజలను ఈ ప్రభుత్వం నిట్టనిలువుగా మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు ఏటా రూ.20 వేలు ఇస్తామన్నారని.. కానీ కేవలం రూ.5వేల కోట్ల నిధులే కేటాయించారని అన్నారు. తల్లికి వందనం పథకం కోసం కేవలం రూ.5300 కోట్లు కేటాయించారని.. ఇవి ఏ మూలకు సరిపోతాయని ప్రశ్నించారు. సగం సగం నిధులు కేటాయించి ప్రజలను మభ్యపెడుతున్నారని మండిపడ్డారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని హామీ ఇచ్చారని.. కానీ బడ్జెట్‌లో మాత్రం నిధులు కేటాయించలేదని వరుదు కల్యాణి తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ఎప్పుడు ఇస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళలకు నెలకు 1500 ఇస్తామన్న మహాశక్తి పథకానికి కూడా నిధులు కేటాయించలేదని అన్నారు. 50 లక్షల మంది నిరుద్యోగులకు నెలకు 3 వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామన్నారని.. ఆ నిధులు ఎక్కడ అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజలను కూటమి ప్రభుత్వం నమ్మించి మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలను మభ్యపెట్టి మోసం చేశారని.. ప్రజలను నిట్టనిలువుగా ముంచారని అన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని వైసీపీ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు.

## శ్రీవారికి రూ. 4. 82 కోట్లు ఆదాయం



**తిరమల, నవంబర్ 12 ( వెలుతురు):**
తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కేవలం ఒక కంపార్టుమెంట్‌లో మాత్రమే స్వామిదర్శనానికి వేచియున్నారు. టోకెన్లు లేని భక్తులకు 6 గంటల్లో సర్వదర్శనం అవుతుందని టీటీడీ అధికారులు వివరించారు. నిన్న స్వామివారిని 73,917 మంది భక్తులు దర్శించుకోగా 25,161 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తుల సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీకి రూ. 4. 82 కోట్లు ఆదాయం వచ్చిందన్నారు. టీటీడీ బోర్డు ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఎస్.సత్య నారాయణ ప్రమాణం రాష్ట్ర దేవాదాయ శాఖ సెక్రటరీ, కమిషనర్ ఎస్.సత్యనారాయణ టీటీడీ ధర్మకర్తల మండలి ఎక్స్ అఫిషియో సభ్యుడిగా తిరుమల శ్రీవారి ఆలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయంలోని బంగారు వాకిలి వద్ద టీటీడీ అడిషనల్ ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి వీరితో ప్రమాణ స్వీకారం చేయించారు. శ్రీవారిని దర్శించుకున్న అనంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం చేశారు.

## వైఎస్ జగన్ కేసులో కీలక పరిణామం

**అమరావతి,నవంబర్ 12 ( వెలుతురు):**
వైసీపీ అధ్యక్షుడు , మాజీ సీఎం వైఎస్ జగన్ అక్రమాస్తుల కేసులో సుప్రీంకోర్టులో కీలక పరిణామం చోటు చేసుకుంది. అక్రమాస్తుల కేసులో జగన్ బెయిల్ రద్దు చేయాలని, కేసు విచారణను హైదరాబాద్ నుంచి మరో రాష్ట్రానికి మార్చాలని కోరుతూ మాజీ ఎంపీ, ప్రస్తుత ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు సుప్రీంకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్‌కుమార్ ధర్మాసనం విచారణ జరిపింది. విచారణ ప్రారంభం కాగానే పిటిషన్ ఏపీకి చెందిందని జగన్ తరుపు న్యాయవాది బెంచ్‌కు చెప్పారు. మారిన పరిస్థితుల్లో కౌంటర్ దాఖలుకు కొంత సమయం కావాలని సీబీఐ తరుపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోరారు. అయితే స్పందించిన జస్టిస్ సంజయ్‌కుమార్ 'నాట్ బీఫోర్ మీ' అనడంతో పిటిషన్లు మరో ధర్మాసనానికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా కేసును జస్టిస్ అభయ్ ఎస్ ఓకా నేతృత్వం వహించే ధర్మాసనం ముందుకు పంపాలని ఆదేశాలు జారీ చేస్తూ డిసెంబర్ 2న విచారణకు పంపాలని రిజిస్ట్రీకి ఆదేశించారు.



# దేశంలో 15 గ్రామీణ బ్యాంకుల విలీనం

**విజయవాడ, నవంబర్ 12 ( వెలుతురు):**
ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల విలీనానికి కేంద్రం మరో అడుగు ముందుకేసింది. నవంబర్ 20లోగా గ్రామీణ బ్యాంకుల స్పాన్సర్ బ్యాంకుల నుంచి విలీనంపై అభిప్రాయాలు సేకరించనుంది. దేశంలోని 43 గ్రామీణ బ్యాంకులను 23గా విలీనం చేయాలని కేంద్రం నిర్ణయించింది.బ్యాంకుల విలీనంపై కేంద్రం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఖర్చుల నియంత్రణ కోసం దేశంలోని పలు గ్రామీణ బ్యాంకుల విలీనానికి ఆమోదం తెలిపినట్లు సమాచారం. దశల వారీగా బ్యాంకుల విలీన ప్రక్రియ చేపట్టిన ఆర్థిక మంత్రిత్వ శాఖ...నాలుగో దశలో గ్రామీణ బ్యాంకుల విలీన ప్రక్రియ చేపట్టనుంది. ఈ దశలో 43 గ్రామీణ బ్యాంకుల సంఖ్య వీలనం చేసి 28కు తగ్గించనుంది. విలీన ప్రక్రియకు కేంద్ర ఆర్థిక శాఖ ప్రణాళికలు సిద్ధం చేసినట్లు సమాచారం.నాబార్డ్ తో సంప్రదించి గ్రామీణ బ్యాంకుల విలీనంపై బ్లూప్రింట్ తయారు చేయనుంది కేంద్రం. నవంబర్ 20లోగా గ్రామీణ బ్యాంకుల స్పాన్సర్ బ్యాంకుల నుంచి అభిప్రాయాలను కేంద్రం తెలుసుకోంది. మూడు దశల బ్యాంకుల విలీనంలో ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల సంఖ్య 196 నుంచి 43కి తగ్గింది. ఇప్పుడు వీటి సంఖ్య 28కి చేరనుంది. దేశంలోని పలు రాష్ట్రాల్లో సుమారు 15 ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు విలీనం కానున్నాయి. ఇందులో ఆంధ్రప్రదేశ్ కు చెందిన నాలుగు బ్యాంకులు ఉండగా, ఉత్తర్ ప్రదేశ్ లో 3, పశ్చిమ బెంగాల్ 3, బిహార్ , గుజరాత్, జమ్మూ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఒడిశా, మహారాష్ట్ర, కర్ణాటకలలో రెండేసి ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు ఉన్నాయి.గ్రామీణ బ్యాంకులు....గ్రామీణ ప్రాంతాల్లోని చిన్న, సన్నకారు రైతులు, వ్యవసాయ కార్మికులు, చేతివృత్తుల వారికి రుణాలు, ఇతర పథకాలు అందిస్తున్నాయి. ఆర్ఆర్బీలను 1976లో ఏర్పాటు చేశారు. ఏపీలో ప్రస్తుతం ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్, సప్తగిరి గ్రామీణ బ్యాంక్, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు వంటి ఆర్ఆర్బీలు ఉన్నాయి. కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకులో




మిగతా మూడు బ్యాంకులు విలీనం కానున్నాయి. తెలంగాణలో ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ సేవలు అందిస్తు?న్నాయి. వీటిని విలీనం చేసి తెలంగాణ గ్రామీణ బ్యాంక్ గా చేస్తారు. తెలంగాణలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ విభాగాన్ని ఇందులో విలీనం చేస్తారు.కేంద్రం ప్రభుత్వం... బ్యాంకుల అధిపతుల కు రాసిన లేఖలో... ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకుని వాటిని మరింత ఏకీకృతం చేయాల్సిన అవసరా న్ని తెలియజేసింది. ఈ విలీనం ఆర్ఆర్బీల కమ్యూనిటీ కనెక్షన్‌లను బలోపేతం చేయడానికి, వాటి సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి ఉద్దేశించనది అని పేర్కొంది.1976 ఆర్ఆర్బీ చట్టం ప్రకారం ఏర్పాటు చేసిన ఈ బ్యాంకులు గ్రామీణ ప్రాంతాల్లోని చిన్న రైతులు, వ్యవసాయ కార్మికులు, చేతివృత్తుల వారికి రుణాలు, ఇతర సేవలను అందిస్తున్నాయి. ఈ చట్టాన్ని 2015లో సవరించారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఆర్ఆర్బీలలో 50% వాటాను కలిగి ఉంది. స్పాన్సర్ బ్యాంకులు 35%, రాష్ట్ర ప్రభుత్వాలు 15% వాటా కలిగి ఉన్నాయి.


## మళ్లీ అధికారంలోకి వచ్చేది మనమే

### కేసులకు భయపడొద్దు

### వైసీపీ ఎమ్మెల్సీలకు వైఎస్ జగన్ దిశా నిర్దేశం

**అమరావతి, నవంబర్ 12 ( వెలుతురు):**
వచ్చే ఎన్నికల్లో మళ్లీ అధికారంలోకి వచ్చేది వైసీపీనే అని మాజీ సీఎం వైఎస్ జగన్ ధీమా వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలపై ప్రశ్నిస్తే ఎదురుదాడి చేస్తున్నారని మండిపడ్డారు. కేసులకు భయపడొద్దని.. అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఏపీ అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో పార్టీ ఎమ్మెల్సీలతో తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో వైఎస్ జగన్ భేటీ అయ్యారు. ఈ సమావేశంలో వైసీపీ ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేశారు. ప్రతిపక్ష హోదా కోరుతూ కోర్టులో పిటిషన్ వేశామని జగన్ తెలిపారు. కానీ దీనిపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు సమాధానం ఇవ్వడం లేదని పేర్కొన్నారు. అసెంబ్లీలో ఉన్న ఏకైక ప్రతిపక్షం మనమే.. అయినా ప్రతిపక్ష హోదా ఇవ్వడం లేదని అన్నారు. మనకు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాల్సి వస్తుందని.. అధికార పక్షం అంగీకరించడం లేదని తెలిపారు. అసెంబ్లీలో అవకాశం ఇవ్వకుంటే.. మీడియా ద్వారా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని స్పష్టం చేశారు. వైఎస్ జగన్ అసెంబ్లీకి రాకపోతే అసెంబ్లీ సమావేశాలేమీ ఆగవని, చట్టం తన పని తాను చేసుకుపోతుందని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. ఈ నెల 22 వరకు అసెంబ్లీ సమావేశాలు సీరియస్‌గా జరుగుతాయని ఆయన స్పష్టంచేశారు. ఎమ్మెల్యేలు విధిగా అసెంబ్లీకి హాజరవ్వాలని సూచించారు. బడ్జెట్‌పై రేపు అసెంబ్లీ కమిటీ హాలులో ఎమ్మెల్యేలు అందరికీ శిక్షణ తరగతులు ఉంటాయని తెలిపారు. అలాగే విప్, చీఫ్ విప్‌లను కూడా రేపే ఖరారు చేస్తామని అన్నారు.

# గులాబీ దళం చేపట్టే పాదయాత్రకు మైలేజీ ఉంటుందా..?



**హైదరాబాద్ నవంబర్ 12 ( వెలుతురు):**
పాత సీసాలో కొత్త సారా.. వర్కవుట్ అవుతుందా కేటీఆర్, హరీష్!
ఎన్నికల్లో అధికారంలోకి రావడానికి పాదయాత్ర లు చేయడం ఒక ట్రెండ్. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్సార్ చేసిన పాదయాత్ర రికార్డు సృష్టించింది. దాంతో ఆయన ఆ వెంటనే అధికారంలోకి వచ్చారు. ఆ పాదయాత్ర చెప్పాలంటే చరిత్రలో నిలిచిపోయింది. ఇక ఆ తరువాత ఆయనను ఆదర్శంగా తీసుకొని చాలా మంది పాదయాత్రలు చేశారు. ఎన్నికల్లో అధికారంలోకి రావడానికి పాదయాత్రలు చేయడం ఒక ట్రెండ్. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్సార్ చేసిన పాదయాత్ర రికార్డు సృష్టించింది. దాంతో ఆయన ఆ వెంటనే అధికారంలోకి వచ్చారు. ఆ పాదయాత్ర చెప్పాలంటే చరిత్రలో నిలిచిపోయింది. ఇక ఆ తరువాత ఆయనను ఆదర్శంగా తీసుకొని చాలా మంది పాదయాత్రలు చేశారు. కొందరికి చేదు ఫలితాలు వస్తే.. మరికొందరికి అనుకూల ఫలితాలు వచ్చాయి. అందులోనూ ఏపీలో వైఎస్ తనయుడు జగన్ మోహన్ రెడ్డి చేసిన పాదయాత్ర కూడా ఆయనకు కలిసివచ్చిందని చెప్పాలి. ఇక.. ఆ తరువాత చంద్రబాబు కూడా పాదయాత్ర చేశారు. ఇక.. తెలం గాణలో అధికారమే లక్ష్యంగా వైఎస్ షర్మిల పార్టీని స్థాపించి తెలంగా ణ వ్యాప్తంగా పాదయాత్ర నిర్వహించారు. కానీ, ఆమె పాదయాత్రను తెలంగాణ ప్రజలు పెద్దగా ఆదరించలేదు. దాంతో తెలంగాణలో ఆమె పార్టీని మూసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. అయితే.. పాత సీసాలో కొత్త సారా లెక్క. ఇప్పుడు బీఆర్ఎస్ కూడా పాత ట్రెండును ఫాలో అయ్యేందుకు రెడీ అయిపోయింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు నుంచి బీఆర్ఎస్ పార్టీనే అధికారంలో కొనసాగింది. పది నెలల తరువాత రాష్ట్రంలో అధికారం కోల్పోయింది. దీంతో పార్టీని, క్యాదర్ను కాపాడుకునేందుకు బీఆర్ఎస్ నేతలు నానా యాతన పడుతున్నారు. పార్టీ ఓడిపోయి.. రాష్ట్రంలో అధికారం కోల్పోయినప్పటి నుంచి పార్టీ అధినేత కేసీఆర్ ఇంతవరకు ప్రజల్లోకి వచ్చింది లేదు. గత పది నెలలుగా ఆయన ఫాంహౌస్కి పరిమితం అయ్యారు. అక్కడి నుంచే నేతలకు డైరెక్షన్లు ఇస్తున్నారని ప్రచారం ఉంది. అయితే.. కేసీఆర్ బయటకు రాకపోవడానికి అనారోగ్య కారణాలు ఉన్నాయని ఇటీవల కేటీఆర్ చెప్పుకొచ్చారు. సరే ఏది ఏమైనప్పటికీ పది నెలలుగా ఆయన మాత్రం ఒక్క ప్రెస్ మీట్ పెట్టింది లేదు.. ఒక ప్రకటన సైతం ఇచ్చింది లేదు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ పెద్ద సంఖ్యలో క్యాదర్ను కోల్పోయింది. బీఆర్ఎస్ తరఫున గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలు కూడా ఇప్పటికే కాంగ్రెస్ గూటికి చేరారు. మరికొంత మంది వెళ్లిపోయేందుకు రెడీ అయిపోయారు. ఇలా పార్టీ పరిస్థితి రోజురోజుకూ దివాలా తీస్తోంది. ఈ క్రమంలో పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారం కోల్పోయినప్పటి నుంచి సీనియర్ నేతలు, మాజీమంత్రులు కేటీఆర్, హరీశ్ రావులే పార్టీని నడిపిస్తూ వస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలపై కొట్లాడుతున్నారు. ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలపై నిలదీస్తున్నారు. నిరసనల్లోనూ పాల్గొంటున్నారు. అటు సోషల్ మీడియాలో ప్రభుత్వంపై విమర్శలు చేస్తూనే ఉన్నారు. ఇప్పుడు.. తాజాగా బీఆర్ఎస్ తీసుకున్న రాష్ట్రవ్యాప్తంగా పార్టీ క్యాదర్లో చర్చకు దారితీసింది. ఇంతకీ ఆ నిర్ణయం ఏంటి..? పార్టీ ఏం చేయబోతోంది అంటే., మరికొద్ది రోజుల్లోనే బీఆర్ఎస్ కీలక నేతలైన కేటీఆర్, హరీశ్ రావు రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర నిర్వహించబోతున్నారు. అది కూడా.. ఉత్తర తెలంగాణలో కేటీఆర్, దక్షిత తెలంగాణ మొత్తంగా హరీశ్ పాదయాత్ర చేయనున్నట్లుగా తెలుస్తోంది. కేసీఆర్ డైరెక్షన్లోనే వీరు పాదయాత్రకు సిద్ధమవుతున్నారట. ఇందుకు సంబంధించి ఇప్పటికే రూట్ మ్యాప్ కూడా సిద్ధమైనట్లుగా ప్రచారం జరుగుతోంది. ఎవరు ఎక్కడి నుంచి ప్రారంభించాలి..? ఎక్కడ ముగించాలి..? అనే అంశంపై కేసీఆర్ ప్రత్యేకించి శ్రద్ధ పెట్టి రూట్ మ్యాప్ రెడీ చేసినట్లుగా పార్టీలో ప్రచారం నడుస్తోంది. మరికొద్ది రోజుల్లోనే రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నాయి. ఆ తరువాత మున్సిపల్ ఎన్నికలు వస్తాయి. అయితే.. అసెంబ్లీ ఎన్నికలు రావాలంటే మరో నాలుగేళ్లు ఆగాల్సిందే. మరి ఈ క్రమంలో ఇప్పుడే ఈ ఇద్దరు నేతలు పాదయాత్రలు చేపడితే పార్టీకి మైలేజీ వస్తుందా..? అధినేత అనుకున్న లక్ష్యం సాధ్యపడుతుందా..? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల వరకు ఈ పాదయాత్ర మైలేజీ ఉంటుందా అనేది అర్థం కాని పరిస్థితి. మొత్తానికి బీఆర్ఎస్ కూడా పాత పంథానే ఎంచుకోవడంపై పలువురు పార్టీ నేతలు కూడా పెదవి విరుస్తున్నారట.

# నిర్లక్ష్యం నీడలో అధికారుల పనితీరు

### - జిల్లా పాలానాధికారి ఆకస్మిక తనిఖీలు...

### ప్రత్యేక సమీక్షలు సమావేశాలతో 24/7 కష్టపడుతున్నా

### - అన్ని శాఖల్లో ఇంకా వీడని బద్ధకం...నిర్లక్ష్యం

### - మంత్రి ఇలాకాలో కూడా అధికారుల తీరు మారదాయే




**పెద్దపల్లి నవంబర్ 12 ( వెలుతురు):**
పెద్దపల్లి జిల్లా కలెక్టర్ గా కోయ శ్రీహర్ష బాధ్యతలు చేపట్టిన నాటి నుండి 24/7 విధులు నిర్వర్తిస్తూనే వున్నారు. అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేస్తూ, సమీక్షలు, సమావేశాలు, ఆకస్మిక తనిఖీలతో జిల్లాను జల్లెడ పడుతున్నారు. మండలం స్థాయి అధికారులకు హెచ్చరికలు జారీ చేస్తూనే... విధుల్లో బాధ్యతలు లేని వారికి మెమోలు, సరెండర్లు, సస్పెండ్ లు చేస్తూనే ఉన్నారు. అర్ధరాత్రి సైతం లెక్క చేయకుండా ఆకస్మికంగా తనిఖీలు చేస్తూ తన ఉద్యోగానికి న్యాయం చేస్తూనే ఉన్నారు. ఇంత జరుగుతున్నా అధికారుల్లో మాత్రం వారి విధులు నిర్వహించడంలో చిత్తశుద్ధి కానరావడం లేదు కదా తోటి అధికారిని చూసి మారుదామనే ఆలోచన లేదు. సమయానికి జీతం డబ్బులు వస్తే సరిపోతుంది అనుకునే అధికారులు వున్నంతవరకు ఈ వ్యవస్థలో మార్పు రాదనే చెప్పాలేమో. ఈ నిర్లక్ష్యం ఖరీదు విద్యార్థుల ప్రాణం మీద కు వచ్చిన సంఘటన పెద్దపల్లి జిల్లాలోని ముత్తారం మండలం లోని కేజీబీవి హాస్టల్ లో జరిగింది. పర్యావరణ సంబంధిత సమస్యలా లేక ఆహారం కల్తీ తెలియని సందిగ్ధం. మొత్తానికి విద్యార్థులు కోలుకోవడం ఆనందమే అయినా జరిగిన పరిణామానికి ఎవరు బాధ్యత వహిస్తారు. మళ్ళీ తల్లితండ్రులు పాఠశాలకు పంపాలంటే ఎన్నో భయాలు. హాస్టల్ పక్కనే ఉన్న డంపు యార్డు మూలంగా సమస్య వచ్చిందా మరే ఇతర కారణం ఏదైనా కూడా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా గట్టి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. ఇక జిల్లా కేంద్రం మొదలు కొని మండలం, గ్రామ స్థాయి అధికారుల్లో విధుల నిర్వహణలో అశ్రద్ధ, బాధ్యత లేని తనం కనిపిస్తూనే ఉంటున్నాయి. వైద్య, విద్య, రెవెన్యూతోపాటు ప్రతి శాఖలో అవినీతి ప్రధాన సమస్యగా మారింది. దీనికి తోడు సమయ పాలన లోపం. అధికారులు కార్యాలయాలకు ఎప్పుడు వస్తున్నారో... ఎప్పుడు వెళుతున్నారో తెలియని వైనం. అందులో పని చేసే అధికారికి క్రింద స్థాయి అధికారుల విషయమే పట్టింపు లేదు. తూతు మంత్రంగా డ్యూటీలు... మళ్ళీ బయట దందాలు... ఈ వ్యవహారం ముఖ్యంగా వైద్య, విద్యా శాఖలో ఎక్కువగా కనిపిస్తున్నది. ప్రభుత్వ వైద్యులు ప్రైవేట్ ఆసుపత్రి నడప రాదనే నిబంధనలను వారు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. బయట ప్రైవేట్ ఆసుపత్రి పెట్టి మరో డాక్టర్ తో మ్యానేజ్ చేస్తున్నారు. ఇక్కడి రోగులు అక్కడికి తరలించుకు పోవడంలో తెలివిని ఉపయోగిస్తూ తప్పించుకుంటున్నారు. ఇక విద్యా వ్యవస్థలో అధికారులు, ఉపాధ్యాయులు చాలా మంది రియల్, చైన్ మార్కెటింగ్ దందాలు విధుల సమయంలోనే చక్క బెడుతున్నారు. జిల్లాలోని పలు శాఖల్లో అధికారుల విదుల కోసం ప్రభుత్వం వారికి అద్దె ప్రతిపాదికన వాహనాలు కేటాయించారు. కానీ వారు వారి స్వంత వాహనాలు పెట్టుకోని దొంగ బిల్లు పెట్టి మోసాలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కారు అసోసియేషన్ తరుపున ఓ జిల్లా అధికారిని సంప్రదిస్తే స్పందించక పోగా, వారిపై దురుసుగా మాట్లాడినట్లు సమాచారం. ఇంకా రెవెన్యూ, రవాణా శాఖ, సబ్ రిజిస్టర్, అబ్కారీ శాఖల్లో అయితే పట్ట పగ్గాల్లేని అవినీతి జరుగుతుందనడంలో అతిశయోక్తి లేదేమో. కిరాణా షాపుల్లోనే బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నా, నిత్యం అటు గుండా వెల్లే అధికారులు చూసి చూడనట్లు ఉండే వైనం. రౌతు సక్రమంగా ఉన్నా, పని చేయని దొంగ గుర్రాలతో పని చేయించడం కష్టమేననే భావన పలువురిలో వ్యక్తమవుతున్నది. జిల్లా కేంద్రంలోనే ఇలాంటి అధికారులు ఉంటే ఇక మండలం, గ్రామ స్థాయిల్లో చెప్పనలవి కానీ బాధలు. ఇటీవల మత్స్య శాఖలో కూడా చేప పిల్లల పంపిణి వ్యవహారంలో పలు అవినీతి ఆరోపణలు బలంగా వినిపించాయి. నిజాయితీగా పని చేసే అధికారులు లేకుండా పోతున్నారనే ఆందోళన ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. కాగా ఇటీవల విధుల నిర్వహణలో అశ్రద్ధ చూపుతున్న పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక పోలీస్ శాఖలో అయితే ఆపరేషన్ గరుడ పేరుతో ఎన్ని విజయాలు సాధించారో



వారికే తెలియాలి. గతంలో మాదిరిగా కాకుండా ఇప్పుడు ఎక్కువ శాతం పోలీస్ వ్యవస్థ సీసీ కెమెరాల జపంతోనే కాలం గడిచి పోతున్నది. జిల్లా కేంద్రంతో పాటు చుట్టు పక్కల మండల కేంద్రాలు పదుల సంఖ్యలో పోలీస్ ఠాణాలు ఉన్నా దొంగలను పట్టుకునే స్థాయిలో లేకపోవడం శోచనీయని పలువురు బహిరంగానే పేర్కొంటున్నారు. గడిచిన ఎనిమిది నెలల కాలంలో జిల్లా కేంద్రంలో పలు దొంగతనాలు జరిగినా వాటి చేదనలో ఇంకా మీనమెషాలే నడుస్తున్నాయి. సివిల్ కేసుల్లో ఉత్సాహం చూపే పోలీసులు, ప్రజా సమస్యల పరిష్కారంలో తేలిపోతున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఎంత చెప్పినా తక్కువే అవుతున్నది.రాష్ట్ర మంత్రి కేంద్రంగా ఉన్న జిల్లాలో కూడా నిర్లక్ష్యమేనా ...: రాష్ట్ర మంత్రిగా దుద్దిల్ల శ్రీధర్ బాబు జిల్లా కేంద్రంలోని మంథని నియోజకవర్గానికి చెందిన వ్యక్తి అయినా అధికారులకు భయం, భక్తి లేకుండా పోతున్నది. విధులు నిర్వహణలో అదే నిర్లక్ష్యం. సమయ పాలన లేదు. స్థానికంగా ఉండరు. ఇలాంటి వారికి కొంతమంది ఉన్నతాధికారులు వంత పాడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఏది ఏమైనా అధికారులు మారితే గాని వ్యవస్థలో మార్పు రాదనే భావన ప్రజలల్లో బలంగా నాటుకు పోయింది.

## ప్రభాస్, పూరీ కాంబో రిపీట్..?



తెలుగు సినిమా ఇండస్ట్రీలో వన్ ఆఫ్ ది టాప్ డైరెక్టర్లలో ఒకడు పూరీ జగన్నాథ్. తన కెరీర్‌లో ఎంతో మంది యాక్టర్లకు బ్రేక్ అందించాడని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. తాజాగా డాషింగ్ డైరెక్టర్‌కు సంబంధించిన వార్త ఒకటి నెట్టింట రౌండప్ చేస్తుంది. పూరీ గ్లోబల్ స్టార్ ప్రభాస్‌తో మరోసారి పనిచేయబోతున్నాడన్న క్రేజీ అప్‌డేట్ ఇండస్ట్రీ సర్కిల్‌లో హల్ చల్ చేస్తుంది. అయితే ఈ ఇద్దరు ఏం సినిమా చేస్తున్నారనే కదా మీ డౌటు. స్పిరిట్ ప్రాజెక్ట్. అదేంటి అనుకుంటున్నారా..? మీరు చదివింది నిజమే. ఈ సినిమాకు పూరీ డైలాగ్స్ రాస్తున్నాడట. కాప్ డ్రామా నేపథ్యంలో వచ్చిన పోకిరి, టెంపర్ డైలాగ్స్ బాక్సాఫీస్‌ను ఏ స్థాయిలో షేక్ చేశాయో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. మళ్లీ ఇదే జోనర్‌లో రాబోతున్న స్పిరిట్ సినిమా కోసం డైలాగ్స్ రాసే విషయమై డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా ఇటీవలే పూరీని సంప్రదించగా.. గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడని ఫిలింనగర్ సర్కిల్ ఇన్ సైడ్ టాక్. ఇదే నిజమైతే కాప్ డ్రామా నేపథ్యంలో రాబోతున్న స్పిరిట్‌ను పూరీ డైలాగ్స్ మరో రేంజ్‌కు తీసుకెళ్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇప్పటికే ప్రభాస్-పూరీ కాంబోలో వచ్చిన ఏక్ నిరంజన్, బుజ్జిగాడు సినిమాల్లోని డైలాగ్స్ ఎంత పాపులర్ అయ్యాయో తెలిసిందే. ఈ ఇద్దరి కాంబోలో వచ్చే డైలాగ్స్ ఎలా ఉండబోతున్నాయన్నది ప్రస్తుతానికి సస్పెన్స్ నెలకొంది.

## అద్దంలో చూసుకున్నప్పుడు నిజం తెలుస్తుంది : కమల్

తమిళ కథానాయకుడు కమల్ హాసన్ తాజాగా ఓ సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఇక నుంచి తన పేరుకు ముందు అభిమానంతో అందరూ పిలుచుకుంటున్న ఉలగనాయన్‌తో కానీ ఇక ఎలాంటి స్టార్ ట్యాగ్స్‌తో పిలవొద్దని, కమల్ లేదా కమల్ హాసన్ అనే పేరుతో పిలవమని అందరికి విజ్ఞప్తి చేశారు. ఇందుకు సంబంధించి ఆయన ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. " నా నటనను మెచ్చి ఉలగనాయగన్' వంటి ఆత్మీయ ట్యాగ్‌లు అందించినందుకు ఎల్లప్పుడూ నేను కృతజ్ఞతుడిని. భవిష్యత్తులో మరిన్ని మంచి చిత్రాలను ప్రేక్షకులను అందించాలనే ఉద్దేశంతో నేను ఈ నిర్ణయం తీసుకున్నాను' అని ఆ ప్రకటనలో తెలియజేశారు కమల్‌హాసన్. అయితే నటుడిగా అత్యధిక పురస్కారలు అందుకున్న వారిలో ఈయనే అగ్ర గణ్యుడు. నటుడిగా కమల్ అందుకున్నానని పురస్కారాలు ఎవరూ అందుకోలేదు. అయితే తనని తాను ఎప్పుడూ నటుడిగా నిత్యవిద్యార్థినే అనుకునే ఈ నటుడు ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన నటన గురించి మరికొన్ని కామెంట్స్ చేశాడు. " అద్దంలో నా ముఖం చూసుకున్నప్పుడల్లా నటనలో పరిపూర్ణత వుండదనేది తెలిసిపోతుంది. నేను నటించిన కొన్ని సినిమాలు తరువాత చూసినప్పుడు మరింత బాగా నటిస్తే బాగుండేది అనిపిస్తుంది. నా మైనస్‌లు నాకు తెలిసిపోతాయి. అయితే అప్పటికి ఆ సినిమాకు అవార్డులు వచ్చి ఉంటాయి. అందరూ ప్రశంసించి ఉంటారు. అయినా ఆ పాత్ర కోసం నేను ఇంకా ఏం చేయగలనో నాకు తెలుసు. ఆ సినిమానే రీమేక్ చేసి ఆ లోపాలను సరిదిద్దుకోవాలనిపిస్తుంది. కానీ అది అంత సులువు కాదు. అందుకే నటనలో కంప్లీట్‌నెస్ అనేది వుండదు. కాకపోతే ఆ దిశగా సాధించే వరకు జర్నీ చేయాల్సిందే" అంటూ చెప్పుకొచ్చారు.



## అందుకే అమ్మ బయటకు రావటానికి ఇష్టపడదు

### - జూ.ఎన్టీఆర్

'స్టూడెంట్ నెం.1' చిత్రంతో హీరోగా అరంగ్రేటం చేసిన స్వర్గీయ నందమూరి తారక రామారావు మనవడు జూనియర్ ఎన్టీఆర్ ఆది, సింహాద్రి సినిమాతో తిరుగులేని మాస్ హీరోగా ఎదిగాడు ఇక ఆ తరువాత జూనియర్ ఎన్టీఆర్ నట ప్రస్థానం గురించి అంతా తెలిసిందే. ఆర్ఆర్ఆర్ సినిమాతో పాన్ ఇండియా హీరోగా గుర్తింపు తెచ్చుకున్న ఈ నందమూరి హీరో ఇటీవల 'దేవర' చిత్రంతో మరో ఘన విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నాడు. ఈ చిత్రంలో ఎన్టీఆర్ దేవర, వరగా ద్విపాత్రాభినయంలో తన నటనతో మెప్పించాడు. నటుడిగా, డ్యాన్సర్‌గా ఎన్టీఆర్‌కు మంచి పేరుంది. ఈ తరం హీరోల్లో ఎన్టీఆర్ వన్ ఆఫ్ బెస్ట్ ఫర్‌ఫార్మర్ అనడంలో ఎటువంటి సందేహం లేదు. అయితే ఈ రోజు తాను నటనలో, డ్యాన్సుల్లో ఓ ప్రత్యేకత సంపాందించుకోవడానికి కారణం తన అమ్మే అంటున్నాడు ఎన్టీఆర్. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ " నీ కంటూ ఏదైనా స్పెషాలిటీ ఉన్నప్పుడే, నీదంటూ ఓ మార్క్ క్రియేట్ చేసుకుంటేనే నలుగురిలో గుర్తింపు వస్తుందని చెబుతుండేది. ఆమె మాటల ఇన్‌స్పిరేషన్‌తోనే కూచిపూడి నేర్చుకున్నాను. అమ్మ నుంచే అందరితో మాట్లాడటం తెలుసుకున్నా. చాలా మంది అమ్మలు తమ పిల్లల్ని ఒంటరిగా బయటికి పంపించడానికి రకరకాల కారణాలతో ఒప్పుకోరు. మా అమ్మ మాత్రం ఎక్కడికైనా ఒంటరిగా వెళ్లమనేది. ఏ విషయమైనా సొంతంగా తెలుసుకోమనేది. నాకు ఊహ తెలిసినప్పటి నుంచి ఆమెప్పుడూ నా దగ్గర తన కష్టాల్ని దాచిపెట్టలేదు. కష్టాల నడుమనే ఎదగడం గొప్పదనం అని చెబుతుండేది. కష్టపడ్డ వారే ప్రతిఫలం అనుభవించాలి అంటుండేది. అందుకే నాకు హీరోగా ఎంతటి పేరొచ్చినా అమ్మ అసలు బయటికి రాదు. కష్టం నీదే కాబట్టి ప్రతిఫలం కూడా నీదే అనేది' అని అమ్మ గురించి విశేషాలను చెప్పుకొచ్చారు ఎన్టీఆర్.



## కలర్‌ఫొటో డైరెక్టర్ ఎంగేజ్‌మెంట్



కలర్‌ఫొటో సినిమాతో డైరెక్టర్‌గా మంచి ఫేం సంపాదించాడు సందీప్ రాజ్. డైరెక్టర్‌గా, రైటర్‌గా కెరీర్ కొనసాగిస్తున్న సందీప్ రాజ్ త్వరలోనే పెండ్లి పీటలెక్కబోతున్నాడని వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా దీనికి సంబంధించిన వార్త బయటకు వచ్చింది. సోమవారం సందీప్ రాజ్- నటి, క్లాసికల్ డ్యాన్సర్ చాందిని రావు నిశ్చితార్థం పూర్తయింది. వైజాగ్‌లో కుటుంబసభ్యులు, స్నేహితుల సమక్షంలో సందీప్ రాజ్-చాందిని రావు నిశ్చితార్థం జరిగింది. ఈ సందర్భంగా యంగ్ కపుల్‌కు ఇండస్ట్రీ ప్రముఖులు, మూవీ లవర్స్ శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. ఈ ఇద్దరు డిసెంబర్ 7న తిరుపతిలో జరిగే వెడ్డింగ్ ఈవెంట్‌తో ఒక్కటి కాబోతున్నారు. షార్ట్ ఫిలిమ్స్‌తో కెరీర్ మొదలుపెట్టిన సందీప్ రాజ్ డెబ్యూ సినిమా కలర్‌ఫొటో ఓటీటీలో విడుదలై బ్లాక్ బస్టర్ హిట్ కొట్టింది. చాందినీ రావు కలర్‌ఫొటో, రణస్థలి, హెడ్ అండ్ టేల్స్‌తోపాటు పలు వెబ్ సిరీస్‌లలో నటించింది. చాందిని రావు ప్రొడక్షన్ హౌస్‌ను కూడా మెయింటైన్ చేస్తుంది. సందీప్ రాజ్ ప్రస్తుతం రోషన్ కనకాలతో సినిమా ప్రకటించగా.. ప్రీ ప్రొడక్షన్ పనులు కొనసాగుతున్నాయి. త్వరలోనే షూటింగ్ షురూ కానున్న ఈ చిత్రం 2025లో విడుదల కానుంది.

## మరో పదేళ్లు పనిచేయగలను : అమీర్‌ఖాన్



ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలో సూపర్ స్టార్ డమ్ ఉన్న యాక్టర్లలో టాప్‌లో ఉంటాడు అమీర్‌ఖాన్. లగాన్, గజినీ, పీకే, దంగల్‌తోపాటు ఎన్నో బ్లాక్‌బస్టర్ హిట్స్ అందించిన ఈ స్టార్ యాక్టర్ చాలా కాలంగా మంచి బ్రేక్ కోసం ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. తాజాగా హాలీవుడ్ రిపోర్టర్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆసక్తిక కామెంట్స్ చేసి అభిమానులను ఫుల్ ఖుషీ చేస్తున్నాడు అమీర్‌ఖాన్. నేను రాబోయే 10 సంవత్సరాలు చురుకుగా పని చేయగలనని అనుకుంటున్నా. నా కెరీర్‌ను మరింత ఉత్తమంగా ముందుకు తీసుకెళ్లాలని కోరుకుంటున్నాను, అందుకే అమీర్ ఖాన్ ప్రొడక్షన్‌కు అపర్ణ పురోహిత్‌ని చీఫ్‌గా తీసుకువచ్చా. యువ నటీనటులు, దర్శకులు, సాంకేతిక నిపుణులకు నా ప్రొడక్షన్ హౌస్‌లో పనిచేసే అవకాశం ఇవ్వాలని కోరుకుంటున్నానని చెప్పుకొచ్చాడు అమీర్ ఖాన్. ఇప్పుడీ కామెంట్స్ అమీర్ ఖాన్ నుంచి వచ్చే పదేళ్లపాటు సినిమాల అప్‌డేట్స్ ఉండబోతున్నాయని క్లారిటీ ఇచ్చేస్తున్నాయి. పఠాన్ ఎండింగ్‌లో వచ్చే ట్రైన్ ట్రాక్ సీన్ గురించి మాట్లాడుతూ.. ఈ సీన్‌ను చూశా. ఈ సన్నివేశంలో కొత్త యాక్టర్లైతే మీరు బాధపడొచ్చు. కానీ షారుక్ ఖాన్, సల్మాన్ ఖాన్ వల్ల మీరు అప్‌సెట్ అయ్యే ఛాన్స్ లేకుండా పోయిందన్నాడు అమీర్ ఖాన్.

## ప్రేక్షకుల ముందుకు భైరవంతో మంచు మనోజ్




బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మనోజ్ మంచు, నారా రోహిత్ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ క్రేజీ మూవీ 'భైరవం'. విజయ్ కనకమేడల దర్శకత్వం వహిస్తున్న ఈ భారీ బడ్జెట్ చిత్రాన్ని పెన్ స్టూడియోస్ డాక్టర్ జయంతిలాల్ గడ సమర్పణలో శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కెకె రాధామోహన్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ మూవీ నుండి విడుదల చేసిన బెల్లంకొండ సాయి శ్రీనివాస్, నారా రోహిత్ ఫస్ట్ లుక్ లకు మంచి స్పందనను రావడమే కాకుండా హ్యూజ్ బజ్ క్రియేట్ చేశాయి. తాజాగా మేకర్స్ మంచు మనోజ్ మాస్ అవతార్‌ని ప్రజెంట్ చేస్తూ ఇంటెన్స్ ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. 2024-11-12, 11.35.21. ఈ ఫస్ట్ లుక్‌ని గమనిస్తే.. వర్షంలో బ్లాక్ అండ్ బ్లాక్ దుస్తులలో గంభీరమైన పేస్ తో మనోజ్ యాక్షన్-ప్యాక్డ్‌గా కనిపించారు. ఈ సినిమాలో అతని పాత్ర ఎంత ఇంటెన్స్‌గా ఉండబోతుందో ఈ ఫస్ట్ లుక్‌తో అర్థమవుతోంది. ఈ యాక్షన్ పార్ట్ సినిమాలో మెయిన్ హైలైట్‌గా నిలుస్తుందని మేకర్స్ చెబుతున్నారు. నియో-నోయిర్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న మూవీలో ప్రముఖ తారాగణం, సాంకేతిక సిబ్బంది ఉన్నారు. ఇప్పటికే విడుదలైన బెల్లంకొండ సాయి శ్రీనివాస్ లుక్, నారా రోహిత్ లుక్ లతో పాటు తాజాగా విడుదలైన మంచు మనోజ్ లుక్ సినిమాపై భారీగా అంచనాలను పెంచేవిగా ఉన్నాయి.




## గ్రాండ్‌గా కంగువా రిలీజ్... కానీ సొంత స్టేజ్‌లో మాత్రం నిరాశే..?

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య కాంపౌండ్ నుంచి వస్తోన్న పాన్ ఇండియా చిత్రం కంగువ. శివ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం పీరియాడిక్ యాక్షన్ డ్రామా నేపథ్యంలో సూర్య 42వ సినిమాగా వస్తోంది. ఈ చిత్రంలో బాలీవుడ్ భామ దిశాపటానీ ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తోంది. బాబీ డియోల్ విలన్‌గా నటిస్తున్న కంగువ నవంబర్ 14న తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళంతోపాటు వివిధ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. సూర్య టీం ఇప్పటికే ప్రమోషనల్ టూర్‌లో బిజీగా ఉంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కేరళ, కర్ణాటకలో ఫస్ట్ డే వేకువ జామునే 4 గంటల షోలు పడనున్నాయి. ఈ విషయంలో సూర్య అభిమానులు ఆనందంలో ఎగిరిగంతేస్తున్నప్పటికీ.. మరోవైపు హోం స్టేట్ తమిళనాడులో ఉన్న ఫ్యాన్స్ మాత్రం నిరాశలో మునిగిపోతు న్నారు. దీనిక్కారణం తమిళనాడులో ప్రభుత్వం వేకువ జామున కంగువ స్పెషల్ షోలకు అనుమతివ్వడకపోవడమే. అయితే తమిళనాడులో స్క్రీనింగ్స్ ఉదయం 9 గంటల నుంచి మొదలు కానుంది. ఈ నేపథ్యంలో అదనపు షో వేసుకునేందుకు అవకాశమిచ్చిన తమిళనాడు ప్రభుత్వానికి ధన్యవా దాలు తెలియజేశారు. ఇది మేకర్స్‌కు గుడ్ న్యూస్ అయినప్పటికీ అభిమానులు మాత్రం ఉదయం పూట షోలు లేకపోవడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారని కోలీవుడ్ సర్కిల్ సమాచారం. స్టూడియో గ్రీన్-యూవీ క్రియేషన్స్ బ్యానర్లపై సంయుక్తంగా తెరకెక్కిస్తున్న కంగువ ఫ్రెంచ్, స్పానిష్, ఇంగ్లీష్ సహా ఎనిమిది భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ మూవీకి రాక్ స్టార్ దేవీ శ్రీ ప్రసాద్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.

## భోజనం సరిగ్గా పెట్టడం లేదని రోడ్డెక్కిన విద్యార్థులు



**నాగర్‌కర్నూల్, నవంబర్ 12 ( వెలుతురు):**
నాగర్‌కర్నూల్ వెల్దండ మండల కేంద్రంలోని బీసీ సంక్షేమ వసతి గృహం విద్యార్థులు రోడ్డెక్కారు. హాస్టల్‌లో భోజనం సరిగ్గా పెట్టడం లేదని, కనీస వసతులు లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం శ్రీశైలం ప్రధాన రహదారిపై బైఠాయించారు. కలెక్టర్ రావాలంటూ, హాస్టల్ వార్డెన్‌ను తొలగించాలంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. విద్యార్థుల ధర్నాతో రోడ్డుపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విద్యార్థులను బుజ్జగించే ప్రయత్నం చేశారు.

## వాకింగ్ చేస్తుండగా న్యాయవాదిపై దాడి

**హైదరాబాద్, నవంబర్ 12 ( వెలుతురు):**
ఖైరతాబాద్‌లో దారుణం చోటు చేసుకుంది. మార్నింగ్ వాక్‌కు వెళ్లిన న్యాయవాదిపై ఓ దుండగుడు కత్తితో దాడి చేశాడు. మొబైల్ లాక్కొని పారిపోయాడు. వివరాల్లో వెళ్తే.. న్యాయవాది కల్యాణ్ ఎప్పటిలాగే మార్నింగ్ వాక్ చేస్తుండగా అకస్మాత్తుగా గుర్తు తెలియని దుండగులు అతడిపై కత్తితో దాడి చేశారు. సెల్‌ఫోన్ లాక్కున్నారు. వారి నుంచి రక్షించుకునే క్రమంలో కల్యాణ్ చేతికి గాయమైంది. చికిత్స కోసం ఓ ప్రైవేట్ దవాఖానాలో జాయిన్ అయ్యారు. కల్యాణ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మూడు బృందాలతో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. కాగా, దాడికి పాల్పడింది. సెల్‌ఫోన్స్ దొంగలించే ముఠా అయి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు.

## జగిత్యాల జిల్లాలో రైతుల పోరుబాట
### లాంగ్‌మార్చ్‌కు సిద్ధం



**జగిత్యాల, నవంబర్ 12 ( వెలుతురు):**
జగిత్యాల జిల్లాలో రైతులు మరోసారి పోరుబాట పడుతున్నారు. రైతు భరోసా, రుణమాఫీ, వరికి బోనస్‌పై కాంగ్రెస్ సర్కారు చేస్తున్న మోసాలను ఎండగట్టేందుకు సిద్ధమయ్యారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను విస్మరించడం, కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలను అటకెక్కించడాన్ని నిరసిస్తూ నేడు కోరుట్ల నుంచి జగిత్యాల వరకు లాంగ్‌మార్చ్ చేయడానికి సిద్ధమయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం కోరుట్లలో రైతు పాదయాత్రను బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావుతో కలిసి రైతు పాదయాత్రను ప్రారంభించారు. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల నేతృత్వంలో చేపట్టే ఈ పాదయాత్రలో రైతులు, రైతు కూలీలు, రైతు నాయకులతోపాటు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, మాజీ మంత్రులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వీధులన్నీ గులాబీ మయమయ్యాయి.

## పోలీసుల అదుపులో 52 మంది
### అధికారులను తరిమికొట్టిన రైతులు
### విచారిస్తున్న పోలీసులు



**వికారాబాద్, నవంబర్ 12 ( వెలుతురు):**
లగచర్ల ఘటనలో 52 మందిని అదుపులోకి తీసుకున్నామని జిల్లా ఏస్పీ నారాయణరెడ్డి తెలిపారు. అధికారులపై దాడి ఘటనలో కుట్ర కోణంపై విచారణ చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. అధికారులపై దాడి చేసిన వారిలో సురేష్ కీలకంగా వ్యవహరించారన్నారు. రాజకీయ కోణంలో కూడా విచారణ చేస్తున్నామని, విచారణలో అన్ని తెలుస్తాయన్నారు. కాగా, తమ భూములు గుంజుకునే ప్రయత్నాలపై కట్టలు తెంచుకున్న ఆగ్రహంతో లగుచర్ల రైతులు తిరగబడ్డారు. ఫార్మా కంపెనీకి భూములు ఇచ్చేది లేదని ఏకంగా కలెక్టర్, అదనపు కలెక్టర్ సహా ఇతర అధికారులపైకి దండెత్తి దొరికినోళ్లను దొరికినట్టు తరిమికొట్టారు. కడా స్పెషల్ ఆఫీసర్, పరిగి డీఎస్పీని చుట్టుముట్టి మరీ చితకబాదారు. దీంతో అర్ధరాత్రి నుంచే పోలీసు బలగాలు భారీ ఎత్తున లగచర్లను చుట్టుముట్టాయి. కరెంటు తీసేసి ప్రతి ఇంటిని జల్లడపట్టారు. అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. అదే సమయంలో అక్కడికి చేరుకున్న రిపోర్టర్లు, ఫొటోగ్రాఫర్లను అడ్డుకున్నారు. ఎక్కడికక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటూ చేస్తూ ఎవరిని అనుతించడం లేదు. ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. కొడంగల్ నియోజకవర్గ పరిధిలో అర్ధరాత్రి నుంచే ఇంటర్నెట్ సేవలు పని చేయడం లేదు. నియోజకవర్గంలోని గిరిజన తండాలు పోలీసుల చక్రబంధంలో విలవిల్లాడుతున్నాయి. మీడియాపై కూడా అంక్షలు విధించారు. అసలు కొడంగల్‌లో ఏం జరుగుతుందోనని లంబాడి సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఫార్మా క్లస్టర్లు వ్యతిరేకిస్తే ఇంత దారుణమా అంటూ వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# రుషికొండ భవనాలపై ప్రజల సలహాలు



**విశాఖపట్టణం, నవంబర్ 12 ( వెలుతురు):**
విశాఖ పర్యటనలో రుషికొండ కట్టడాలను పరిశీలించిన సీఎం చంద్రబాబు..విలాసాల కోసం పర్యావరణాన్ని విధ్వంసం చేసి ప్యాలెస్ కట్టుకున్నారని మండిపడ్డారు. రాజులు, చక్రవర్తులు కూడా ఇలాంటి భవనాలు నిర్మించుకోలేదన్న ముఖ్యమంత్రి?వందల కోట్ల ప్రజాధనంతో వ్యక్తిగత విలాసాల కోసం కట్టిన ఈ భవనాలను ఎలా ఉపయోగించుకోవాలో ఆలోచిస్తున్నామన్నారు. ఈ మేరకు సలహాలు-సూచనలను ఇవ్వాలంటూ ప్రజలకు సూచించారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సుమారు రూ.500 కోట్లు ఖర్చు చేసి రుషికొండపై ఏడు బ్లాక్‌ల్లో భవనాలు నిర్మించారు. అయితే జగన్ ప్రభుత్వం ఓటమి పాలవడంతో..ఈ భారీ భవనాలు చర్చనీయాంశమయ్యాయి. గత నాలుగు నెలలుగా ఇక్కడి భవనాలు, ఉద్యానవనాల నిర్వహణ, విద్యుత్ వినియోగం కోసం పెద్దమొత్తంలో ఖర్చు చేస్తోంది ప్రభుత్వం. దీంతో ప్రజాధనం దుర్వినియోగం అవుతుండడంతో.. దీనిపై ఒక నిర్ణయానికి రావాలని భావిస్తోంది ఏపీ ప్రభుత్వం.మరోవైపు రుషికొండ భవనాలను ఏపీ రాష్ట్ర మ్యూజియంగా మార్చాలంటోంది..బుద్దిస్ట్ మాన్యుమెంట్స్ ప్రొటక్షన్ కమిటీ. ఉత్తరాంధ్రలో లభించిన బౌద్ధ అవశేషాలను భవనాల్లో ప్రదర్శనకు ఉంచాలని చెబుతోంది. జాతీయ-అంతర్జాతీయ సెమినార్ల కోసం పరిశోధకులకు కావలసిన సాంకేతిక సౌకర్యాలు కల్పించేలా భవవాలను వాడుకోవాలని ప్రభుత్వానికి ఆ సంస్థ సూచిస్తోంది.గతంలో ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయం కోసం రుషికొండలో భవనాలను నిర్మించినట్టు ప్రచారం జరిగింది. అయితే జగన్ ప్రభుత్వం ఓటమిపాలవడంతో.. ఇప్పుడు వాటిని కూటమి సర్కార్ ఎలా ఉపయోగించుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది. మరోవైపు రుషికొండలో భవనాలను చూసి ఆశ్చర్యపోతున్న చంద్రబాబు.. అమరావతిలో అలాంటి భవనాలు ఎందుకు కట్టలేకపోయారని ప్రశ్నిస్తోంది..వైసీపీ. రుషికొండలో నిర్మించిన అద్భుతమైన కట్టడాలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆ పార్టీ మండిపడుతోంది.నిర్వహణపరంగా చూస్తే రుషికొండ భవనాలు ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కావడంతో.. ఈ భవనాలను ఏం చేయాలి? ఏ విధంగా ఉపయోగించాలి? అనే విషయాలపై ప్రభుత్వం ప్రస్తుతం దృష్టిపెట్టింది. మరోవైపు భవనంపై వివిధ సంఘాలు పలు సూచనలను ప్రభుత్వం ముందు ఉంచుతున్నాయి. మరి దీనిపై కూటమి సర్కారు ఏ విధంగా ముందుకు వెళ్తుందో చూడాలి

6 నెలల నుంచి నిరుపయోగం: ఈ ప్యాలెస్‌ల కంటే ముందు.. ఈ రిషికొండపై హరిత రిసార్ట్స్ ఉండేది. ప్రభుత్వానికి లక్షల్లో ఆదాయం తెచ్చిపెడుతున్న రిసార్ట్స్‌ని కూల్చేసి.. కొండను తొలిచి.. 22 ఎకరాలను చదును చేసి.. ఈ భారీ నిర్మాణాలను చేపట్టారు. ఈ ప్యాలెస్ కోసం టూరిజం శాఖకు చెందిన కాటేజీలను కూల్చడమే కాదు.. దీనికి పర్యావరణ అనుమతులు కూడా తీసుకోలేదని వాదనలు ఉన్నాయి. నాలుగున్నర ఎకరాల్లో భారీ భవనాలు నిర్మించారు. ఐదు ఎకరాల్లో వందలాది మొక్కలతో.. ల్యాండ్ స్కేపింగ్, బ్యూటిఫికేషన్ పనులు చేపట్టారు. ఈ నిర్మాణాలు జరుగుతున్న సమయంలో.. సెవెన్ స్టార్ హోటల్, కన్వెన్షన్ సెంటర్, కాటేజీలు నిర్మిస్తున్నామని మభ్య పెట్టారు. కానీ.. ఐదు బ్లాకుల్లో బెడ్ రూంలు, డైనింగ్, లివింగ్ రూమ్స్, మీటింగ్ హాల్స్ నిర్మించారు. రాజభవనంలా.. విశాలంగా, విలాసవంతంగా ఈ ప్యాలెస్‌లను తీర్చిదిద్దారు. మాయాబజార్ సినిమాలోని మయసభను తలపించేలా పెద్దపెద్ద గదులు, హాల్స్, ఫర్నీచర్‌తో నింపేశారు. పైగా.. ప్రతి నెలా లక్షల రూపాయలు మెయింటెనెన్స్ కోసం ఖర్చవుతుండటం.. అదనపు భారంగా మారింది. ఇప్పటివరకు ఒక్క విద్యుత్ శాఖకే.. 85 లక్షల కరెంటు బిల్లులు చెల్లించారట. దీనికితోడు.. గార్డెన్ మెయింటెనెన్స్, ఈ ప్యాలెస్‌కు సెక్యూరిటీ, రోజూ పనిచేసే సిబ్బందికి జీతాలు.. ఇలా నెలకు లక్షల్లో చెల్లించాల్సి వస్తోందని చెబుతున్నారు.ఉత్తరాంధ్రలో ఇరిగేషన్ ప్రాజెక్టులు కోసం 400కోట్లు ఖర్చు పెట్టలేదు కానీ రుషికొండ కోసం 420 కోట్లు పెట్టారన్నారు. ప్రజా కోర్టులో రుషికొండలో జరిగిన నేరంపై చర్చ జరగాలన్నారు. ఇక్కడ విలాసవంతమైన భవనాలు చూసి మైండ్ బ్లాంక్ అయిందన్నారు. పర్యాటక శాఖకు కూడా రుషికొండ కాస్ట్లీ ఎఫైర్ అయ్యిందన్నారు. రుషికొండ కోసం ప్రజాస్వామ్యం భారీ మూల్యం చెల్లించిందన్నారు. రుషికొండ చర్చ అవసరం లేదు శిక్ష మిగిలిందన్నారు.ఈ వ్యవహారంలోనే సర్వత్రా విమర్శలు రావడంతో పర్యాటక భవనాలని తొలుత ప్రచారం చేసిన వైసీపీ నేతలు తర్వాత పరిపాలన భవనాలని ప్లేట్ మార్చేశారు. కానీ ఇప్పటికీ కూడా వైసీపీ నేతలు ఈ భవనాల వ్యవహారంలో మాట్లాడుతున్న వ్యాఖ్యలు ప్రజలను సైతం అయోమయనికి గురి చేస్తున్నాయి. రుషికొండలో జగన్మోహన్ రెడ్డి నిర్మించిన భవనాలు చూసి చంద్రబాబు ఆశ్చర్య పోతున్నారని ఆయన సెటైర్లు వేశారు. ఇలాంటి భవనాలు అమరావతిలో తామెందుకు కట్టలేకపోయామో అని చంద్రబాబు ఆలోచించాలని అన్నారు అంబటి.రిషికొండ ప్యాలెస్‌కు సంబంధించి కూటమి నేతలు.. ప్రజాధనాన్ని వృధా చేశారని.. ఆ భావనలను సొంత అవసరాల కోసం మాజీ సీఎం నిర్మించారని చెబుతున్నారు. మరోవైపు వైసీపీ నేతలు మాత్రం రుషికొండలో ఉన్నవి ప్రభుత్వ భవనాలే. ప్రభుత్వానికి సంబంధించిన ఆస్తులు అంటూ వ్యాఖ్యానిస్తున్నారు. విశాఖపట్నానికి గత ప్రభుత్వం ఇచ్చిన ప్రాధాన్యం దృష్టిలో ఉంచుకుని ఈ భవనాలను నిర్మించారని చెబుతున్నారు. వాటిని ఎలా వినియోగించుకోవాలన్నది ప్రభుత్వం ఇష్టమంటున్నారు. ఇరు వర్గాల వైఖరి ఎలా ఉన్నప్పటికీ భారీ మొత్తంతో నిర్మించిన భవనాలు నిరుపయోగంగా ఉండడం పట్ల ప్రజలు సైతం పెదవి విరుస్తున్నారు.

# రగిలిపోతున్న వేమిరెడ్డి...



**నెల్లూరు, నవంబర్ 12 ( వెలుతురు):**
ప్రముఖ పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి.. నెల్లూరు జిల్లా రాజకీయాల్లో గత దశాబ్దకాలంగా చక్రం తిప్పుతున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చేందుకు 2019లో జరిగిన ఎన్నికల్లో ఆయన కీలక పాత్ర పోషించారు. అప్పటినుంచి వైసీపీలో కొనసాగుతూ పార్టీకి అండదండ జిల్లాలో తానే అన్నట్లు వ్యవహరిస్తూ వచ్చారు. ఫ్యాన్ పార్టీ అధికారంలో ఉండగా.. పార్టీ కార్యక్రమాలు అన్నిటికీ తనవంతు సహకారం అందించి ఆర్థికమగా అండగా నిలిచారు. అటువంటి నేతను పట్టించుకోలేదన్న విమర్శలు 2024 ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అధికమయ్యాయి. వాటిని నిజం చేస్తూ.. ఆయన చెప్పిన వారికి కాదని నెల్లూరు నగర ఎమ్మెల్యే టికెట్ ని.. జగన్ మరొకరికి కట్టబెట్టారు. దీంతో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తీవ్ర మనస్థాపానికి గురై.. పార్టీకి రాజీనామా చేసి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.ఆర్థికంగా వెన్నుదన్ను ఉన్న వేమిరెడ్డి లాంటి నేత పార్టీలో చేరడంతో.. తెలుగుదేశం పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సాహం నింపింది. ఆయన చేరికతో మాజీ ఎమ్మెల్యేలు నేతలు ఆయన ఇంటికి క్యూ కట్టారు. ఘనంగా పార్టీలోకి ఆహ్వానించి కండువాలు కప్పి శుభాకాంక్షలు చెప్పారు. ఆ తర్వాత పరిస్థితుల్లో కొద్ది కొద్దిగా మార్పు వచ్చింది. పార్టీ అధికారంలోకి రాగానే కొద్దిరోజుల పాటు ఆనందంతో శుభాకాంక్షలు చెప్పిన నేతలు ఆ తర్వాత క్రమేపి ఆయనను కలవడం ఆపేశారట. తనకు కేటాయించిన బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించి.. పార్టీని అధికారంలోకి తీసుకురావడమే.. తన వంతు భావించిన ఆయన.. ఇప్పుడు వ్యాపారాలలో కాస్త బిజీ అయ్యారట. అయితే ఇప్పుడు నేతల తీరులో కూడా మార్పు వచ్చిందని.. వేమిరెడ్డిని పట్టించుకునే నేతలే కరువయ్యారని జోరుగా చర్చ జరుగుతుందట.రీసెంట్ గా జరిగిన నెల్లూరు డీఆర్సీ సమావేశంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి ఘోర అవమానం జరిగింది. మండలి సమావేశంలో ఇంచార్జిగా వ్యవహరించిన రూరల్ ఆర్డీవో అనూష.. అక్కడికి వచ్చిన వారి పేర్లన్నీ చదివి ఎంపీ వేమిరెడ్డి పేరును మాత్రం విస్మరించారట. పేరు పిలవకపోవడమే కాకుండా, బొకే కూడా ఇవ్వలేదని వేమిరెడ్డి అలిగారు. దీంతో ఆయన తన భార్య, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డిని తీసుకుని వేదికపై నుంచి వెళ్లిపోయారు. దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, మంత్రి నారాయణ కూడా అదే వేదికపై ఉన్నారు. వేమిరెడ్డి హఠాత్తుగా లేచి వెళ్లిపోతుండటంతో ఆయన కారు వరకు వెళ్లి మంత్రి ఆనం సముదాయించేందుకు ప్రయత్నించారు. అయినా ఫలితం లేకుండా పోయింది.ఆ తర్వాత తన వెంట వచ్చిన సతీమణి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిని.. సమావేశంలో పాల్గొనాలని చెప్పడంతో ఆమె మీటింగ్ లో పాల్గొన్నారు. నేను మటుకు ఇక రాను అని వేమిరెడ్డి సీరియస్ గా అక్కడి నుంచి వెళ్లిపోయారు. అయితే మంత్రులకు పూల బొకేలు అందించి స్వాగతాలు పలికిన అధికారులు.. ఎంపీ వేమిరెడ్డిని ఎందుకు విస్మరించారో ఇప్పటికీ అంతుపట్టని పరిస్థితి నేతల్లో నెలకొంది.ఈ వ్యవహారం చూస్తే పార్టీ అధికారంలోకి వచ్చేందుకు.. వేమిరెడ్డిని వాడుకున్న నేతలు ఇప్పుడు ఆయనను దూరం పెడుతున్నారని విమర్శలు వస్తున్నాయి. నాడు వైసీపీలో చక్రం తిప్పిన నేత.. ప్రస్తుతం ఉన్న పార్టీ నేతలకు రుచించలేదా అన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చిన నాలుగు నెలలకే ఇంత మార్పు వచ్చి అవమానపడేలా నేతలు, అధికారులు ఎందుకు వ్యవహరిస్తున్నారు.. అసలు ఆయన వెనుక ఏం జరుగుతుంది అన్న విషయంపై జిల్లాలో జోరుగా చర్చ జరుగుతుంది. తెలుగుదేశం పార్టీకి ఆర్థిక పరిపుష్టిని ఇచ్చిన వేమిరెడ్డి లాంటి సీనియర్ నేత పార్టీలో కొనసాగే పరిస్థితి ఉంటుందా అని కూడా పొలిటికల్ వర్గాల్లో చరచర జరుగుతోంది.ఎన్నికల ముందు తన భార్య ప్రశాంతి రెడ్డికి టికెట్ అడిగితే జగన్ ఏవేవో సాకులు చెప్పి పట్టించుకోలేదట. అంతే కాకుండా వేమిరెడ్డిని ఎంపీ అభ్యర్థిగా ప్రకటించినా.. ఆయన పరిధిలో ఉండే నెల్లూరు సిటీ స్థానంలో ఓ జూనియర్ నేతకు టికెట్ ఇచ్చేశారు. దీంతో అలిగిన వేమిరెడ్డి వైసీపీని వీడి టీడీపీలోకి వెళ్లి అదే నెల్లూరు ఎంపీగా గెలవడంతో పాటు తన భార్యను కోవూరులో గెలిపించుకున్నారు. దీంతో వేమిరెడ్డి అలక, చరిత్ర తెలిసిన వారెవరూ ఆయనతో పెట్టుకోరని ఆయన అభిమానులు చెబుతున్నారట. ఏదేమైనా ఎంపీ వేమిరెడ్డి ఎన్నికలకు వైసీపీలో అవమానాలను ఎదుర్కొన్న వేమిరెడ్డి.. ఇప్పుడు టీడీపీలో కూడా అవమానాలకు గురవుతున్నారని చర్చ జరుగుతోంది. ఈ ఊహాగణాలకు పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు ఎలా చెక్ పెడతారు ? అవమానాలతోనే వేమిరెడ్డి పార్టీలో కొనసాగుతారా ? వేమిరెడ్డి భవిష్యత్తు కార్యాచరణ ఏంటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

# భారత్ కు బాసటగా అగ్రరాజ్యం



**వాషింగ్టన్, నవంబర్ 12 ( వెలుతురు):**
అమెరికా అధ్యక్ష ఎన్నికలు ముగిశాయి. హోరాహోరిగా జరిగిన ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డోనాల్డ్ ట్రంప్ తన సమీప ప్రత్యర్థి, డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలపై విజయం సాధించారు. అధ్యక్షుడిగా విజయం సాధించిన నేపథ్యంలో త్వరలో ట్రంప్ ప్రమాణ స్వీకారం చేయబోతున్నారు. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ గెలిచిన తర్వాత.. ప్రపంచం మొత్తం అతడి పరిపాలన ఎలా ఉండబోతుందో అంచనా వేస్తోంది. ఈ క్రమంలో భారత మీడియా కూడా ట్రంప్ పరిపాలించే విధానంపై విశ్లేషణ చేసింది. ముఖ్యంగా అమెరికా ? భారత సంబంధాలు ఎలా ఉంటాయోనని ఒక అంచనా వేసింది. ఎన్నికల ప్రచారం సమయంలో " అమెరికాకు సంబంధించి ఫారిన్ అఫైర్స్ ను పునరుద్ధరిస్తామని" ట్రంప్ పదే పదే ప్రకటించారు. అమెరికా అధ్యక్షుడిగా తొలిసారి ఎన్నికైన తర్వాత.. తమ దేశానికి సంబంధించిన ప్రయోజనాల విషయంలో ట్రంప్ విశేషమైన ప్రాధాన్యం ఇచ్చారు. ముఖ్యంగా ఇరాన్ అణు ఒప్పందం, పారిస్ వాతావరణ ఒప్పందం అందులో ముఖ్యమైనవి. ఇక కీలకమైన అంతర్జాతీయ ఒప్పందాలను కూడా ట్రంప్ వివిధ దేశాలతో కుదుర్చుకున్నారు. కొన్ని దేశాలతో స్నేహపూర్వకంగా మెలిగారు. మరికొన్ని దేశాలతో యుద్ధ వాతావరణం కొనసాగించారు. అమెరికా ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉన్న ఏ విధానాన్ని అయినా సరే ట్రంప్ తోసిపుచ్చారు. ఇప్పుడు మళ్లీ అమెరికాను అగ్ర పథం లో నిలబెడదామని ట్రంప్ ఎన్నికల సమయంలో పదేపదే వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో ట్రంప్ మరొకసారి అమెరికా అధ్యక్షుడైన తర్వాత.. భారతదేశంలో సహా ఇతర దేశాలతో అమెరికా కుదుర్చుకున్న ఒప్పందాలపై ప్రభావం చూపించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. దౌత్యం, వలసలు, వాణిజ్యం, సైనిక సహకారం వంటివి ప్రధాన పాత్ర పోషిస్తాయని సమాచారం.భారత్ అమెరికా మధ్య వాణిజ్య సంబంధాలు ఎన్నో సంవత్సరాల నుంచి సాగుతున్నాయి. ఈ క్రమంలో ఇటీవల అమెరికా నుంచి ఇతర దేశాలకు ఎగుమతి చేసే ఉత్పత్తులపై అత్యధిక సుంకాలను విధిస్తున్నారని ట్రంప్ మండిపడ్డారు. తాము కూడా ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై అదే విధంగా వసూలు చేస్తామని హెచ్చరించారు. అయితే ఈ జాబితాలో భారత్ కు మినహాయింపు లభించే అవకాశం ఉండకపోవచ్చు.. భారత్ గొప్ప దేశమని, మిత్ర దేశమని, మోడీ తనకు మంచి మిత్రుడని, గొప్ప నాయకుడని ట్రంప్ వ్యాఖ్యానించారు. అదే సమయంలో పన్నుల విషయాన్ని ప్రస్తావించారు. ఈ ప్రకారం చేసుకుంటే ట్రంప్ ఎలా వ్యవహరిస్తారు అనే విషయాన్ని ప్రముఖంగా ప్రస్తావించాల్సిన అవసరం లేదు.మన దేశం నుంచి అమెరికాకు ఉద్యోగాల నిమిత్తం అనేకమంది వెళు ్తంటారు. హెచ్ -1 బీ వీసాల మీదుగా వారు అమెరికాకు వెళు ్తంటారు. మన దేశానికి చెందిన ఐటీ కంపెనీలు ఇలా అమెరికాకు పంపిస్తుంటాయి. ఈ క్రమంలో ఈ విధానాన్ని ట్రంప్ తీవ్రంగా వ్యతిరేకించారు. అంతేకాదు ఆయన అధ్యక్షుడిగా ఉన్నప్పుడే అమెరికా జీతాలతో సమానంగానే హెచ్ ? 1 బీ వీసా దారులకు ఇవ్వాలని ప్రతిపాదన వచ్చింది.అమెరికా భారత్ మధ్య సైనిక ఒప్పందాలు ఎప్పటినుంచో ఉన్నాయి. బైడన్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్, అమెరికాకు చెందిన జనరల్ ఎలక్ట్రిక్ ఏరోస్పేస్ కీలక ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఇవే కాకుండా క్రిటికల్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీ ఒప్పందం కూడా రెండు దేశాల మధ్య జరిగింది. అమెరికా అధ్యక్షుడిగా ఎవరున్నప్పటికీ పసిఫిక్ ప్రాంతంలో చైనా ను నిలువరించడం ప్రధాన లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. ఈ ప్రకారం చూసుకుంటే రెండు దేశాల మధ్య సైనిక సహకారం కొనసాగే అవకాశం కనిపిస్తోంది. రెండు దేశాల ఉమ్మడి లక్ష్యానికి క్వాడ్ కూటమి కూడా సహకరించే అవకాశం కనిపిస్తోంది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా అనేక సందర్భాల్లో తన వాణి వినిపించిన ట్రంప్.. పాకిస్తాన్ తో చేస్తున్న పోరాటంలో భారత్ కు సహకరించవచ్చని తెలుస్తోంది.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICCATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com